ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక




"నవ్వులబాట"

4-5-49 ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల 4 అణాలు


హంపీ క్షేత్రం:

దివాకర్ పర్యటన





భారతప్రభుత్వ ఉపమంత్రి ఆర్. ఆర్. దివాకర్ గారు హోస్పేటవద్ద తుంగభద్ర ప్రాజెక్టు డామ్ ప్రదేశాన్ని పరిశీలించుచున్నారు. చిత్రంలో కేంద్ర వ్యవసాయ నీటి పారుదల సంఘ అధ్యక్షుడు ఎ. ఎస్. ఖోస్లా ఎలెక్ట్రిసిటి ఛీఫ్ ఇంజనీరు సుందరం మొదలయినవారు కలరు.



తుంగభద్ర ప్రాజెక్టుకు అనుబంధంగా విద్యుచ్ఛక్తి ఉత్పత్తి నిమిత్తం 'ఫోర్ బే' ఎక్కడ నిర్మించవలెననే విషయమై పరిశీలనార్థం భారతప్రభుత్వ సమాచార శాఖా మంత్రి ఆర్. ఆర్. దివాకర్ అధ్యక్షుడుగా గల ఉపసంఘంవారు ఇటీవల హంపీశిథిలాలను దర్శించినప్పటి దృశ్యాలు.



ఢిల్లీలో, ఆంటి - మలేరియల్ ప్రదర్శనాన్ని జనరల్ కరియప్ప ప్రారంభించారు. శ్రీమతి రాజకుమారి అమృతకౌర్ "మాజిక్ షో" అనే ప్రదర్శన యంత్రాన్ని చూస్తున్న దృశ్యం.



మద్రాసు రేడియో స్టేషనులో శ్రీ దివాకర్ గారు పత్రికాసంపాదకులతో తేనేటివిందు స్వీకరిస్తున్న దృశ్యం.


ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0 విడిప్రతిక అణాలు 0-4-0	ప్రతిబుధవారమున ప్రకటింపబడును	సంపుటము 41 సంచిక 33

ఒరు లేయవి యొనరించిన నరవర! యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్.(మహాభారతము)


Founder : K. NAGESWARA RAO

విరోధి సంవత్సర వైశాఖ శుద్ధ షష్ఠి బుధవారము



అమెరికా ప్రథమ అధ్యక్షపదవీ స్వీకారము

(1789 ఏప్రిల్ 30 తారీఖున అమెరికాఅధ్యక్షపదవికి ప్రారంభోత్సవం జరిగింది. జార్జి వాషింగ్టన్ సంయుక్తరాష్ట్రాలకు అధ్యక్షుడుగా ప్రమాణం స్వీకరించాడు. ఉత్సవప్రజను బాల్కనీలోనుంచి చూస్తున్న వాషింగ్టన్.)



ఆంధ్రపత్రిక

1949-వ సం॥ మేనెల 4-వ తేది బుధవారము

కామన్వెల్తులో భారతసభ్యత్వము

భారతీయులపట్ల బ్రిటిష్ స్వభావము పూర్తిగ మారనినాడే "కామన్వెల్తు" అను నామము అంకితమై యుండుటచే, కామన్వెల్తు స్వరూప స్వభావములు పూర్తిగా మారినను, ఆ పేరు అన్ననే భారత దేశమునకు స్మృతిపోషితమైన వ్యగ్రభావము, ద్వేషమును సహజముగ నిలిచిపోయినవి. స్వప్రతిభా విశేషముచే, కామన్వెల్తు సంస్థకు సర్వ సభ్య సమత్వ విశేష ప్రాయికమగు నూతన స్వరూపమును, స్వభావమును సమకూర్పింప జేయించి, బ్రిటిష్ రాజ లాంఛనమును, బాధారహితమగు అత్యల్ప లాంఛనముగ కామన్వెల్తు కూటమికి మాత్రమే చిహ్నముగ చేసి, కామన్వెల్తు నామమున కున్న పూర్వ వాసనల వలన భారత దేశీయుల కున్న వ్యగ్రతను స్వమనోదార్ఢ్యమువలన జయించి, సంపూర్ణ స్వతంత్ర రాజ్యముగ భారత దేశమునకు ఈ కొత్త కామన్వెల్తులో సభ్యత్వమును సంపాదించ గల్గుటచేతనే, పండిట్ నెహ్రూ కృషిని సాహసోపేతమగు, ప్రతిభాకృత్యముగ భారత ప్రధాని సర్దార్ పటేలు ప్రశంసించెను. నెహ్రూ కామన్వెల్తు సభ్యత్వమున కిచ్చిన నూతన స్వరూపముతో, కామన్వెల్తు బాంధవ్యములు తెగదెంచుకొన్న రాజ్యములకుకూడ ఈ నూతనపరిస్థితులలో మరల కామన్వెల్తు సభ్యత్వము అపేక్షణీయమా అని పునరాలోచించుకొను అవకాశమును గల్పించినవి.

నేటి కల్లోల రాజకీయప్రపంచమున కల్లోలసంఘమున నున్న వ్యక్తులకు రక్తబంధుత్వము లెంత అవసరమో, సమిష్టి రాజకీయకూటముల బంధుత్వము లంత యవసరమైనవి. కాని యూరపియన్, రాజకీయ కూటముల బంధుత్వము లన్నియు, పరస్పరసైనిక సహకార బాధ్యతలతో బంధితమై, ఏక ఆదేశలక్షితమగు మైత్రికన్న, సైనిక సహాయ ప్రయోజనములు ప్రాథమికములై, మిత్రత్వ, శత్రుత్వముల నాదేశించు సమిష్టి సంఘములుగ ఉద్భవించినవి. బంధుత్వము ప్రాతిపదికగ ఏర్పడి అవసరార్థము సంభవించి ప్రయోజనములకును, ప్రయోజనావసరములు ప్రాతిపదికగ సంభవించిన బంధుత్వములకును గల వైపరీత్యమూ, వ్యత్యస్తమును, తక్కిన యూరపియన్ కూటములను సంస్థలకును, కామన్వెల్తు అను సంస్థకును కలవు. ఈ స్వభావమును కామన్వెల్తునకు సమకూర్చి, గౌరవనీయమగు పాయిదాలో సమాన సభ్యత్వమును కామన్వెల్తులో నిలుపుకొనుటలోనే పండిట్ నెహ్రూ ప్రతిభ వెల్లడి యగుచున్నది. దూరదృష్టితో విచారించిన, భారత దేశమొకరి వలలో బడుట గాని, ఒకరిని వలలో వేసికొనుట గాని జరుగలేదని తేలగలదు.

బ్రిటిషు అధినివేశముల కూడలి అనునది అంతరించి, సమాన ప్రతిపత్తి గల స్వతంత్ర దేశముల సమాఖ్యగా ఈ కొత్త కామన్వెల్తు ఏర్పడినది. "బ్రిటన్" అన్న విశేషణమూ, "అధినివేశ"మను నామవాచకమునూ అంతరించినవి. బ్రిటిష్ రాజు విషయములో కామన్వెల్తు వ్యవహారములతో సంబంధించిన చిహ్నమగు లాంఛనచ్ఛాయ తప్ప, మరేవిధమగు సంబంధమునూ లేదు. భారత దేశము రిపబ్లిక్‌గా నుండి సభ్యత్వము మిగుల్చుకొనగలదు. భారత దేశము రాజరికమును అంగీకరించ నక్కరలేదు.

"శాంతికి, స్వేచ్ఛకు, అభివృద్ధికి కృషిచేయ స్వతంత్ర రాజ్యముల సమాఖ్యగా నిలబడగలము..."

"కామన్వెల్తు సంస్థను, దాని కార్య విధానములను పరిణత పరిస్థితుల కనుగుణముగా మార్పు చేయుచూ, లక్ష్య సాధనలో ఐక్యతను సంఘటితపరుచుకొనుటయందు, కామన్వెల్తునకుగల సంప్రదాయ సిద్ధమయిన సామర్థ్యము పునఃప్రతిష్ఠితమైనది" అని కామన్వెల్తు ఆదర్శమును, దృఢస్వభావమునూ, సభ్యదేశ్య ప్రధానులు తమ సంయుక్తప్రకటనయందు తెలిపిరి. అందతిశయోక్తి ఏమాత్రమును కనిపించలేదు.

ఈ ప్రకటనను బట్టియే కామన్వెల్తు నూతన రూపమును దిద్దుటలో భారత ప్రధాని కృషియే అధికముగ కలదని ఊహించవచ్చును. ఇతర కామన్వెల్తు దేశములను ఆ మార్గమున నడపుటకే భారత దేశము ప్రయత్నింపగలదు. ఈ సంయుక్త ప్రకటనలోని ఆశయములు అమలుజరుప సిద్ధముగ నున్నంత కాలమే భారతదేశ సహాకారము వారికి లభింపగలదు.

స్వతంత్ర రిపబ్లిక్‌గా నుండి కామన్వెల్తు సభ్యత్వము వహించ నిశ్చయించుట వలన, తత్సభ్యత్వ ప్రభావము, కామన్వెల్తు సరిహద్దులను దాటి కూడ ప్రసరించుట కాస్కారమున్నది. ప్రపంచసమస్యల పట్ల కామన్వెల్తు దేశముల వైఖరిపై భారతదేశ ప్రభావమధికముగ నుండగలదు. భారతదేశ సహాకారము లేనిదే, ఆగ్నేయ ఆసియాయందు, కామన్వెల్తు దేశములు తమ సమస్యలను పరిష్కరించుకొనుట కష్టము.

తాము చేరినది "మిలిటరీ కూడలి"లో కాదని భారతప్రధాని విస్పష్టముగ తెలియజేసెను. కామన్వెల్తు జయప్రదముగా నిలబడి ప్రపంచశాంతికి దోహదమివ్వవలెనన్న, "శాంతి, స్వేచ్ఛ, అభివృద్ధి" అను ఆశయములను దృష్టియం దుంచుకొని వాటి సాధనకు, సమిష్టికృషి యొనర్పవలెను.

భారతదేశము కామన్వెల్తునం దుండుటలో, కామన్వెల్తు తన ఆశయముల సాధించుటకు దోహదముగా నుండగలదు ఆ సంకల్పముతోనే, గతమును విస్మరించి, పునర్నిర్మాణమునకై భారత దేశము కామన్వెల్తులో నుండ నిశ్చయించి, తన ధైర్యస్థైర్యములను, దూరదృష్టిని ప్రకటించుకొనినది.

కాశ్మీర్ కమిషన్ ప్రతిపాదనలు

కాశ్మీర్ కమిషను, ఇంక చర్చలు, సంప్రదింపులు సాగించుట వలన ప్రయోజనము లేదని తెలుపుచూ, యుద్ధవిరమణ విషయమున తన కడపటి ప్రతిపాదనలను, భారత పాకిస్థాన్ ప్రభుత్వములకు సమర్పించి, "ఎట్టి అరమర లేకుండా వీనికి అంగీకరించి వారము రోజులలో సమాధానము తెలుపవలె"నని కోరినది.

భారతప్రభుత్వము సమాధాన మొసగుటకు ఈ గడువు చాలదని ప్రత్యుత్తర మిచ్చినట్లు తెలియుచున్నది.

అంతకన్న 1948 ఆగస్టు 13-వ నాటి తీర్మానపథకమునకు, ఈ కడపటి ప్రతిపాదనలు క్రమఘోరణిలో నున్న వనుట సందేహాస్పదమైనది. కమిషన్ భారతదేశమునకు వ్యతిరేకముగ వ్యవహరించినట్లు ఢిల్లీవర్గములు భావించుచున్న వని తెలియుచున్నది.

యుద్ధవిరమణతో ఏర్పరుచుకొనవలసిన సంధిసరిహద్దుల సమస్య ముఖ్యమైనది. జనవరి 1-వ తేదీ నాటి సరిహద్దును, తిత్వాల్ కనుమవంటి ఉత్తరభాగములలో పాకిస్థాన్ సైన్యములు ఆ తర్వాత అతిక్రమించిన వని రూఢిగ తెలిసినవిషయమే. మరొక ముఖ్యసమస్య అజాద్ కాశ్మీర్ సైన్యముల సమస్య. వీటివిషయమున భారత పాకిస్థాన్ ప్రభుత్వములతో జరుపుచున్న సంప్రదింపులలో ప్రతిష్టంభ ఏర్పడినట్లు గతమాసమధ్యమున నే తెలుపబడినది.

భారతప్రభుత్వము తన "మెమోయిర్"లో, అజాద్ కాశ్మీర్ సేనల విషయమై కమిషనును హెచ్చరించినది. ప్రప్రథమములో అజాద్ సైనిక చర్యల బాధ్యతలే తనకు లేవని చేతులు కడుగుకొనిన పాకిస్థాన్, తన పరిపూర్ణజోక్యమును విధిలేక యొప్పుకొనవలసివచ్చిన తర్వాత, ఇప్పుడు తెగబడి, "అజాద్ సైన్యముల ప్రతిపత్తిని ఐక్యరాజ్యసమితి కమిషన్ ఒప్పుకొని తీరవలె"నని అలజడి సాగించినది.

కమిషన్ తన ప్రతిపాదనలతో పాకిస్థాన్ కోరిన అజాద్ సైన్యముల ప్రతిపత్తిని, మూగగా ఒప్పుకొనినట్లే వ్యవహరించినది. యుద్ధవిరమణ నాటికి సైన్యములు ఏ ప్రాంతముల నాక్రమించుకొనియున్నవో అక్కడికే సంధి సరిహద్దు గీత ఉండవలెనని ప్రతిపాదించినది. ఇచట అజాద్ కాశ్మీర్ సేనల మాటనే ఎత్తుకొనలేదు. ఈ విధముగ ఏర్పడిన సరిహద్దులో పాకిస్థాన్ సేనలు ఉపసంహరింప బడినప్పటికీ, అజాద్ కాశ్మీర్ సేనలు అక్కడే యుండుట సంభవించును. ఈ సైన్యములో 32 డివిజనులున్నట్లు తెలియుచున్నది. వారక్కడుండగా జనవాక్య నిర్ణయ కార్యక్రమమునకు కావలసిన శాంతి పరిస్థితులు ఏర్పడవు. జనవాక్యమే యథార్థముగ నిర్ణయము కాజోదు. అజాద్ కాశ్మీర్ ఆధిపత్యము సాగిన, అక్కడికి బైటివారు ప్రవేశించుటయు, బీభత్సములో వెడలిపోయిన స్థానిక ప్రజలుస్వస్థానములలో ప్రవేశించుటకు, జనవాక్యనిర్ణయములో పాల్గొనుటకు ప్రతిబంధకముగ ఈ విదేశసైన్యములు నిలుచుట జరుగును. ఐక్యరాజ్య సమితి ఈయని హోదాను, ఆజాద్ సేనలకును వారి ప్రభుత్వమునకు, ఈ కమిషన్ ఇచ్చుచున్నట్లే చెప్పవచ్చును.

భారత, పాకిస్థాన్ సేనలు విరమించిన తర్వాత అజాద్ సేనల నట్లే నిలిపి జనవాక్యమును నిష్పాక్షికముగను యథార్థముగను నిర్ణయించెద మనుట, కేవలము భ్రమల కల్పించి భ్రమపడుటయే యగును. అజాద్ కాశ్మీర్ సేనల నిరాయుధ మొనర్చి, అజాద్ కాశ్మీర్ నామమును రద్దొనర్చక పోయిన, కాశ్మీర్ విభజన తప్పనిసరి కావచ్చును. కాశ్మీర్ విభజనయే ప్రాథమికోద్దేశ్యముగ కాశ్మీర్ కమిషను వ్యవహరించుచున్న తప్ప. ఈ పరిస్థితిని మార్చు వేరు విధమగు ప్రతిపాదనలను కమిషన్ చేయవలసియున్నది.

ఇప్పటి ప్రతిపాదనలను భారత ప్రభుత్వము తిరస్కరించినను, అందులో ఆశ్చర్యముగాని, అపరాధముగాని కనిపించనేరవు.

స్వదేశ విషయాలు:

గ్రామస్వరాజ్య వ్యవస్థాపనకు మద్రాసుప్రభుత్వ సంకల్పం

చెన్నపట్నంపై హక్కు విడిచిపెట్టడం అసాధ్యమని ఆంధ్రరాష్ట్రకాంగ్రెస్ అభిప్రాయం

గ్రామస్వరాజ్య వ్యవస్థను స్థాపించాలనే సంకల్పంతో చెన్నరాష్ట్ర ప్రభుత్వం ఒక శాసనం రచించి, దీన్నిగురించి ప్రజాభిప్రాయం తెలుసుకోవాలనే తలపుతో ముందుగా ప్రకటించింది.

గ్రామజీవనం, గ్రామఆర్థిక విషయాలకు, సంబంధించినంతవరకు స్వతంత్ర అధికారములు ఇచ్చి, సాధ్యమైనంతవరకు అన్యుల అజమాయిషీని తగ్గించవలెననియు, గ్రామ పంచాయతీలను స్వయంసంపూర్ణమైన స్వపరిపాలిత సంస్థలుగా తయారుచేయుట ఈ బిల్లుయొక్క ఉద్దేశ్యమనీ మద్రాసు ప్రభుత్వం ప్రకటించింది.

దీనిప్రకారం అయిదువందల జనాభాగల ప్రతిగ్రామమునకు ఒక పంచాయతీ ఏర్పాటు చేయబడుతుంది. జనాభా తక్కువ ఉన్న గ్రామములను పరిసరగ్రామములకు చేర్చి ఒక పంచాయతీ ఏర్పాటు చేయబడును. ప్రజలయొక్కగాని, ఉద్యోగులయొక్కగాని ఇష్టముతో నిమిత్తంలేకుండా పంచాయతీలను విధిగ ఏర్పాటుచేస్తారు.

ఈ శాసనమయిన తరువాత రెండు సంవత్సరములలోగ పంచాయతీలు ఏర్పాటుచేయబడవచ్చునని తలచబడుచున్నది. 5,000 పైబడిన జనాభాగల పంచాయతీలు "మొదటి తరగతి" పంచాయతీలని పిలవబబడును. ఈ రకము పంచాయతీలలో పంచాయతీకి లోబడి పనిచేయు ఎగ్జిక్యూటివు ఆఫీసర్లను నియమించుటకు ప్రభుత్వము అధికారము వహించియుండును.

ఎన్నికవిధానము:

అవసరమునుబట్టి గ్రామమును ఎన్నిక నిమిత్తం వార్డుల క్రింద విభజించి, రహస్య ఓటింగు విధానముచే ఎన్నుకొనబడిన ప్రజాప్రతినిధులతో, పంచాయతీ ఏర్పరచెదరు. గ్రామ మునసబు పంచాయతీలో అధికారరీత్యా సభ్యుడుగ నుండును కాని పంచాయతీ మీటింగులలో ఓటు ఇచ్చు అధికార ముండదు. అధ్యక్షుడు సభ్యులచే గాక, ప్రత్యక్షముగ ఓటర్లచే ఎన్నుకొనబడును. ఏకులమునకుగాని వర్గమునకుగాని పంచాయతీస్థానములలో రిజర్వేషనుండదు. రాష్ట్రశాసన సభానియోజకవర్గ జాబితాలే పంచాయతీ ఎన్నికలకుకూడ ఉపయోగపడును. పంచాయతీకి నామినేషలుండవు. ప్రతిపంచాయతీకి సభ్యులచే ఎన్నుకోబడిన ఉపాధ్యక్షుడు ఉండును. అధ్యక్షుడు పంచాయతీచేయు తీర్మానములను విధిగ అమలుజరుపవలెను. అయితే ఏదైనా తీర్మానము ఆయన అభిప్రాయములో అమలుజరుగరానిదిగ తోచినచో వారు ప్రభుత్వాభిప్రాయము తెలుసుకొనవచ్చును. అధ్యక్షునిమీద, పంచాయతీమీద ప్రభుత్వమువారి తీర్పు బద్ధమైయుండును. దానికి తిరుగు లేదు. కొన్ని పరిస్థితులలో అధ్యక్షుడు తన అధికారమును దుర్వినియోగము చేసినగాని, ద్రవ్యాపహరణమొనర్చినగాని అట్టి పంచాయతీలను రద్దుచేయుటకు, లేదా పునర్నిర్మాణముచేయుటకు, ప్రభుత్వము వారికి అధికార ముండును. అధ్యక్షుని ఒకసారి తొలగించినప్పుడు ఒక ఏడాదిపాటు అతను ఎన్నికకు అనర్హుడు. అవినీతికి శిక్షించబడినచో అయిదు సంవత్సరములవరకు అనర్హుడు. అధ్యక్షుడు, ఉపాధ్యక్షునికి అన్నీ లేక కొన్ని అధికారములను వప్పగించవచ్చును. 15 రోజులు మించి అధ్యక్షుడు గ్రామాంతరము వెళ్లినచో అధికారము ఉపాధ్యక్షునకు సంక్రమించును.

నిర్వహించవలసిన కార్యములు:

గ్రామములకు సంబంధించిన రస్తాలు, తూములు, వంతెనలు నిర్మాణము, మరమ్మతు, పోషణ పంచాయతీలే నిర్వహించుకొనవలెను. రాచబాటలపైన కూడలిస్థలములలో దీపములు వెలిగించవలెను. మురుగుకాల్వలు త్రవ్వుట, గ్రామపారిశుధ్యం మొదలగునవి వీరి బాధ్యతే. స్మశానముల నిర్వహణ, మంచినీటి సరఫరా, చెరువు, దొరువులు, నూతులమరమ్మతు, ప్రజారోగ్యచర్యను తీసుకొనుట పంచాయతీలు నిర్వహించవలసిన పని.

న్యాయాధికారాలు:

గ్రామ న్యాయస్థానముల చట్టముక్రింద ప్రస్తుతము ఉన్న అధికారములకన్న సివిల్ క్రిమినల్ వ్యవహారాలలో విస్తృతాధికారము లిచ్చి గ్రామములలో న్యాయపాలన పంచాయతీలకిచ్చెదరు. మొదటి తరగతి పంచాయతీలలో రిజిస్ట్రేషను ఆఫీసు లేనిచోట రూ. 100/-విలువకు మించకుండా ఉన్న ఆస్తి సందర్భమున, స్టాంపు పన్ను అవసరము లేని పత్రములు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు రిజిష్టరు చేయించు అధికార మివ్వబడును. చిన్న నీటి వనరులు బాగుచేయు పని పంచాయతీలు చేయును. ఇప్పుడు నీటి వనరుల సలహాసంఘము లేమైన గ్రామాలలో ఉన్నచోట ఆ పనులు పంచాయతీకే వప్పగింత చేయవలెను. అట్టి చిన్న మరమ్మతులు చేయుటకు ఎకరానికి పావలా లేక అర్ధరూపాయి వీలునుబట్టి పన్ను వసూలు చేసుకొననిచ్చెదరు. స్థానిక చెరువులలో చేపలు పట్టించు హక్కు, నీటివనరులు, మురికినీటి కాల్వలు, గ్రామ కంతాలు సాముదాయక భూముల హక్కులు పంచాయతీలకే ఉండును. స్థానిక ధర్మనిధులు, ధర్మసంస్థలు ప్రభుత్వచిత్తానుసారము పంచాయతీపాలనకు వప్పగించడమగును. ఇతర పాఠశాలలు లేనిచోట ప్రాథమిక పాఠశాలలు ప్రారంభించి అవి ప్రభుత్వంవారి గ్రాంటును పొందవచ్చును. రిజర్వు చేయని ఫారెస్టులు, పశువుల పచ్చికబయళ్లు, పంటకళ్లాలు, తోపులు, పోరంబోకులు, గ్రామానికంతకు చెందినవి పంచాయతీలే చూచును. ఈ మధ్యన ఫారెస్టు శాఖవారు తీసుకున్న రిజర్వు ఫారెస్టు (రైతులవి) పాలన, అర్హమని తోచినచోట్ల పంచాయతీలకు తిరిగి వప్పగింతురు.

గ్రామసౌకర్యముల నిమిత్తం రహదార్ల ప్రక్కన పంచాయతీలు చెట్లను నాటి పోషించవచ్చును. పబ్లిక్ మార్కెట్టులు ప్రారంభించి నడుపుట, సంతలు, ఉత్సవాలు నడిపించుట, బళ్లు నిలచు స్థలాలు, పశువుల కొట్టాలు పెట్టుట, మాంసవిక్రయగృహాలు పెట్టి నడిపించుట పంచాయతీలు చేయవచ్చును. వ్యవసాయ పశుగణాభివృద్ధి, వ్యవసాయ ప్రదర్శనాల ఏర్పాటు చేయవచ్చును. గ్రామపరిశ్రమల ప్రోత్సహించుట, పఠనాలయములు, గ్రంథభాండారములు, వైర్లెస్ సెట్టులు, ఆటస్థలములు, వ్యాయామక్రీడశాలలు పెట్టుకొను అధికార మిచ్చెదరు.

వైద్యాలయాలు, మాతాశిశు సంరక్షణ గృహాలు నిర్వహించవచ్చును. ప్రజారోగ్యము, భద్రత, రక్షణ, సౌకర్యములకు సంబంధించిన ప్రజోపయోగకరమైన ఇతరపను లేవైన చేయవచ్చును.

ఆర్థికవిషయములు:

ఇంటిపన్ను, బళ్లపన్ను, వృత్తిపన్ను ప్రతి పంచాయితీలోను నిర్బంధము. పూరిగుడిసెలనిగాని, పేదవారి యిల్లు అనిగాని తోచిన పంచాయతీలు యింటిపన్ను లేకుండా చేయవచ్చును. పన్నుల గరిష్ఠ, కనిష్ఠ ప్రమాణములు ప్రభుత్వమువారు నిశ్చయించెదరు. గ్రామాలకు అనుకూలమైన ప్రకటనపన్ను, కావలిపన్ను మున్నగు వానిని ప్రభుత్వానుమతితో పంచాయతులు విధింపవచ్చును. ప్రభుత్వమువారు ఆయా సమయములలో తీర్మానించు ప్రకారము ఆయా పంచాయతీలలో వసూలగు ల్యాండు సెస్సును పూర్తిగాగాని కొంతగాని పంచాయతీలకు వప్పగించవచ్చును. రాష్ట్రంలోని ల్యాండ్ రెవిన్యూలో (నీటి సెస్సుతోకూడా) $12\frac{1}{2}\%$ తక్కువగాకుండా పంచాయతీలకు కేటాయించ బడును. పదివేల ఆదాయం లోబడి 5,000 జనాభాకు లోబడి ఉన్నట్లయితేనే ఈ సహాయం జరుగును. ప్రభుత్వంవారి ఇష్టానుసారము ప్రజోపయోగ కార్యముల నిమిత్తము ఆయా ప్రణాళికల నిమిత్తము విరాళములు ఇవ్వవచ్చును.

తనిఖీ, పర్యవేక్షణ:

ప్రతిపంచాయతీ లెక్కలతనిఖీ ఏటా జరుగవలెను. వారి పరిపాలన పర్యవేక్షణకు సంబంధించనివారి తనిఖీ చేయవలెను. అట్టి ఆడిటు కార్యములకు పంచాయితీలు ఎట్టి రుసుమునూ చెల్లించుకోనవసరములేదు.

జిల్లాబోర్డులకు పంచాయతీలపై ఇక ఎట్టి కంట్రోలు, తనిఖీ ఉండదు. ధనప్రాణరక్షణ సందర్భమున, అశాంతి చెలరేగినపుడు తప్ప పంచాయతీలపై కలెక్టర్ల కెట్టి అధికారము ఉండదు. (ఇప్పుడు స్థానికసంస్థల చట్టంలో ఉన్నట్లు.) డెప్యూటీ పంచాయతీఆఫీసర్లు, జిల్లాపంచాయతీఆఫీసర్లు డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ల సహాయంతో స్థానికసంస్థల ఇన్‌స్పెక్టర్లు గ్రామపంచాయతీల పాలనను తనిఖీ చేయుచుందురు. ప్రభుత్వ ఆధిపత్యముక్రింద ఈ వ్యవహారము నడచును.

పూర్వచరిత్ర:

పంచాయతీబిల్లు పూర్వగాథ గురించి ప్రభుత్వము ఇట్లు తెలిపినది. ప్రస్తుతము ఈ రాష్ట్రములో 7,200 పంచాయతీలు వున్నవి. కోటిమంది ఈపంచాయతీలక్రింద వున్నారు. ఈపంచాయతీలన్నీ మదరాసు స్థానికసంస్థల చట్టము (మదరాసుచట్టము XIV 1920) క్రింద పనిచేయుచున్నవి. ఈచట్టముక్రింద పంచాయతీలు జిల్లాబోర్డులు, జిల్లాబోర్డు అధ్యక్షుని అధీనమునందుంచబడినవి. ముఖ్యవిషయములలోనే గాక దైనందిన పరిపాలనలో కలుగచేసుకొను అధికారము వారి కివ్వబడినది. ఒక బజారునుగాని, కబేళానుగాని తెరచుటకుగాని, మూసి వేయుటకుగాని పంచాయతీకి అధికారము లేదు. దీనికి జిల్లాబోర్డు అనుమతి అవసరము. జిల్లాలోని పంచాయతీల బడ్జెటులను జిల్లాబోర్డు ఆమోదించనిదే అమలు జరుపుటకు వీలులేదు. పంచాయతీ విధించదలచిన పన్నురేటును జిల్లాబోర్డు అంగీకరించవలెను. జిల్లాబోర్డు అంగీకారములేనిదే పంచాయతీ స్వంతనిబంధనలుకూడ చేయవీలులేదు. దీనినిబట్టి పంచాయతీలకు స్వాతంత్ర్యం లేకుండాపోయింది.

పంచాయతీలను స్థానికసంస్థల చట్టము క్రిందినుండి తప్పించవలెనని 1940 నుండి ప్రభుత్వము ఆలోచించుచున్నది. అడ్వయిజర్ల కాలములో ఒక బిల్లు ప్రజాభిప్రాయముకొరకు ప్రకటించబడినది. స్థానికపాలనా ప్రవీణులు బిల్లును పరిశీలించినమీదట 1946 ఏప్రిల్లో శాసనముగ చేయబడెను. కాని దానిని అమలుజరుపు భారము కొత్త మంత్రివర్గమునకు వదిలివేయబడినది. కాని ఇంతవరకు శాసనము అమలుజరుపబడలేదు. మంత్రివర్గము ఆ చట్టము సమగ్రముగ లేదని భావించి గ్రామములకు నిజమైన స్వపరిపాలన, స్వాతంత్ర్యము నిచ్చు శాసనము తయారుచేసినది.

చెన్నపట్నం: ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ తీర్మానం:

భాషారాష్ట్ర నిర్మాణం గురించి కాంగ్రెస్ అగ్రనాయకత్రయ నివేదికపట్ల అసంతృప్తి వెల్లడించుచూ ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ కార్యవర్గం ఈవారం విజయవాడలో సమావేశమై ఒక తీర్మానం చేసింది. రాష్ట్రనిర్మాణానికి ముందు ఆంధ్రులు చెన్నపట్నంపై హక్కు వదులుకోవాలని నాయకత్రయ నివేదిక సూచించడం అన్యాయమనీ, బొంబాయిమాదిరిగానే చెన్నపట్నానికి కూడా ప్రత్యేక పరిపాలన ఏర్పాటు చెయ్యాలనీ ఈ తీర్మానం సూచిస్తున్నది.

తీర్మానం ఈ క్రిందిరీతిగా ఉంది: "నాయకత్రయ నివేదికపై పత్రికల అభిప్రాయమును అతిశ్రద్ధగ గమనించి, ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి ప్రజలంతా ఎంత ఆదుర్దా పడుచున్నారో గమనించినందున, యీ సంఘంవారు నాయకత్రయ నివేదికలో మదరాసు నగరం గూర్చి చేసిన నిరంకుశ నిర్ణయానికై ఎంతయు విచారించుచున్నారు. థార్ కమిటీ మదరాసు నగరాన్ని ప్రత్యేకరాష్ట్రంగా నియమించాలని శిఫార్సు చేసినాకూడా నాయకత్రయం వారు గమనించకుండుట శోచనీయము. బొంబాయిని ప్రత్యేక రాష్ట్రముగ నుంచ నంగీకరించియు మదరాసు విషయం ఇట్లు నిర్ణయించుటచే ఆ నిర్ణయం యొక్క అన్యాయం మరింత స్పష్టమగుచున్నది.

(20-వ పేజీ చూడుడు)



అమెరికా ఉద్యోగులు యూరప్ పునరుద్ధరణ వ్యయాలనుగూర్చి చర్చిస్తున్నారు.

జాతీయగీతము

శ్రీ దండిపల్లి వేంకటసుబ్బాశాస్త్రి

నేడు మన భారత సమాఖ్యకు జాతీయగీతమును నిర్ణయించు సమస్యకు ప్రాధాన్యము అతిశయించినది. నాయకులలో నేమి, పత్రికలలో నేమి జాతీయగీతమును నిర్ణయించే విషయంలో విభేదాలు ఏర్పడుతున్నాయి. తాత్కాలికముగా "జనగణమన" గీతమే జాతీయగీతముగా కేంద్రమంత్రివర్గమువారు నిర్ణయించినట్లు భారత ప్రధాని పండిత జవహర్‌లాల్ నెహ్రూ ఆగస్టు 25 వ తేది భారత శాసనసభలో ఒక సుదీర్ఘ ప్రకటన చేశాడు. ఆ సందర్భంలో పండిత నెహ్రూ 'వందేమాతరం' గీతమువిషయమై ప్రస్తావిస్తూ "'వందేమాతరం' మన జాతీయోద్యమానికి ఎక్కువ ప్రోత్సాహకరముగా వుండినది" అనుచు, గత విప్లవచరిత్రమును స్మృతిపథంలోకి తెచ్చి, "జనగణమన" గీతముయొక్క గానఫణితి విదేశాల్లో ప్రశంసింపబడటంచేత, "వందేమాతరం" ఫణితి అంత ఆకర్షణీయంగా లేకపోవటంచేత "జనగణమన" యే జాతీయగీతానికి తగివున్నట్లుగా స్పష్టపరిచాడు; రాజ్యాంగ పరిషత్తుకు సిఫారసు చేశాడు కూడా. పండిత నెహ్రూ ప్రకటన్నుబట్టి జాతీయగీతముయొక్క తుదినిర్ణయం రాజ్యాంగ పరిషత్తుపై ఆధారపడి వున్నట్లు తెలిసింది. అఖిలభారతకాంగ్రెసు సంఘమువారి తీర్మానాన్ని రాజ్యాంగపరిషత్తు ఆమోదించగలదు.

ప్రకృతము *'National' Anthem* అను ఇంగ్లీషు పదానికి 'జాతీయగీతము' అను పదమును వాడుతున్నాము. *'Anthem'* అనుపదమునకు 'విజయగానము' అని అర్థము. ఏ జాతియొక్క విజయమునైనను తెలుపుటానికే *'National Anthem'*—జాతీయగీత మని పేరు. అట్టి అభిప్రాయముతో మనము జాతీయగీతమును నిర్ణయించు సమస్యకు పూనుకొన్నట్లైతే ఏలాంటి చిక్కులుండవు. ఒక నిర్ణీతాభిప్రాయము లేక పెద్దపెద్ద సమస్యల విషయమై చర్చింపబూనుకొనుట నేడు పరిపాటిగా వుండటం దేశముయొక్క దౌర్భాగ్యము. ఇంక విచారిద్దాము.

"జనగణమన" గీతాన్ని జాతీయగీతముగా నిర్ణయించినంతమాత్రాన "వందేమాతరం" గీతముయొక్క గౌరవానికి భంగం వాటిల్లదనుకొంటాను. కాంగ్రెసు విప్లవాత్మక జీవితంలో "వందేమాతరం" సముచితస్థాన మాక్రమించుకొన్నది. ప్రజల్ని ఉద్రేకపరచి, విప్లవోన్ముఖులనుగా చేయగలిగిన విప్లవబీజాలు ఈ గీతములో ఇముడుకొనివున్నాయి. ఈ గీతాన్ని ఆధారంగా పెట్టుకొని, విప్లవం తెచ్చి కాంగ్రెసు సంస్థ దేశానికి స్వాతంత్ర్యం సాధించినమాట నిజమే. అలాంటప్పుడు అదే గీతాన్ని జాతీయగీతముగా చేయాలని వాంఛించటం సబబేనా అనే విషయాన్ని ఆలోచించాలి.

రాజకీయ స్వాతంత్ర్యాన్ని సాధించుటతో మన వాంఛలు నెరవేరటం కానీ, మహాత్మాగాంధి చెప్పుతూండిన "రామరాజ్యం" ఏర్పడే అవకాశంకానీ కనిపించటంలేదు. మన దేశానికిప్పుడు ఆర్థిక స్వాతంత్ర్యం కావాలి. సంఘంలో వుండే అసమానత్వం, దోపిడీ విధానం పూర్తిగా అంతరిస్తేనే కాని దేశం బాగుపడదు. అందువలనను కాంగ్రెసు సంస్థ రాజకీయ విప్లవాన్ని సాధించినట్లుగానే సాంఘిక విప్లవాన్ని కూడా సాధించి గాంధీజీ కలలుగన్న "రామరాజ్యాన్ని" దేశంలో సుప్రతిష్ఠితం చేయాలి. కాబట్టి ఆ విప్లవ బీజాలతో పవిత్రమైన "వందేమాతరం" గీతాన్ని అలాగే వుంచటం న్యాయము. ఏ గీతాన్నైతే విప్లవంకోసం, ప్రజల్ని ఉద్రేకపరచటంకోసం, పోరాటంకోసం వాడుకొన్నామో—అదే గీతాన్ని శాంతికొరకు, సంఘీభావంకొరకు, అభ్యుదయంకొరకు వాడటం ఎంత యుక్తియుక్తమో పెద్దలు ఆలోచించాలి. పైగా "వందేమాతరం"లో మనదేశ విశిష్టతల్ని తెలిపే పదజాలం లేదు. ఒక్క ప్రకృతి సౌందర్యాన్ని మాత్రం ఆ గీతము వర్ణిస్తున్నది. జాతికి సంబంధించిన విషయవివరణ లేని గీతాన్ని జాతీయగీతముగా మన మెలా ఆమోదించగలము? ఈ గీతముయొక్క గానఫణితి సమష్టిగానానికి అనుకూలం కాదని కూడా ఒక రకమైన విమర్శ.

పై కారణాల్నిబట్టి మనం తీవ్రంగా ఆలోచిస్తే "వందేమాతరం"ను జాతీయగీతముగా నిర్ణయించేందుకంటే, విప్లవగీతముగానే వుంచటం మంచి దని తోస్తుంది. కాంగ్రెసు కమిటీలు "వందేమాతరం"తో గల గాఢసంబంధాన్ని పురస్కరించుకొని జాతీయగీతముగా దాన్నే ఏర్పరచమని రాజ్యాంగపరిషత్తుకు ఆదేశ మివ్వవచ్చు. అంతమాత్రంలో పరిషత్సభ్యులు తృప్తిపడక ఉత్తమ పద్ధతిపై ఆలోచన చేసి ఒక నిర్ణయానికి రావటం మంచిది.

ఇంక "జనగణమన" గీతమును గురించి విచారిద్దాము. ఈ గీతముయొక్క గానఫణితి సమష్టిగానానికి అనుకూలముగా వుండటమే కాక, విదేశీయుల్ని మంత్రముగ్ధులనుగా చేస్తూనట్లు తెలియవచ్చింది. ఈ గీతములో భారత భౌగోళిక స్వరూపం చిత్రితమైంది. మనదేశంలో గల భాషారాష్ట్రాల్ని, ప్రధాన నదుల్ని, ప్రధాన మతాల్ని, మన సంస్కృతి విశిష్టతను ఈ గీతము చిత్రిస్తున్నది. జాతీయ గీతానికి ఇలాంటి విషయ చిత్రణమెంతైనా అవసరము. "జనగణమన" గీతమును వినగానే మనదేశముయొక్క స్థూల బాహ్య స్వరూపం బోధపడుతుంది. పదముల కూర్పులోనేమి, భావముల మేళనంలో నేమి ఈ గీతములో ఒక ప్రత్యేకత వున్నది. ఇన్ని విశిష్ట లక్షణాలతో కూడిన ఈ గీతాన్ని జాతీయ గీతముగా నిర్ణయించడానికి ఏలాంటి సందేహాలూ పడ నక్కరలేదు. దీన్ని జాతీయగీతముగా నిర్ణయించటం వలన "వందేమాతరం"ను కొంచెపరుస్తున్నామనుకోవటం పొరపాటు. జాతీయ గీతానికి తోడుగా పాడటానికి "వందేమాతరం"ను చేర్చుకోవచ్చు.

రాజకీయ కారణాల్ని పురస్కరించుకొని అసలు సమస్యను కలుషితం చేయబూనుకోవటం తగని పని. ఇంతకాలం కాంగ్రెసుకు ప్రార్థన గీతముగానూ, విప్లవగీతముగానూ వుంటూవచ్చిన "వందేమాతరం"ను జాతీయగీతముగా ఏర్పరచమన్నప్పుడు కాంగ్రెసు జెండానే జాతీయ జెండాగా ఏర్పరచకూడదా అని వాదించేవారు తయారవుతారు కదా? అలాంటి వాద ప్రతివాదాలకు దిగితే సమస్యాపరిష్కారము కష్టతరమౌతుంది. దేవుని దయవల్ల ఇందులో రాష్ట్రాభిమానానికి కానీ, ప్రాంతీయాభిమానానికి కానీ అవకాశం లేదు. ఈ గీతాలు రచించిన బంకించంద్, ఠాగూరులు ఇద్దరూ వంగరాష్ట్రీయులు. ఇద్దరూ దేశభక్తి ప్రబోధాత్మకములైన రచనలు సాగించినవారే. మన జాతికి ఇద్దరూ పూజనీయులే! అందువలన రచయితలపై వుండే అభిమాన, దురభిమానాల్ని బట్టి - అనుసరణ, నిరసనల కేమాత్రం అవకాశము లేదు. మనదేశములో మత, కుల, వర్గాతీతమైన రాజ్యాన్ని (*Secular State*) ఏర్పరచామని పెద్దలు చెప్పుతూన్న విషయాన్నికూడా ఈ సందర్భంలో గమనించాలి. ఈ దృష్ట్యా చూచినట్లైతే "వందేమాతరం" గీతము మూర్తి పూజా ప్రాభవాన్ని చాటుతూ, ఒకరకమైన మతవాతావరణాన్ని చిత్రిస్తూన్నట్లు గోచరిస్తుంది. "జనగణమన"లో ఇట్టి విశేష మేమీ కనిపించదు. ఈ ప్రధాన భేదాన్నికూడా మనం పరిశీలించవలసి వున్నదని నా మనవి. జాతీయగీతానికి వుండవలసిన హంగులు ఫలానా అని మొదట నిర్ణయించుకొని వున్నట్లైతే దానికి తగిన గీతాన్ని ఏర్పరచుకోవటం సులభమయ్యేది. అలా చేయక పోవటంవల్ల ఈ సమస్యకు ఇన్ని చిక్కులేర్పడుతున్నాయి. వివిధములైనట్టి వాదోపవాదములు చెలరేగుతున్నాయి. ఈ సందర్భంలో అఖిలభారత కాంగ్రెసు సంఘమువారేమి, భారతరాజ్యాంగపరిషత్తువారేమి అన్ని విధములా ఆలోచించి, చర్చించి నిష్పాక్షికమైన నిర్ణయమే చేయాలనీ, ఏలాంటి అభిమాన - దురభిమానాలకూ లొంగవద్దనీ మరొకమారు ప్రార్థిస్తున్నాను.

'సింధు'ను తొలగించి 'ఆంధ్ర'ను చేర్చాలి

ఈ సందర్భంలో మరొక ప్రధాన విషయాన్ని రాజ్యాంగపరిషత్తు సభ్యులయొక్క, కాంగ్రెసునాయకులయొక్క దృష్టికి తీసుకరావటం అవసరమైంది. "జనగణమన" గీతాన్ని జాతీయగీతముగా నిర్ణయించేప్పుడే గీతములో రెండవ పాదమునందు గల 'సింధు'పదమును తొలగించి 'ఆంధ్ర'ను చేర్చే ముఖ్యసవరణ కూడా జరుగవలసివున్నది. అయితే ఈ సవరణను గూర్చి వివరించేందుకు ముందుగా నేను ఒక మనవి చేయవలసినదిగా వున్నదని భావిస్తాను. నేనీ సవరణను ఆంధ్రావేశంతో కానీ, రాష్ట్రీయదురభిమానంతో కానీ చేయటంలేదు. నా చర్చకు అలాంటి ఉద్దేశం కూడా లేదు. కేవలం విమర్శకదృష్టితోనే నా వాదనను తెలుపుకొంటున్నాను.

మనదేశములో కుల, మత, వర్గాతీతమైన రాజ్యాన్ని (*Secular State*) ఏర్పరచామంటున్నారు. "జనగణమన" లోనూ ఆ ఉద్దేశ్యమే ధ్వనిగర్భితమై వుండటం గమనింపతగ్గది. గీతమంతా కూడా (ఒక 'సింధు' తప్ప) ఏలాంటి సవరణ అవసరం లేకుండానే ప్రకృతిపరిస్థితులకు అనుగుణ్యంగా వున్నది. 'సింధు' పదాన్ని మాత్రం తొలగించక తప్పదు. ఆ పదాన్ని తొలగించి 'ఆంధ్ర'ను చేర్చవలసినదిగా నేను మొట్టమొదట కర్నూలు విజ్ఞానసమితిలో ఉపన్యసిస్తూ తెలిపాను. ఆ ప్రధానవిషయాన్ని ఒక వార్తాసంస్థ (A. P. I) భారతదేశంలో గల అన్ని పత్రికలకు అందజేసింది. ఆ సమయంలోనే భారతశాసనసభ జరుగుతూండటం వల్ల ఒక తెలుగు శాసనసభ్యుడు ఈవిషయమై ప్రభుత్వానికి ఒక ప్రశ్న వేశాడు. అందుకు సమాధానంగా పండిత నెహ్రూ 1948 సం. ఆగస్టు 25 వ తేదీన శాసనసభలో "ప్రస్తుత పరిస్థితుల్ని బట్టి 'జనగణమన'లో పదములను మార్చి వాటికి సరియైన పదములను చేర్చుటకు నా కేమీ అభ్యంతరం లే" దన్నారు. పండిత నెహ్రూ చెప్పినట్లు 'ప్రస్తుత పరిస్థితుల్ని బట్టి' మార్పు జరుగవలసినది "జనగణమన" లో ఒక 'సింధు' పదము మాత్రమే. ఇంతకూ మార్పు అనే ప్రధాన సూత్రాన్ని పండిత నెహ్రూ ఒప్పుకున్నాడు కాబట్టి 'సింధు' పదాన్ని తొలగించవలసి వచ్చినపుడు 'ఆంధ్ర'ను చేర్చమని కోరటం న్యాయమే ననుకొంటాను

భారతదేశము విభజింపబడిన తర్వాత సింధు రాష్ట్రం పాకిస్థాన్ లో కలిసిపోయింది. పంజాబ్, వంగరాష్ట్రాల్లో కొంత కొంత భాగం పోయినా పూర్తిగా పోలేదు. కాబట్టి "జనగణమన" రెండవ పాదంలో వుండే 'సింధు' పదం తొలగించవలసిందే. భారత-పాకిస్థానుల పునరైక్యతను సూచించేదిగా ఆ పదాన్ని అట్లే వుంచాలని కొందరు వాదింపవచ్చు. ఆ వాదం ఆధారరహితమైంది. 1948 సం. ఏప్రిల్‌లో కలకత్తాయందు జరిగిన ఉభయ అధినివేశ రాజ్యాల ఒడంబడికప్రకారం ఏ అధినివేశ రాజ్యమైనా పునరైక్యతకు ప్రచారం చేయకూడ దని ఒక షరతు. దాని ప్రకారం జాతీయగీతములో 'సింధు' వుండటం తప్పు. సింధూనది వున్నది కదా, అందువల్ల 'సింధు' పదాన్ని నదికి అన్వయింపచేసుకుందామని ఒక విధమైన వాదము. గీతములో రాష్ట్రములను గురించి వరసగా "పంజాబు, సింధు, గుజరాత, మరాటా"* లని వున్నప్పుడు ఆ 'సింధు' పదమును నదికి అన్వయింపచేయ బూనుకోవటం బేసబబు. 'ఆంధ్ర' నెందుకు చేర్చాలో విచారిద్దాం.

భారత సమాఖ్యలో ఎక్కువ జనాభా మాట్లాడే భాషల్లో ఆంధ్రభాష ద్వితీయ స్థానమాక్రమిస్తున్నది. అలాంటి ఆంధ్రజాతికి జాతీయ గీతములో స్థానము లేకపోవటం పెద్దలోప మగుతప్పదు. పై గీతములో 'సింధు' అని వున్న చోట 'ఆంధ్ర' పదాన్ని సవరణగా పెట్టటంవల్ల గీతముయొక్క గానఫణితికి కాని, సౌష్ఠవానికి కాని ఏమీ లోపం రాదు.

ద్రావిడశబ్దం గీతములో వున్నది కాబట్టి "ఆంధ్ర" ను ప్రత్యేకంగా పేర్కొన నవసరం లేదని కొందరు వాదించవచ్చు. ఈ వాదాన్ని పరిశీలిద్దాము.

ద్రావిడశబ్దాన్ని దక్షిణదేశపరంగా మనుసంహితలోను, మహాభారతం లోనూ ఉపయోగించారే కాని, దక్షిణదేశ భాషల పరంగా ఎక్కడా ఉపయోగించలేదు. ద్రావిడ శబ్దము దక్షిణదేశభాషల్ని సూచించేదిగాను, దక్షిణాదివారిని సూచించేదిగాను మొట్టమొదటి ప్రతిపాదించినవాడు బిషప్ కాల్డ్వెల్. (*Bishop Caldwell*) తన సుప్రసిద్ధమైన "ద్రావిడ భాషా చరిత్ర"*లో తానే తమిళశబ్దానికి వ్యుత్పత్తిని సాధించేప్పుడు ద్రావిడ, ద్రమిళ, దమిళ నుండి వచ్చినదే 'తమిళ' మంటున్నాడు. అయితే భారతదేశంలో ద్రావిడశబ్దాన్ని అనేకార్థాల్లో ఉపయోగిస్తున్నారు. ఒకే నిర్దిష్టార్థ మింతవరకు ప్రతిపాదింపబడలేదు. కాల్డ్వెల్ పండితుడు ద్రావిడశబ్దము సహజంగా తమిళాన్నే సూచిస్తూ; తమిళులకు మాత్రమే అన్వయింప చేస్తూన్నదని ఒప్పుకొంటున్నాడు. (**Com. Philo. 2nd Ed. pp. 5, 7.*) తమిళ, తెలుగు వ్యాకర్తలు దక్షిణభారతభాషల్ని అన్నింటినీ సమష్టిగా సూచించే ఏ పదాన్నికూడా వాడలేదని కాల్డ్వెల్ వ్రాసినాడు. (*ibid P. 8*) వీటన్నింటినిబట్టి చూస్తే ద్రావిడశబ్దానికి ఆంధ్రసంపర్కం కలిగించినవారిలో కాల్డ్వెల్ పండితుడే మొదటివాడనీ, ఆయనవాదంలోనే పరస్పరవ్యతిరేకత కనిపిస్తూండటంవల్ల 'ద్రావిడ'శబ్దంతో 'ఆంధ్ర'కేలాంటి సంబంధం వున్నట్లు ఒప్పుకోవటానికి వీలు లేదు.

పంచద్రావిడు లనే వాదం మరొకటి. తెలుగు, కన్నడము, మరాటి, గుజరాతి, తమిళులే పంచద్రావిడు లట! ఈ పంచద్రావిడవాదాన్నిబట్టి ఆలోచించినా జాతీయగీతములో గుజరాత, మరాటా లున్నప్పుడు ఆంధ్ర లేకపోవటం కూడా లోపమే కదా? ‡గోవర్ (*Gover*) అనే పాశ్చాత్య విమర్శకుడొకడు ద్రావిడులు కూడా ఆర్యులే నంటున్నాడు. ఇతని అభిప్రాయాన్ని అనుకరిస్తే చిక్కులేదు. ఆంధ్రభాష ద్రావిడభాషాకుటుంబంలోనిది కాదని, ప్రాకృతభాషాజన్య మనీ ఆంధ్రభాషాశాస్త్రవేత్తలు కొందరు పరిశోధనలు సాగించి తమ వాదాన్ని నిలుపుకొంటూన్న విషయం మన మీ సమయంలో మరచిపోరాదు.

అఖిలభారతకాంగ్రెసు సంఘాధ్యక్షులైన శ్రీ భోగరాజు పట్టాభిసీతారామయ్యగారు 21-4-49 న మద్రాసులో పత్రికాప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ "ఆంధ్రులు ద్రావిడులనేందుకు వీలులేదు. ద్రావిడ ముర్రాలో ఆంధ్రులు కలిసికొనజాలరు" అని చెప్పి వుండిరి. అరవలకు, ఆంధ్రులకు నాగరకతలోనేమి, సంస్కృతిలోనేమి మొదటి నుండి భిన్నత వుంటూనే వచ్చింది. ఒకరి సంప్రదాయాలతో ఒకరికి సరిపడదు. అలాంటప్పుడు సరియైన చారిత్రకాధారములు లేకుండా ఆంధ్రులు ద్రావిడులే ననటం యుక్తియుక్తముగా కనిపించ దని, ఇందు విషయమై ఇంక తర్కం అవసరం లేదనీ నా అభిప్రాయము.

"భారతసమాఖ్యకు 'జనగణమన' యే జాతీయ గీతముగా వుండవలెను. గీతముయొక్క

---

*పంజాబ, సింధు, గుజరాత, మరాటా, ద్రావిడ, ఉత్కళ, వంగ.

**Comparative Philology of the Dravidian or Southern Indian languages—Published in 1856.*

‡ *Author of 'Folk Songs of Southern India'*

'రోమ్మెల్'ను నాజీలే చంపారు



ఒక్కొక్క పేరుకు ఆదశ ఉంటుంది. గత యుద్ధంలో రోజురోజూ, అనేకమైన కొత్త కొత్త పేర్లు, చిన్న, పెద్ద, మనుష్యులవీ, దేశాలవీ, పట్టణాలవీ, పల్లెలవీ, కొండలవీ, నదులవీ, ఓడలవీ, విమానాలవీ, రేడియోలు పరిచయం చేస్తూండేవి. ఇవాళ వినబడిన పేరు రేపు మళ్లీ వినబడకుండా ఉన్నంత కొత్తగా, భూగోళచరిత్రంతో, మానవచరిత్రంతో, శ్రోతలకు నిత్య నూతనపరిచయం ఏర్పడేది. అయితే నూరింట తొంభైతొమ్మిదిపాళ్లు ఆ పరిచయం క్షణికంగానే ఉండేది. ఇవాల్టిపేరు రేపు మళ్లీ చెప్పినా, కొత్తదేమో నన్నంతమాత్రంగానే ఈ పేర్లు జ్ఞాపకాలను మిగుల్చుకొనేవి. ఆబాలవృద్ధమూ తెలిసినపేర్లు కొద్ది జర్మనుల విషయంలో, హిట్లర్, గోరింగ్, గొబ్బెల్సుల తర్వాత, ప్రపంచం మారుమూలలా ప్రతిపౌరుడికీ తెలిసిన పేరు, రోమ్మెల్ పేరొక్కటే.

జనరల్ ఎర్విన్ రోమ్మెల్ ద్వితీయప్రపంచ సంగ్రామంలో 1940 మే నాటికి ప్రపంచప్రఖ్యాతిలోకి వచ్చాడు. అప్పటికి, అతనికి 49 ఏళ్లు. ఫ్రాన్సుపై వెడలిన జర్మన్ ఏడవ పాంజర్ డివిజన్‌కు కమాండర్‌గా ఫ్రాన్సుపై యుద్ధం రెండు వారాలలో ముగించి, ప్రసిద్ధిలోకి వచ్చాడు. రెండేళ్లతర్వాత ఆఫ్రికారంగంలో రోమ్మెల్ ప్రవేశించేటప్పటికి ప్రపంచమంతటా రోమ్మెల్ పేరు గృహనామంగా తయారైంది.

హిట్లరు గోబ్బెల్సు గోరింగ్‌ల పేర్లకు కీర్తినిమించిన విలువ పరాయివాళ్లకు లేదు. కాని రోమ్మెల్ అల్లా కాదు. మహోన్నతమైన యుద్ధవీరునిగా, శత్రుకూటంలో వాడినైనా, ప్రపంచం అతన్ని కీర్తించి గౌరవించింది.

ప్రతాపరుద్రీయ కవి "రుద్రయుగంధర్ పేరు చెప్పితే నిద్రపోదు హాపే-నూరయుగంధర పేరు చెప్పితే నీరు ముట్టదు ఘోడా-వీరయుగంధర్ పేరు చెప్పితే పేలదుర తుపాకీ -" అంటూ యుగంధరుణ్ణి వర్ణించాడు. ఆఫ్రికాలో బ్రిటిష్ సైనికులు కూడా, రోమ్మెల్‌ను ఆ విధంగానే చెప్పుకొనేవారట. ఎవడైనా ప్రజ్ఞగా ఏదైనా చేస్తే, "రోమ్మెల్ పని చేశా'"నని అనడం మామూలైపోయింది. శత్రుకూటములోవాడైనా, మహావీరుడైనందున, సర్వులూ అతని పేరు కీర్తించారు.

అతని ఉపాయం, తెలివితేటలు, సమయస్ఫూర్తి, బ్రిటిష్‌వారిలో అతనికి "ఎడారినక్క" అని పేరు సంపాదించిపెట్టాయి. (శివాజీకి "కొండఎలుక" అని బిరుదం అంకితమైనట్టు).

ఒకసారి బ్రిటిష్ సేనలు సంఖ్యాధికంగా ముంచుకొని వస్తూంటే ఉపాయంగా, వాళ్లను అడలగొట్టి తప్పించుకొన్నాడు రోమ్మెల్. *R. A. F.* విమానాలు జర్మన్ సైనిక శ్రేణులకు పైగా రహస్యపర్యవేక్షణలు సాగిస్తూ ఫోటోలు తీసికోబోతున్నాయని రోమ్మెల్‌కు తెలుసును. తనదగ్గిర ఉన్న ప్రతిట్రక్కూ మోటారూ, లారీ, టాంకూ, చక్రాలంటూ ఉన్న బళ్ళన్నీ రెండు రాత్రుల్లు ఎడతెగకుండా ఎడారిమేర అంతటా అడ్డదిడ్డంగా తిప్పాడు. అనేకలక్షల శకటాల చక్రాలచారలు ఎడారి ఇసుకనిండా, చీమతలకాయంత సందు మిగుల్చకుండాపడ్డాయి. *R. A. F.* వాళ్లు తీసికొన్న ఫోటోలకు, గోబ్బెల్సు ఇచ్చిన ప్రచారంకూడా చాలా దోహదం ఇచ్చింది.

బ్రిటిష్‌సైన్యాలు జాగ్రత్తగా కిక్కురుమనకుండా తిరోగమనం సాగించాయి.

మరొకసారి, టాంకుయుద్ధంలో, తీరా శత్రువు మీదికి ఛార్జిచెయ్యమని ఆర్డరిచ్చాక తన దగ్గిర ఆరు టాంకులు మాత్రమే ఉపయోగానికి ఉన్నాయని తెలిసింది. "సరే, దుమ్మూ ధూళితో యుద్ధంచేయా"లని అనుకొన్నాడు రోమ్మెల్. మోటారురూపం ఉన్న ప్రతిబండినీ అక్కడికక్కడే గుండ్రంగా గిరగిరా త్రిప్పుతూ గాలి దుమారం లేవగొట్టించాడు. ఆ ఉధృతంలోనుంచి, ఆరు టాంకులు హడావిడిగా మీద వచ్చి పడేటప్పటికి శత్రువు రోమ్మెల్ వద్ద ఎంతో టాంకు బలం ఉందని భయపడుతూ వెనుకంజవేయవలసి వచ్చింది. ఒక టాంకు డివిజన్ మొత్తంగా తమమీద వచ్చిపడిం దని భయపడుతూ బ్రిటిష్‌వారు పలాయనం చిత్తగించారు.

రోమ్మెల్ అంటే సైనికులకు ఒక గౌరవం భక్తి విశ్వాసం. అన్నిటికన్న ఆ వ్యక్తిత్వంలోనే ఒక ఆకర్షణ, ఆడవాళ్లకు సెక్సు అప్పీలు ఉంది అంటారే, అదేవిధంగా వీరులకు ఒక రమ్య వీరత్వాకర్షణ - ఉండేదట ఆ రమ్యత్వం, అతని వస్త్రధారణంలోది కావచ్చును. లేదా పల్లెటి అమాయకుని కన్నులలో తొలికే చిలిపితనమూ, ప్రకృతిసిద్ధమయిన బుద్ధికౌశలమూ కావచ్చును. టాంకు టర్రెట్ లోంచి రోమ్మెల్ నిలబడి శత్రుదళాలను కనువిప్పి చూస్తూంటే, వెనుక ఉన్న అతని సైనికులకు, అతనే రణదేవతలా కన్పించేవాడు.

ఒకసారి భీషణయుద్ధమధ్యంలో ఒక ఉగ్రాకృతితో "నా ప్రక్కనే నిలబడు; అపాయం అన్నది నా చాయలకు రానేరాదు.' అని వీరజమ్మని లాగా ధీమాలో అన్నాడట. కాని చివరికి యుద్ధమధ్యంలోకాక ఆ అపాయం వెన్నంటక తప్పలేదు.

రోమ్మెల్ అకస్మాత్తుగా ఎల్లా చచ్చిపోయాడు! ఈనాటిదాకా మృతినిగురించి వివరాలు ఏమీ తెలియలేదు. జర్మన్ అధికారివర్గం ప్రకటించిన వార్తలు, నార్మండీరంగంలో వికారొల్ల్కు అతని కమాండుకారు శత్రువుల చేతుల్లో పచ్చడి పచ్చడి ఐపోయినప్పుడు సంభవించిన గాయాల వల్ల రోమ్మెల్ చనిపోయాడని తెలిపాయి. కాని రోమ్మెల్ చావు విషయంలో ఇంతకన్నా చాలా విచిత్రమై, చాలా కొత్త సంగతులను తెలిపే గాథ ఉంది.

ఆఫ్రికన్ ఎడారి యుద్ధం రోజులలోనే, హిట్లరుకు, మానవవ్యక్తుల ప్రాణాలంటే ఏమాత్రమూ కాతరలేదని తెలిసివచ్చింది. ఆఫ్రికారంగంలో జర్మన్‌లకు పెట్రోలు, ఆయుధాలు, యుద్ధపరికరాలు అన్నీ కూడా తక్కువై పోయినవి. నిలిచి యుద్ధం చేస్తే సంపూర్ణంగా ఊడ్చిపెట్టుకుపోవడంతప్ప మరో గతి లేదని రోమ్మెల్‌కు తెలుసును. బ్రిటిష్ బలాలు నాటి నాటికీ ఎక్కువెక్కువగా కూడుకొంటున్నాయి. అల్లాంటి సమయంలో, తిరోగమనానికి అనుజ్ఞ ఇచ్చి వేలకొలది జర్మన్ ప్రాణాలను రక్షించవలసిం దని రోమ్మెల్ హిట్లరుతో ఘట్టిగా వాదించాడు. హిట్లర్ ఉద్రిక్తుడై "విజయమో, మరణమో తప్ప తిరుగు లేదు", అన్నాడు.

తరువాత ఎప్పుడో ఆ విషయం ప్రసంగిస్తూ, "నేను జయించనూ లేదు. మరణించనూ లేదు" అని వ్యగ్రతతో అన్నాడట రోమ్మెల్.

1943 మేలో, టునీషియాను వదులుకొనే ముందు రోమ్మెల్‌ను జర్మనీకి రప్పించాడు హిట్లరు. "రోమ్మెల్" పేరు "అపజయం"తో కలపకూడ దనుకున్నాడు హిట్లరు.

ఆరోజుల్లో జర్మన్ నాజీచర్యలు రోమ్మెల్ ప్రత్యక్షంగా చూడవలసివచ్చింది. రోమ్మెల్ నాజీపార్టీలో ఎప్పుడూ చేరలేదు. పార్టీ బంగారు పతకాలు ఏవీ రోమ్మెల్ అలంకరించలేదు. అంతవరకు తన విజయయాత్రలతోనే, తన మహావీరనామం పెంపొందించుకోటంలోనే నిమగ్నుడై తనపనేమో తానేమో ఉన్నాడు రోమ్మెల్. అందుచేత, చేజిక్కిన శత్రువులచేత చేయిస్తున్న బానిససేవలూ, కాన్సెంట్రేషన్ కాంపులూ, చెప్పపోతే భత్యాలూ, అన్నీ రోమ్మెల్‌కు ఘోరాతిఘోరంగా కనిపించాయి. "నేను న్యాయమూ ధర్మమూ అయిన యుద్ధం మాత్రమే చేశాను. కాని నా సైనికత్వాన్నీ కూడా వీళ్ల చర్యలు కళంకితం చేశాయి" అన్నాడు రోమ్మెల్.

శత్రుసైనికులలో బందీలను ఒకడికి పన్నెండుగురను చొప్పున కాల్చివేయవలసిం దని - (తమ సైనికుడు పరాయివాళ్లచేతుల్లో ఒకడు చస్తే తమ చేతుల్లో ఉన్న వాళ్ల సైనికులను 12 మందిని కాల్చిచంపమని) హిట్లరు ఇచ్చిన ఆజ్ఞాపత్రాన్ని బుట్టదాఖలుచేసిన కొద్దిమంది జర్మన్ వీరసేనానాయకులలోనూ రోమ్మెల్ ఒకడు.

హిట్లరు జర్మనీని తనతో ముంచివేస్తాడే తప్ప వదిలిపెట్టడని మనస్సుకు తెలిసిరాగానే రోమ్మెల్ చాలా బాధపడ్డాడు.

జర్మన్ ప్రజల ఆశలను మళ్ళీ రెకెత్తించేందుకు, శత్రుసైన్యాలను మళ్లీ రోమ్మెల్ పేరు చెప్పి అడలించటానికి, నార్మండీ రంగంలో శత్రువులదాడిని ఎదర్చటానికి రోమ్మెల్‌ను సైన్యాధిపతిని జేసి పంపాడు హిట్లరు. కాని తన చేతుల్లో ఉన్న కొద్దిపాటి సైనికులతోటి, ఆయుధాల తోటీ, శత్రువులను ఎదుర్కోటం కష్టమని రోమ్మెల్‌కు వెంటనే తెలిసివచ్చింది. ఫ్రాన్సులో మిలిటరీ గవర్నర్ కార్ల్ హెన్రిక్ ఫాన్ స్టెప్నగల్ కూడా గౌరవప్రదంగా యుద్ధం ఎల్లాగో ముగించివైచి జర్మనీకి ఎక్కువ నష్టం రాకుండా చేయాలని ప్రయత్నిస్తున్నాడు. ఏప్రెల్ 1944 లో రోమ్మెల్ హేన్రిచ్ లుకలును కొన్నారు. నాజీ ప్రభుత్వాన్ని కూలదోసి, పశ్చిమరంగంలో వెంటనే యుద్ధం ముగించేందుకు ఏమేమి కావల్సుంటాయోనని సమాలోచించారు.

మిత్రరాజ్యాలకు జేమరతుగా లొంగిపోవలసిన సమయం రాకముందే, హిట్లరుకు తెలియకుండా, మాంట్‌గొమరీ, ఐసెన్‌హోవర్లతో సంధి సంప్రతింపులు సాగిద్దామను కొన్నాడు రోమ్మెల్. జర్మను సైన్యాలను పశ్చిమరంగం నుంచి వెనుకకు మరలించేట్లూ, తదనుగుణ్యంగా, మిత్రసైన్యాలు జర్మనుపట్టణాలపై బాంబులు వేయటం వెంటనే ఆపివేసేటట్లు, తూర్పు రంగంలో మాత్రం సంకుచితంగా, రుమేనియా, లెంబర్గు, విస్టులా, మెమ్మెల్‌లవద్ద, పాశ్చాత్య నాగరికతను భద్రపరచేందుకు యుద్ధం కొద్దిగా సాగించేటట్టు—ఈ ప్రాతిపదికలపై సంధి సంప్రదింపులు సాగించాడు.

హిట్లరును, తనకు (రోమ్మెలుకు) నమ్మకస్థులైన టాంకుసైన్యాలచేత పట్టించి, కోర్టు మార్షల్ విధానంలో విచారిద్దామని రోమ్మెల్ ఆశించాడు. అకస్మాత్తుగా చంపి, హిట్లరుని అనవసరంగా "వీరుల కొలుపులకు" పాత్రుణ్ణిగా, మార్టిర్ (*Martyr*)గా చేయకూడ దని రోమ్మెల్ అభిప్రాయం.

ఈలోగా జులై 15 నాటికి మిత్రసైన్యాలు నార్మండీలో ఒడ్డుఎక్కాయి. వెంటనే సంధి రాయబారాలు ప్రారంభించవలసిం దని, నాలుగు రోజులు గడు విస్తున్నా నని రోమ్మెల్ హిట్లరుకు తాఖీదు పంపాడు.

జులై 17 న (రెండురోజుల తర్వాత), రోమ్మెల్, యుద్ధముఖంనుంచి శిబిరానికి వస్తున్నాడు. బ్రిటిష్ చిహ్నాలతో ఉన్న రెండు విమానాలు క్రిందగా ఎగిరి, రోమ్మెల్ కారు మీదికి వచ్చాయి. ఒకటి రోమ్మెల్ కారుని ఢీకొని సగం ఎగరగొట్టేసింది. రోమ్మెల్ స్మృతి తప్పి ప్రక్కకు పడిపోయాడు. రెండవ విమానం మరతుపాకులు రోమ్మెల్‌పై అగ్నివర్షం కురిపించాయి. రోమ్మెల్‌కు కపాలం చిట్లింది. కణతలు పగిలిపోయాయి. దవడఎముక విరిగిపోయింది. ఎడమకన్ను దెబ్బతిన్నది. తలపై పెద్ద బొప్పి కట్టింది. బ్రతకటం సందేహాస్పదం అన్నారు డాక్టర్లు.

బ్రిటిష్ విమానచర్యల డైరీలలో, ఎక్కడా కూడా రోమ్మెల్ కారుపై దాడి జరిపిన సమయం లోనూ, ఆ ప్రదేశంలోనూ జులై 17 న ఇల్లా దాడి జరిపినట్లే ఎక్కడా లేదు. బహుశా, రోమ్మెల్ తాఖీదుకు ఇది హిట్లరు ఇచ్చిన జబాబేమో!

ఏదైనా, నాజీప్రభుత్వం కూలదోసేందుకు పన్నిన కుట్రలలో ఒకటి ఇల్లా దెబ్బతిన్నది. రెండవది జులై 20 న హిట్లరుపై ప్రష్యాలో జరిగిన హత్యాప్రయత్నం. ఆ బాంబు హిట్లరును తప్పించి ఆ భవనాన్ని కూల్చింది. కుట్రదారులని అనుమానం ఉన్నవాళ్ల నందరినీ నాజీలు వేటాడి చంపారు.

ఆ వేసంగి అంతంలోనే, రోమ్మెల్ మళ్లీ బాగా తేరుకొన్నాడు. ఎడమకన్నులో కొద్ది మాంద్యంతప్ప, తక్కిన గాయాలన్నీ మానిపోయాయి.

రోమ్మెల్, ఉల్మ్ అనే ఊరివద్దర తన భవనంలోనే నివసిస్తున్నాడు. అక్టోబరు 14 న ప్రొద్దున్నే నిద్ర లేచాడు. ఆ రోజు అతని కుమారుడు మాన్ఫ్రెడ్, సెలవుమీద సైన్యంలో నుంచి ఇంటికి వస్తున్నాడు. కాని ఆ మధ్యాహ్నమే రోమ్మెల్‌ను కలుసుకోవాలని, హిట్లరు పంపుపై బయలుదేరవస్తూన్న జనరల్ బుర్గ్‌డార్ఫ్ కూడా వస్తున్నాడు. వస్తున్నానని క్రిందటిరాత్రే టెలిఫోనులో రోమ్మెల్‌తో చెప్పాడు. హిట్లరు మరో కొత్త రంగంలో రోమ్మెల్‌ను సేనానాయకుడుగా చేయదలచా డని, ఆ విషయం సంప్రదించటానికి వస్తున్నాననీ జనరల్ బుర్గ్‌డార్ఫ్ ఫోనులో చెప్పాడు. "ఈ రావటంలో ఏదో కుట్ర ఉండి ఉండవచ్చు" అని రోమ్మెల్ ప్రొద్దున్నే వచ్చిన కుమారుడితో అన్నాడు.

మధ్యాహ్నం 12 గంటలకు జనరల్ మైసల్‌తో కూడా కలిసి జనరల్ బుర్గ్‌డార్ఫ్ వచ్చాడు. రోమ్మెల్ భార్యాపిల్లల క్షేమ సమాచారాలు, కుశలప్రశ్నాదికాలు అన్నీ అతి మర్యాదగా అడుగుతూ, గౌరవనీయులైన అతిథుల్లానే అతిఆప్యాయంగా ప్రవర్తించారు.

ఒంటిగంట దాటాక రోమ్మెల్ భార్యగదిలోకి వచ్చాడు. అతనిముఖం చూసి భార్య కంగారుపడి "ఏమిటి సంగతి?" అని అడిగింది.

"ఇంకో పావు గంటలో నేను చచ్చిపోతా" నని రోమ్మెల్ చెప్పాడు. త్వరత్వరగా సంగతులన్నీ రోమ్మెల్ వివరించాడు. స్టుల్ప్‌నేగెల్ ఆత్మహత్యాప్రయత్నంలో పట్టుపడి, నాజీలు గొంతు నులిమి చంపేలోపల, జులై 20 వ తారీఖు కుట్ర అంతా బైట పెట్టాడట. రోమ్మెల్ కుట్రలో ఉన్నాడనేందుకు హిట్లరుకు సందేహం లేదట. అందుచేత "విషం స్వీకరించి వెంటనే చచ్చిపోతావో, లేక ప్రజల పంచాయితీ ముందు ప్రాణాలు వదులుకొంటావో నిశ్చయించుకోమని" హిట్లరు కబురుచేస్తూ జనరల్స్ ద్వారా విషమాత్ర పంపించాడట. పంచాయితీకి నిల

(18 వ పేజీ చూడుడు)

రెండవచరణమందు గల 'సింధు' స్థానే 'ఆంధ్ర చేర్పబడవలెను." అను తీర్మానమును అఖిల భారతకాంగ్రెసు సంఘము, భారతరాజ్యాంగ పరిషత్తు తీర్మానించవలసివున్నది. ఈ తీర్మానము ఇదివరలోనే రెండు సభలకు పంపబడివున్నది. త్వరలోనే చర్చకు వచ్చి నిర్ణయము చేయబడును. ప్రతి ఆంధ్రసభ్యుడు ఈ విషయమై తగు శ్రద్ధ తీసుకున్న, తప్పక ఈ తీర్మానము రెండు సంఘముల నెగ్గగలదు. పరిణామమును చూచెదము గాక!

అంతర్జాతీయ రాజకీయాలు :

భారతరిపబ్లిక్ కు కామన్వెల్తు సభ్యత్వం

బ్రిటిష్ చక్రవర్తికి కేవలం లాంఛన ప్రతిపత్తి

భారతదేశం కొన్ని నెలలలోనే సర్వస్వతంత్ర రిపబ్లిక్‌గా మారిన తర్వాతకూడా, మిగతా అధినివేశాలతో పాటు సరిసమాన హోదాతో కామన్వెల్తులో సమగ్రమైన సభ్యత్వం కలిగి ఉంటుంది. లండన్‌లో కామన్వెల్తు ప్రధానుల ఆరు రోజుల రహస్య సమావేశాల పర్యవసానంగా ఈ నిర్ణయం 27 వ తేదీ బుధవారం నాడు ప్రకటించబడింది.

సర్వస్వతంత్ర రాజ్యాల యథేచ్ఛా సహకారసంబంధాలతో కూడుకొన్న కామన్వెల్తుకు బ్రిటిష్ రాజును కేవలం చిహ్నప్రాయుడైన అధిపతిగా గుర్తించడానికి భారతదేశం అంగీకరించినది.

అయితే, భారతదేశానికి సంబంధించినంతవరకు రాజుకు ఏవిధమైన రాజ్యాంగబాధ్యతలు వుండవు. భారత రిపబ్లిక్ భవిష్యత్ ఆధిపత్యమంతా భారతీయులు ఎన్నుకునే అధ్యక్షుడిదే. రాజు నిర్వహించే అధికారబాధ్యతలన్నిటినీ భవిష్యదధ్యక్షుడే నిర్వర్తించగలడు.

కామన్వెల్తు రాజ్యముల నాయకులు ఎనిమిది మందీ సంయుక్తముగా చేసిన ప్రకటనలో తమ సంప్రదింపులు సద్భావపూరితమైన వాతావరణంలో నడచినవని, కామన్వెల్తు సంస్థను, దాని కార్యవిధానాలను, పరిణత పరిస్థితుల కనుగుణముగా మార్చుతూ, లక్ష్యసాధనతో ఐక్యతను సంఘటిత పరచుకొనుటకు కామన్వెల్తుకు సంప్రదాయసిద్ధముగా ఉన్న సామర్థ్యము పునః స్పష్టమైనదని తెలియజేశారు.

శాంతి, స్వేచ్ఛ, అభ్యుదయములకొరకు యథేచ్ఛగా సహకరిస్తూ తామంతా సమైక్యతతో, సరిసమాన హోదాతో, కామన్వెల్తులో స్వతంత్ర రాజ్యములుగా మెలగుచుందుమని బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, ఇండియా, పాకిస్థాన్ సింహళ దేశములు సంయుక్తముగా ప్రకటించినవి.

ఆ ప్రకటన ఈ క్రిందిరీతిగానున్నది. 'బ్రిటన్, ఆస్ట్రేలియా, న్యూజీలాండ్, దక్షిణాఫ్రికా, ఇండియా, పాకిస్తాన్, సింహళముల ప్రధాన మంత్రులు, కెనడా విదేశాంగమంత్రి, లండనులో సమావేశమై, భారతదేశం నూతన రాజ్యాంగ వ్యవస్థ ననుసరించి రిపబ్లిక్‌గా తయారవవలె, నని నిశ్చయించుకొన్నప్పటికీ కామన్వెల్తులో సభ్యత్వ రాజ్యముగనే ఉండవలెనని అభిలాషపడుటవల్ల ఉత్పన్నమయ్యే అత్యంత ప్రధానమైన రాజ్యాంగ సమస్యపై తమ తమ అభిప్రాయములను పరస్పరం తెలుపుకొన్నారు.

"రిపబ్లికన్ భారతదేశము కామన్వెల్తులో ఉండటంవల్ల యిప్పటి కామన్వెల్తు వ్యవస్థలోగాని, కామన్వెల్తు సభ్యత్వ రాజ్యముల పరస్పర సంబంధములలోగాని ఎలాంటి మార్పులు, ఏర్పడగలవు ? అన్న విషయంపైనే, కామన్వెల్తు ప్రధానుల చర్చలుసాగినవి. ఈ చర్చలు, సద్భావపూరితమైన వాతావరణంలో పరస్పర అవగాహనతో నడచినవి.

"కామన్వెల్తులోని అన్ని అధినివేశ ప్రభుత్వముల తరఫున యిక్కడకు వచ్చిన ప్రతినిధులు, సమగ్రమైన చర్చల పర్యవసానమైన తమ నిర్ణయములను, యీ దిగువ ప్రకటనలో పొందుపరచుటకు అంగీకరించారు.

"బ్రిటిష్ కామన్వెల్తులో సభ్యత్వముకలిగ సమైక్యతతోనున్నట్టి ; బ్రిటిష్ సింహాసనముయెడ సమష్టిగా భక్తివిధేయతలు ప్రకటించుచున్నట్టి, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, ఇండియా, పాకిస్థాన్, సింహళ దేశముల ప్రభుత్వములు, భారతదేశములో త్వరలో జరుగనున్న రాజ్యాంగపరిణామములను పరిశీలించినవి. త్వరలో ఆమోదింపబడనున్న కొత్తరాజ్యాంగ వ్యవస్థ ననుసరించి భారతదేశం సర్వస్వతంత్ర రిపబ్లిక్‌గా మారవలెనని, భారత ప్రజాబాహుళ్యం ఆకాంక్షించుచున్నట్లు, భారతప్రభుత్వం, కామన్వెల్తులోని మిగతా ప్రభుత్వములకు తెలియజేసినది.

"రిపబ్లిక్‌గా మారినప్పటికీ, మిగతా రాజ్యములతోపాటు సమగ్ర సభ్యత్వము కామన్వెల్తులో ఉండెదనని, కామన్వెల్తులోని స్వతంత్రరాజ్యముల స్వేచ్ఛాపూర్వకమైన పరస్పర సహకారమునకు చిహ్నప్రాయుడుగను, తద్వారా కామన్వెల్తుకు అధిపతిగను అంగీకరించెదనని, భారతప్రభుత్వం సుస్పష్టముగా ప్రకటించినది. భారతరిపబ్లిక్ కామన్వెల్తులో సభ్యత్వం గలిగిఉన్నప్పటికీ మిగతారాజ్యములు కామన్వెల్తులో యే ప్రాతిపదికపై సభ్యత్వము కలిగిఉన్నవో, ఆ ప్రాతిపదిక మారదుకొబట్టి కామన్వెల్తులో మిగతా ప్రభుత్వములు, భారత దేశం, తాను పేర్కొన్న షరతులప్రకారం, కామన్వెల్తులో యిప్పటివలె సభ్యత్వము కలిగి ఉండుటకు సమ్మతించినవి.

"కనుక బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దక్షిణఆఫ్రికా ఇండియా పాకిస్థాన్ సింహళములు, తాము, శాంతిస్వేచ్ఛ అభ్యుదయములకు యథేచ్ఛగా పరస్పరం సహకరించి పనిచేయుచూ, సమైక్యతతో, సరిసమానమైన హోదాతో కామన్వెల్తులో సభ్యత్వ రాజ్యాలుగా నుండగలవని ప్రకటించుచున్నవి."

పటేల్ హర్షప్రకటన.

"భారతదేశము బ్రిటిష్ సింహాసనముతో సంబంధమును విడనాడుకొన్న స్వతంత్రరాజ్యముగా నుండినప్పటికి బ్రిటిష్ రాజ్యకూటములో సభ్యత్వము కలిగియుండ వచ్చునని తీర్మానించుచు బ్రిటిష్ కామనువెల్తు రాజ్యాల ప్రధానమంత్రుల సభయందు లండనులో చేయబడిన నిర్ణయము మహత్తమమైనది. ధైర్యముగా చేయబడిన నిర్ణయమది. పరస్పర సద్భావ సుహృద్భావముల వల్లనే యీ రాజ్యకూటముతో సంబంధము చిరస్థాయిగా నుండగలదు." అని సర్దార్ వల్లభాయి పటేల్ ఈ నిర్ణయము గురించి ఈ రీతిగా అన్నారు. బ్రిటిష్ రాజ్యకూటమునకు నామకరణము మారినది. ఇకముందునుండియు అది రాజ్యముల సమష్టికూటమని పిలువబడుచుండును. దాని అంగనిర్మాణములో మార్పు కలిగినప్పుడు పేరుకూడా విధిగా మారవలసియున్నది. భారతదేశము సర్వస్వతంత్ర ప్రజాపరిపాలిత రాజ్యంగా ఉండవచ్చును. ఈ ప్రజారాజ్యమునకు బ్రిటిష్ రాజుతో ఏ విధమైన సంబంధమూ లేదు. కాని, ఈ రాజ్యాల కూటమునకు బ్రిటిషురాజు గౌరవార్థముగా ఆధిపత్యము వహించి యుండురు. బ్రిటిష్ రాజ్యకూటంలో భారతదేశమునకు గల సంబంధము విడిపోకుండానే యుండగలదు. భారతదేశ నూతన రాజ్యాంగవిధానము ప్రకారముగా స్వదేశాంగ వ్యవహార ముండును. విదేశాంగ వ్యవహారములందును కూడ భారత దేశము సర్వ స్వతంత్రంగా వ్యవహరించునట్టిదై యుండును. ఈ విధముగా బ్రిటిష్ కామనువెల్తు కూటము భారతదేశానికి అనుకూలంగా తన తత్వమును మార్చుకొనుట పండిత నెహ్రూగారు సాధించిన విజయమని చెప్పవచ్చును.

ఈ కామనువెల్తు కూటమునకు నామమాత్రాధిపత్యం వహించెడి బ్రిటిష్‌రాజు నిర్వర్తించగల అధికారము లేవియు లేవు. ఈ రాజ్యకూటములో చేరిన రాజ్యములకు గల ఏకైక లక్ష్యమునకు లాంఛనమాత్రమైన చిహ్నముగా బ్రిటిష్‌రాజు పెద్దరికము వహించును.

తరువాత విలేఖరుల ప్రశ్నలకు ఈ క్రింది రీతిగా సమాధానము లిచ్చిరి.

ప్రశ్న. బ్రిటిష్‌రాజు ఇదివరకు కూడా లాంఛనమాత్రముగా పెద్దరికమును వహించియుండెను. కనుక, కామనువెల్తు కూటమునకు ఆధిపత్యము వహించుటలోను ఇండియాగవర్నమెంటుకు ఆధిపత్యము వహించుటలోను వ్యత్యాసమేమున్నది ?

సర్దారు పటేలు : బ్రిటిష్‌రాజు ఇండియా గవర్నమెంటుకు అధిపతియగుటలోను కామనువెల్తు కూటమునకు అధిపతియగుటలోను చాలా వ్యత్యాసమున్నది.

ఇప్పుడు ఏర్పడిన ఒడంబడిక ననుసరించి కామన్వెల్తు కూటంలో చేరిన ఏ రాజ్యమైనను అందులోనుంచి విడిపోవుటకు హక్కును కలిగియున్నది. అట్టి హక్కునకు యీ ఒడంబడిక వల్ల భంగము కలుగుటలేదు.

మన ప్రధానమంత్రి నెహ్రూ ఇండియాకు తిరిగి రాగానే ఇండియా మంత్రివర్గమునకు అక్కడ లండనుసభలో జరిగిన వ్యవహారమునంతను నివేదించును. అటుపిమ్మట మన రాజ్యాంగపరిషత్తు ఆ లండనుసభ నిర్ణయమును ఆమోదించి ఖాయపరచవలెను. కామన్వెల్తు రాజ్యాల ఒడంబడిక అ. భా. కాంగ్రెసు వర్కింగు కమిటీకీ కూడా నివేదింపబడును.

ప్రశ్న : కమ్యూనిస్టులు సోషలిస్టులు యీ నిర్ణయమును ప్రతిఘటింపగలరుగదా ? వారితో మీరు ఎట్లా వ్యవహరిస్తారు ?

సర్దారు పటేలు : వారికి సామాన్యవ్యవహార జ్ఞానమును కొంత నేను ఆపాదించెదను.

ప్రశ్న : కామన్వెల్తు కూటంలో భారతదేశం చేరియుండి యీ కామన్వెల్తుతో సంబంధం లేని ఏ యితరరాజ్యంతోనైనను పరస్పర సైనిక సహాయార్థమైన ఒడంబడికలను భారతప్రభుత్వం వ్రాసికొనవచ్చునా ?

సర్దారు పటేలు · అటువంటి నిషేధములు నిరోధములు ఏమిన్నీ లేవు. భారతదేశం తన యిష్టమైన ఒడంబడికలను ఇతర రాజ్యాలతో చేసికొనవచ్చునుకాని, కామన్వెల్తులో చేరిన రాజ్యాల సాంగత్యప్రభావం భారతదేశముమీద పనిచేయగలదు. ఈ రాజ్యకూటమి ఒడంబడికలో వర్తక సంబంధములగూర్చి చర్చించలేదు. అది ఒక ప్రత్యేకవిషయముగా ఆలోచింపబడవలసియున్నది.

ప్రశ్న : కామన్వెల్తులో చేరియుండుటవల్ల భారతదేశమునకు ఏర్పడు బాధ్యతలేవైన కలవా?

పటేలు : స్నేహపూర్వకమైన బాధ్యతలు కొన్ని కలవు. కొన్ని లాభాలు ప్రయోజనాలు కూడా కలవు. అవిరోధమార్గములను శాంతిప్రతిష్ఠాపన మార్గములనుగూర్చియే భారతదేశ మెక్కువగా నొక్కి వక్కాణించుచు తన పలుకుబడినంతను అందుకై వినియోగించగలదు.

ప్రశ్న : కామన్వెల్తు కూటంలోని ఏరాజ్యమైనను ఫాసిస్టుతత్వం అనుసరించినట్లయితే అట్టి రాజ్యమునకుకూడా యీ కూటంలో సభ్యత్వస్థాన ముండగలదా ?

పటేలు: ఏసభ్యరాజ్యమైనను ఫాసిస్టు రాజ్యముగా మారునని నేను తలంపను.

ప్రశ్న : కామన్వెల్తు కూటంలో భారతదేశం చేరియుండటంవల్ల ఇతర బ్రిటిష్ అధినివేశములలోని భారతీయుల పరిస్థితులు బాగుపడగలవా ?

పటేలు : కామన్వెల్తు రాజ్యాల ప్రజలకు ఆ రాజ్య పౌరహక్కు ఒకటి ఏర్పడగలదు. అట్టి పౌరస్వామ్యమును కామన్వెల్తు రాజ్యకూటములోని రాజ్యాలు కలిసి శాసించగలవు.

పత్రికా ప్రతినిధుల సమావేశములో సర్దారు వల్లభాయ్ పటేల్‌గారు యీ క్రిందిరీతిగా తమ అభిప్రాయప్రకటన చేసిరి :

లండను సభలో గతవారము కామన్వెల్తు రాజ్యాలతో స్వతంత్రభారతదేశమున కుండవలసిన సంబంధమునుగూర్చి జరిగిన చర్చలవిషయమై చేయబడిన ప్రకటన పత్రికలలో మీరు చదివియే యుందురు. మన భారతదేశ మింతవరకును బ్రిటిష్ కామన్వెల్తులో చేరిన ఒక అధినివేశ రాజ్యముగా ఉంటున్నది. ఇలా ఉండుటకు మనము అంగీకరించితిమి.

కాని యీ అధినివేశ ప్రతిపత్తిని కూడా రాజ్యాంగపరిషత్తు యథేష్టముగా మార్చుకొనుటకు అధికారము కలిగియుండవలెననే షరతుకులోబడి తాత్కాలికంగా అధినివేశప్రతిపత్తిని స్వీకరించి యుంటిమి. భారతదేశము సర్వస్వతంత్ర రాజ్యముగా నుండవలెనని రాజ్యాంగపరిషత్తు తన లక్ష్య నిర్వచనమును మొదటి సమావేశములో చేసెను. కాని, ఇంగ్లాండుతోను కామనువెల్తులోని ఇతర రాజ్యాలతోను మనకు సన్నిహిత సంబంధము[illegible]వలెనని మన కోరికను వెల్లడించియుంటిమి. కనుక మన కోరికలను మన లక్ష్యమును సమన్వయించుట ఎట్లను విషయము ముఖ్య సమస్య యైనది. ఈ విషయమై శ్రద్ధగా ఆలోచించితిమి. బ్రిటిషు కామనువెల్తులో చేరియుండగల్గు నిమిత్తమై మన రాజ్యాంగస్వాతంత్ర్య ప్రతిపత్తి మార్పుచేయుట కెప్పుడును పూనుకొనలేదు. అందువల్ల కామనువెల్తు[illegible]కూటముయొక్క నైజతత్వమునే కొంత[illegible]మార్పు చేయవలసి వచ్చినది. బ్రిటిషు కా[illegible]నువెల్తుకూటము మొదటినుండియు సమయానుకూలంగా వర్తించుచున్నదే గాని ఒక స్థిరమైన సిద్ధాంతమును పట్టుకొని ప్రాకులాడలేదు. అట్టి సమయస్ఫూర్తి స్వభావము కల్గియుండుటవల్లనే బ్రిటిషు కామనువెల్తు కూటం అనేక విషమపరిస్థితులలో నిలువబడగల్గినది.

ఈ సమస్యనుగూర్చిన చర్చలయందు ఇంగ్లండున్నూ ఇతరఅధినివేశ రాజ్యములున్నూ మనతో చాలా ఆదరణభావంతో సౌమ్యంగా వ్యవహరించినవి. ఆయా అధినివేశరాజ్యాల ప్రతినిధులతో ఇష్టాగోష్ఠి సంభాషణలు అనేకము ఇదివరకు జరిగెను. మనము నిర్ణయించుకొన దలంచిన రాజ్యాంగవిధానమునకు అనుకూలముగా చేయవలసిన మార్పులను చేయుటకు అధినివేశ రాజ్యాలవారు సుముఖత చూపించిరి.

ఈవిషయమై పండిత నెహ్రూ గారు అనేక పర్యాయములు ప్రకటనలు చేసియుండిరి. ఏ విధముగా యీ సమస్యను వీరు పరిష్కరింప గోరిరో విశదపరచిరి. నెహ్రూగారీ సభకు బయలుదేరునప్పుడు తాము అవలంబించ దలంచిన వ్యవహార విధానమును వివరించిరి. ఇప్పుడీ సభ నిర్ణయ పర్యవసానము తదనుకూలంగానే యున్నది. లండను సభలో మొదటినుండియు భారతదేశముయెడల స్నేహభావము చూపబడెను. ఏవిధముగానైనను భారతదేశానికి కామన్వెల్తు కూటంలో సభ్యత్వము కల్పించవలెననే ఉద్దేశ్యముతో కృషి జేయబడెను. ఇకముందునుండియు యీ బ్రిటిష్ కామన్వెల్తు కూటము "రాజ్యాలకూటం" అని మాత్రమే పిలువబడును. బ్రిటిష్‌రాజు యీ కూట

(20-వ పేజీ చూడుము)



జార్జి బెర్నార్డ్ షా, పండిట్ నెహ్రూ.
—సండే న్యూస్ సౌజన్యంతో.

ప్రపంచవ్యాప్తమైన కమ్యూనిజం ఛాయలు:

కమ్యూనిస్టుపార్టీల తంత్రాలు

[ప్రపంచ విప్లవమే ప్రధానలక్ష్యంగా పెట్టుకున్న రష్యా, కమ్యూనిస్టు పార్టీలద్వారా ఏరీతిగా ప్రపంచంలో అరాచకం రెచ్చగొట్టడానికి యత్నిస్తున్నదీ, అమెరికన్ విదేశాంగ వ్యవహారశాఖ కమిటీ ఒకటి పరిశీలించి, సమర్పించిన నివేదికలో కొన్ని భాగాలు వ్యాఖ్యానసహితంగా గత వారం సంచికలో ప్రచురించబడినాయి. ఇప్పుడు మరికొన్ని భాగాల నిక్కడ అదే రీతిగా, మన దేశంలో పరిస్థితులతో పోల్చిచూపుతూ ప్రచురిస్తున్నాము.]

ప్రపంచంలో దాదాపు అన్ని దేశాలలోనూ కమ్యూనిస్టుపార్టీ లేర్పడినాయి. 1947 లో లండన్‌లో వివిధ దేశాల కమ్యూనిస్టులు సమావేశ మైనప్పుడు ఏయే దేశాలలో పార్టీ బలం ఉందో జాబితా ఒకటి తయారు చెయ్యబడింది. దాని ప్రకారం ఆసియాలో చీనాతరవాత పార్టీ బలం ఇండియాలో అధికంగా ఉంది. చీనాలో 20 లక్షల మంది, ఇండియాలో 53,700 మంది, కొరియాలో 50 వేలమంది, బర్మాలో 4 వేల , జపాన్‌లో 6 వేలమంది, మలయాలో లమంది కమ్యూనిస్టుపార్టీ సభ్యులు న్నారు. మ యూరప్‌లో పశ్చిమ జర్మనీలో మూడు లక్షలమంది, గ్రీస్‌లో నాలుగు లక్షలమంది, న్‌లో 43 వేలమంది, ఫ్రాన్సు లో 13 క్షలమంది, ఇటలీలో 22 లక్షలమందిఉన్నారు. అమెరికాలో యునైటెడ్‌స్టేట్సులో 74 వేల మంది, క్యూబాలో లక్షన్నరమంది, బ్రెజీల్‌లో లక్షా 30 వేలు ఉన్నారు. ఆఫ్రికాలో ఎక్కడెంతమంది ఉన్నదీ తెలియదు. ఆస్ట్రేలియాలో 25 వేలమందిమాత్రం ఉన్నారు.

పార్టీబలం సంఖ్యాబలంపై ఆధారపడి ఉండదనీ, సభ్యత్వం గురించి లెనినిస్టు పద్ధతిని అవలంబించడంపైనే ఆధారపడిఉంటుందనీ కమ్యూనిస్టులంటారు.

ప్రథమ ప్రపంచ సంగ్రామం ముగిసినది మొదలు వివిధ దేశాలలోని కమ్యూనిస్టుపార్టీలు రష్యా విదేశాంగనీతికి అతిసన్నిహితంగా అనుసరిస్తాయి. వివిధదేశాలలోని పార్టీలు కూడబలుక్కుని సహకారవిధానం అవలంబిస్తాయి.

సోవియట్‌రష్యా ప్రథమ ప్రపంచసంగ్రామానంతరం చాలా దేశాలతో మైత్రిసంధి చేసుకొంది. ఈ సంధిప్రకారం ఆయా దేశాల్లో ప్రభుత్వాలను పడగొట్టాలనే తలపుతో ప్రారంభించబడే ఉద్యమాలకు రష్యా తోడ్పడ దని వాగ్దానం చేసింది. కాని వాస్తవానికి ఈ సంధికి రష్యా ఎన్నడూ కట్టుబడిఉండలేదు. అంతర్జాతీయ కమ్యూనిస్టు సంస్థ (కమింటర్న్) ద్వారా ఆ దేశాల్లోని కమ్యూనిస్టుపార్టీల విప్లవ కార్యక్రమాలకు తోడ్పడింది. ఈ రీతిగా ద్రోహం చేసినది రష్యా ఒక్కటే కాదు. ఇతరదేశాలుకూడా మోసమే చేశాయి. రష్యాలో సోవియట్ ప్రభుత్వం స్థాపించబడిన పది సంవత్సరాల వరకూ సోవియట్ ప్రతికూలోద్యమాలకు అన్యదేశాలలో ప్రభుత్వాల తోడ్పాటు లభించింది. వైట్‌రష్యన్లను అనేకదేశాలు పోషించి వారి సైన్యాలకు తరిఫీదు లిచ్చాయికూడా.

జాతీయోద్యమాల్లో కమ్యూనిస్టులు:

గత 12 సంవత్సరాలనుంచీ కమ్యూనిస్టులు అన్ని దేశాలలోనూ జాతీయోద్యమాలతో చేయి కలిపి పనిచేస్తున్నారు. వాస్తవానికి కమ్యూనిస్టు తత్వంలో జాతీయభావానికి తావు లేదు. జాతీయావసరాలకు భిన్నమైనా సరే ప్రపంచ కార్మికవిప్లవమే వారి ఆదర్శం. కాని జాతీయోద్యమాల్లోకూడా వారికి ప్రధానకర్తవ్యం ఉందని 1935 లో కమింటర్న్ ఏడవసమావేశం తీర్మానించింది. దీని ప్రకారం జాతీయోద్యమాల్లో కమ్యూనిస్టులు చేరారు. 1945 వరకూ భారతదేశ కమ్యూనిస్టుపార్టీ జాతీయకాంగ్రెస్‌లోనే ఉండి జాతీయస్వాతంత్ర్యోద్యమంలో కృషిచేసింది. అయితే రష్యాతో ఆయా దేశాల వ్యవహారాలు మారినందువల్ల ఆదేశాల కమ్యూనిస్టు పార్టీలు రంగు మార్చుకోవడానికి ఎన్నడూ శంకించలేదు. రెండుసంవత్సరాలపాటు (1939 మొదలు 1941 వరకూ) జర్మనీరష్యాపైదాడిచేసేవరకూ "సామ్రాజ్యవాదులమధ్య జరిగే యుద్ధంలో పాల్గొనకూడదు"అని ప్రచారం చేసిన వివిధ దేశాల కమ్యూనిస్టుపార్టీలు, ఆ తరువాత "ఫాసిస్టుల్ని రూపుమాపడానికి జరుగుతున్న ప్రజాయుద్ధం" లో ప్రజలు ప్రభుత్వాలకు సహాయపడాలని తిరిగి ప్రచారం చేశారు.

జాతీయోద్యమాల్లో పాల్గొనడంవల్ల పార్టీలు బలపడే అవకాశం కలగడమే కాకుండా, అంతర్జాతీయ రాజకీయాల్లో రష్యాకు కొన్ని అనుకూలపరిస్థితు లేర్పడతాయి. అందువల్లనే ద్వితీయ ప్రపంచ సంగ్రామం అనంతరం కూడా కమ్యూనిస్టుపార్టీలు జాతీయోద్యమాల్ని విడిచిపెట్టలేదు. యూరప్ వ్యవహారాల్లో అమెరికా జోక్యంకలుగచేసుకుంటున్నందువల్లయూరప్‌లో జాతీయాభిమానం పురికొల్పవచ్చును. మిత్రభేద యుక్తికి జాతీయోద్యమాలు చక్కని పరికరాలు. కొన్నికొన్ని దేశాలలో విప్లవాలు, అంతర్యుద్ధాలు వచ్చినప్పుడు వానిని పరిష్కరించడానికి అన్యదేశాలను రాకుండా చేయవలసిన అవసరం



కమ్యూనిష్టు శిల్పము

(న్యూఆర్లియన్సు టైమ్స్‌పత్రిక)

ఉంది. అప్పుడు గాని కమ్యూనిజంవ్యాప్తి నిరాఘాటంగా జరుగదు. "అంతర్యుద్ధాలవల్ల ఎప్పుడూ కీడే కలుగదు. ఒక్కొక్కప్పుడు మేలుకూడా కలుగుతుం"దని ఐక్యరాజ్యసమితిలో ఒకసారి రష్యా ప్రతినిధి అన్నాడు.

మొత్తానికి జాతీయోద్యమంలో పనిచేస్తూ, లెనిన్ బోధించిన వామపక్షకమ్యూనిజం సిద్ధాంతాలను కమ్యూనిస్టు పార్టీలు అనుసరిస్తున్నాయి.

శాసన ప్రతిఘటన:

కమ్యూనిస్టులు శాసనసభల్లో సభ్యత్వానికి ఎన్నికల్లో నిలుస్తారుకూడా. శాసనసభల్లో ఏ కొద్దిమంది ఉన్నా శాసనాల్ని ప్రతిఘటించగలరు. జర్మనీలో హిట్లర్ అధికారంలోకి రాకముందు శాసనసభలో కమ్యూనిస్టుల తంత్రాలవల్లనూ, వారివద్ద పాఠాలునేర్చిన నాజీలవల్లనూ నాలుగు పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. క్రమక్రమంగా ఉభయ పక్షాల బలం వృద్ధిఅయింది. అన్యపక్షాలు వీగిపోయాయి. ఫ్రాన్స్, ఇటలీ దేశాలలో ఇప్పుడు కమ్యూనిస్టులు ఆ తంత్రమే ప్రయోగిస్తున్నారు.


అన్యపక్షాలపై దాడి:

అన్యపక్షాలలో చేరి ఆ పక్షాలను భగ్నపరచాలనేది లెనిన్ ఆదేశం. ఈ పద్ధతివలన కమ్యూనిస్టులు ఇదివరలో చాలా ప్రయోజనాలు పొందారు. యూరప్‌లో లిబరల్ పార్టీలలోనూ వలసదేశాల్లో జాతీయోద్యమపక్షాల్లోనూ కమ్యూనిస్టు లీ తంత్రాన్ని అవలంబిస్తున్నారు. భారతదేశంలో సోషలిస్టుపక్షంలోనూ కాంగ్రెస్ పక్షంలోనూ చేరి రెండు పక్షాల్నీ విచ్ఛిన్నం చెయ్యాలని కమ్యూనిస్టులు ప్రయత్నం చేస్తున్నారు. ఈ రీతిగా అన్యపక్షాలలో చేరి ప్రజాస్వామ్యనినాదాల్ని, జాతీయనినాదాల్ని వారికంటె బిగ్గరగా ఘోషిస్తున్నారు. తదితర పక్షాల్ని నీచంగాకూడా దూషిస్తారు. సార్వజనీనమైన వోటింగువిధానం కావా లంటారు. పన్నులు తగ్గించాలి. ప్రభుత్వం ప్రజలకి సదుపాయాలు అధికంగా చెయ్యాలి. పరిశ్రమలు వృద్ధికావాలి. వస్తూత్పత్తి వృద్ధికావాలి. కార్మికుల వేతనాలు హెచ్చించాలి. అన్యపక్షాలవారిని దూషించడంలో హద్దుండదు. ఇటలీ, ఫ్రాన్స్ దేశాల్లో కమ్యూనిస్టులు అన్యపక్షాల వారిని దూషించడానికి చిత్రవిచిత్రాలైన పదాలు సృష్టించారు కూడా. మనదేశంలోనూ సృష్టిస్తున్నారు. వారిపత్రికలనిండా ఈ పదాలు నిత్యం కనిపిస్తూఉంటాయి. ఎవరి నెప్పుడు దూషించాలో, లేక భూషించాలో వారికి బాగా తెలుసును. నిశ్చింతగా క్షణంలో దూషణని భూషణకీ, భూషణని దూషణకీకూడా మార్చగలరు.

పత్రికలద్వారానూ, కరపత్రాలద్వారానూ ప్రచారం చెయ్యడంలో వారికి అపారమైన ప్రజ్ఞ ఉంది. వీలు చిక్కినప్పుడు అన్యపక్షాల పత్రికలు రేడియోలద్వారాకూడా ప్రచ్ఛన్నంగా ఉండి తమ ప్రచారం చేసుకుంటారుకూడా. కార్మిక సంఘాలు రాజకీయ సంఘాలు కమ్యూనిజం ప్రచారానికే ముఖ్యంగా వారికి ఉపయోగపడతాయి. విజ్ఞానసమితులు, అభ్యుదయభాషా సమితులు, ఆర్థిక సంఘాలు ఇందుకే ఉపయోగపడతాయి. ఈ సంస్థల వ్యవహారాల్ని కమ్యూనిస్టులే వెనుక నుండి నడుపుతారు. పైకి కనిపించరు. పేరుపొందిన రచయితల్ని, రాజకీయవాదుల్ని ముందుంచుతారు. కార్మికసంఘాల్లో ఏ కొద్దిమంది చేరినా చాలును. కార్మికుల్లో ప్రచారం చేసి హమేషా సమ్మెలు తెచ్చిపెట్టుతుంటారు.

అన్యపక్షాల్లో చేరి కమ్యూనిస్టులు వారి నేరీతిగా తప్పుదారి పట్టించి తమ ప్రయోజనాలు నెరవేర్చుకుంటారో చూస్తే ఆశ్చర్యంగా ఉంటుంది. ద్వితీయప్రపంచసంగ్రామం ముగియవచ్చేసమయంలో పోలండ్‌లో గుప్తంగా చేర్చబడిన జనరల్ బోర్ సైన్యం జర్మన్లపై తిరుగుబాటు చెయ్యడానికి సిద్ధంగా ఉంది. జన

(17వ పేజీ చూడుడు)



ఉపన్యాసకుని వేదిక

(న్యూయార్కు టైమ్స్‌పత్రిక)

ఫ్రెంచిపాలకుల దాస్యంనుంచి ముక్తి పొందడానికి ఇండోచీనా జాతీయ సమరం

ఇండియా, చీనాదేశాల పురాతన నాగరికతా ఛాయలు ఇండోచీనాలో సమ్మేళన మైనాయి. ఈ దేశానికి సన్నిహితంగా ఉన్నవి బర్మా, చీనా, సయాందేశాలు. 286,000 చ॥ మైళ్ల విస్తీర్ణంగల ఈదేశం ఫ్రాన్సుకి రెట్టింపుంది. జనాభా 2 కోట్ల 65 లక్షలమందిలో అయిదింట నాలుగువంతులు ఆనాం జాతివారు. మిగతావారు కాంబోడియన్లు (ఖ్మెర్లు), థాయ్‌లు, లావోషియన్లు, చీనాజాతివారు. ఇంకా మలయా-చీనా జాతులు సంకరమైన మిశ్రమజాతులవారు కూడా ఉన్నారు. జనాభాఆధిక్యతనుబట్టే కాక, ప్రాచీననాగరికతవల్ల కూడా ఇండోచీనా దేశం ఆనామీయులదే. వీరు ఆనాం, టాంకింగ్, కొచ్చిన్ చీనాలలో ఉన్నారు.

ఇండోచీనాలో సహజసంపద అపారం. వరి, తేయాకు సమృద్ధిగా పండుతాయి. రబ్బరు, కలప అపారంగా ఎగుమతి చెయ్యగలదు. సైగాన్, టురేన్, హైఫాంగ్ అనే మూడు పెద్ద ఓడరేవు లున్నాయి. దేశమంతా రైల్వే మార్గాలు, రోడ్లు సౌకర్యంగా ఉన్నాయి కాంబోడియా ప్రధాననగరం నామ్‌పెన్ పెద్ద వ్యాపారకేంద్రం. హనోయ్ - సైగాన్ రైల్వే 1160 మైళ్ల పొడ వుంది.

ఇండోచీనాలో ప్రధాన మైనది వ్యవసాయం. యుద్ధానికి పూర్వం ప్రపంచంలో వరిపంటలో ఇండోచీనాది అయిదవస్థానం ఉండేది. సయాం బర్మాల తరువాత అధికంగా బియ్యం ఎగుమతి చేసిన దేశం ఇదే కాని ఈనాడు ఫ్రెంచిసైన్యాల దౌర్జన్యంవల్లనూ, యుద్ధంవల్లనూ, వరిపంటచాలా పడిపోయింది. ముడి పదార్థాల ఎగుమతులు తగ్గిపోయినాయి. వరి పండే ప్రదేశమంతా దాదాపు వియత్‌నామ్ రిపబ్లిక్‌లోనే ఉంది. పరిశ్రమాభివృద్ధికి అపారావకాశా లున్నాయి. ఇప్పుడు రిపబ్లిక్ పరిపాలనలో చిన్నచిన్న పరిశ్రమలు ప్రభుత్వ ప్రోత్సాహం పొంది వృద్ధిపొందు తున్నాయి.

ఇండోచీనాతో ఫ్రాన్సు "మైత్రి" 1787 నుంచి ఆరంభమయింది. అప్పుడు పినోడిబహేన్ అనే క్రైస్తవమతాచార్యుడు ఆనాటి ఫ్రెంచి రాజు పదహారో లూయీకి, కొచిన్‌చీనా రాజుకి మధ్య సంధి కుదిర్చాడు.

అప్పుడు ఆ కొచిన్ చీనారాజు ఆనాం సింహాసనంపై హక్కుందని వాదించేవాడు. ఇది చివరికి ఇండోచీనాలో ఫ్రెంచి ప్రాధాన్యం నెలకొనడానికి హేతువయింది. మూడు శతాబ్దాల సంబంధంతో ఇండోచీనాలో ప్రజల జీవనవిధానంలోనూ, నాగరికతలోనూ పూర్తిగా మార్పు వచ్చింది.

1881-1889 సంవత్సరాలలో ఇండోచీనాలో జాతీయభావం ప్రచార మయింది. ఆ తరువాత నుంచీ 1946 ఆగస్టువరకూ ఇండోచీనాలో ఫెడరల్ రాజ్యాంగవ్యవస్థ ఉండిపోయింది.

ఇండోచీనాదేశంలో కొచ్చిన్‌చీనా (47 లక్షల జనాభా) 1862 లో ఫ్రెంచివారికి వలస అయింది. మిగతా నాలుగుప్రాంతాలూ, అనగా కాంబోడియా 1863 లోనూ టాంకింగ్ 1884 లోనూ, ఆనాం 1886 లోనూ, లావోస్ 1893 లోనూ ఫ్రెంచి సంరక్షణలోకి (ప్రొటెక్టరేట్) వచ్చాయి.

1889 మొదలు 1940 వరకూ ఇండోచీనాలో పారిశ్రామిక వాణిజ్యాది వ్యవహారాలు చాలా వృద్ధిపొందాయి. జనాభా పెరిగింది. దేశంలో పెట్టుబడి పెరిగింది. వస్తూత్పత్తి పెరిగింది. ఫ్రెంచి విద్య నభ్యసించిన ఇండోచీనా జాతీయు లనేకమంది విజ్ఞానశాస్త్రజ్ఞులు, పండితులు, న్యాయవాదు లయినారు. క్రమక్రమంగా వారు పురాతన చీనీలిపి మానివేశారు. రోమన్‌లిపిలో వియత్‌నమ్‌భాషను వ్రాయ నారంభించారు అప్పటినుంచీ విద్య జనసామాన్యానికి అందుబాటులోకి వచ్చింది. వైద్యవిద్య అనేకుల నాకర్షించింది. 1940 సంవత్సరానికి ఇండోచీనాలో అయిదు వైద్యపరిశోధనాలయాలు, 125 ఆస్పత్రులు, 500 చిన్నఆస్పత్రులు నెలకొన్నాయి. 50 సంవత్సరాల్లో ఇండోచీనాలో అపూర్వమైన ఆర్థిక రాజకీయ సాంఘిక పరిణామాలు వచ్చాయి.

జపాన్‌ఆక్రమణ:

1940 లో ఫ్రాన్సులో జర్మనీసైన్యాలు ప్రవేశించగానే ఫ్రెంచిప్రభుత్వం ఓటమి నంగీకరించగానే ఇండోచీనాలో బావోడాయ్ ప్రభుత్వం నామమాత్రావశిష్టంగానే మిగిలిపోయింది. దేశంలో ప్రభుత్వంపట్ల ప్రజలకు విశ్వాసం పూర్తిగా నశించింది. దేశాన్ని ప్రభుత్వం పరిపాలించలేని స్థితిలోకి వచ్చింది.

పెర్ల్‌హార్బర్ పతనంకాగానే జపాన్ సైన్యాలు టాంకింగ్ రేవులో దిగాయి. విచీ ప్రభుత్వాధిపత్యంకింద ఇండోచీనాలో సైనికాధికారిగా ఉన్న అడ్మిరల్ డీకో యుద్ధం చెయ్యకుండానే జపాన్ సైన్యాలకు లొంగిపోయాడు. జపనీస్ సైన్యాలు ప్రధాననగరమైన హ్యూ ప్రవేశించి బావోడాయ్ రాజభవనం చుట్టూ సైనిక నిర్బంధం విధించాయి. దేశంలో ఫ్రెంచి సైన్యాలున్నప్పటికీ ఏ పాటి యుద్ధం చెయ్యకుండా ఇండోచీనాను జపాన్‌కు ఒప్పగించాయి. బావోడాయ్‌కి జపాన్ ఆధిపత్యం రుచించలేదు.

వియత్‌నమ్, వియత్‌మిన్

ఈ సమయంలో జపాన్ పరిపాలనను ప్రతిఘటించడానికి ఆనాంజాతీయోద్యమం ఆరంభమయింది. దీనికి నాయకత్వం వహించినవాడు హోచిమిన్. యుద్ధగతిని గమనించిన జపాన్ పరిపాలకులు ఇండోచీనాలో జాతీయోద్యమాన్ని బలపరచ నారంభించారు. ద్వితీయ ప్రపంచ సంగ్రామం ప్రారంభం కాకముందే ఆనామీయులు జాతీయోద్యమం ప్రారంభించారు. వారు స్వపరిపాలన సంపూర్ణ స్వాతంత్ర్యం కావా లన్నారు.

1941-42 సంవత్సరాల్లో ఫ్రెంచి పరిపాలన తొలగిపోవాలనే పార్టీలన్నీ చేరి స్వపరిపాలన పక్షంగా ఏకమైనాయి. దీనినే వియత్‌మిన్ (వియత్‌నమీస్ ఫ్రంట్ అని అర్థం) అన్నారు. ఈ పార్టీలో కమ్యూనిస్టులు ముఖ్యులే అయినా, దేశీయ రాజకీయావసరాలకలన కమ్యూనిస్టు ప్రభావం ప్రచ్ఛన్నంగా ఉండిపోయింది. వాస్తవానికి ఇండోచీనాలో సక్రమంగా నిర్మించబడిన పార్టీ కమ్యూనిస్టుపార్టీ ఒక్కటేనని చెప్పవచ్చును. ప్రచ్ఛన్నంగా ఉన్నప్పటికీ కమ్యూనిస్టులే వియత్‌మిన్‌లో ప్రధాన పాత్ర వహించి ప్రజల్లో జాతీయ చైతన్యం తేవడానికీ, జాతీయైక్యతాభావం వ్యాపింప చెయ్యడానికీ కృషిచేశారు. ఈ ఉద్యమంలో కమ్యూనిస్టులు అతివాదజాతీయతత్వాన్ని ప్రదర్శించారుకూడా.

వియత్‌మిన్ పార్టీ కోరే షరతుల్లో ముఖ్యమైనవి 1. బేషరతుగా ఇండోచీనాకు సంపూర్ణ స్వాతంత్ర్యం ఇవ్వాలి. 2. ఫ్రెంచి సైన్యాలు, ఫ్రెంచి వ్యాపారులు, ఫ్రెంచి పాలకులు, ఫ్రెంచి జాతీయులు దేశం విడిచి పోవాలి. 3. ఫ్రెంచి సంరక్షణలో ఉన్న ప్రాంతాల్ని ప్రస్తుత వియత్‌నమ్ రిపబ్లిక్‌లో చేర్చాలి.

హోచిమిన్:

వియత్‌నమ్ రిపబ్లిక్ అధ్యక్షుడు హోచిమిన్ ఉత్తర ఆనాంలో 1894 లో జన్మించాడు. 1919 లో ఫ్రాన్సులో నివాసం ఏర్పరచుకున్నాడు. అక్కడ కమ్యూనిస్టుపార్టీలో చేరి మూడో అంతర్జాతీయ కమ్యూనిస్టు సంస్థ సభ్యుడైనాడు. లి పెరయా అనే పత్రికకు సంపాదకుడైనాడు. 1923 లో రష్యా వెళ్లి, మూడు సంవత్సరాలతరవాత అక్కడినుంచి దక్షిణ చీనా చేరాడు. అక్కడ ఆగ్నేయాసియాలోని అంతర్జాతీయ కమ్యూనిస్టు సంస్థ (కమింటర్న్) ఏజంట్లయిన బొరోడిన్, లిగాలెన్‌ల వద్ద సహాయకుడుగా పనిచేశాడు. హాంకాంగ్‌లో ఆనాం కమింటర్న్ శాఖ స్థాపించాడు. తిరిగి రష్యా వెళ్లాడు. 1940 లో తిరిగి చీనావచ్చాడు. మరొక సంవత్సరంలో ఇండోచీనాలో వియత్‌మిన్ పక్షాన్ని స్థాపించాడు. మార్క్సిస్టుగాకమ్యూనిస్టు వర్గాల్లో పేరుపొందాడు. ఇప్పుడు వియత్‌నమ్‌లో ప్రజలకు అతనిపై అమితమైన ప్రేమానురాగాలు, భక్తివినయాలు అలవడినాయి.

రిపబ్లిక్ ప్రకటన:

హిరోషిమా, నాగసాకీ నగరాలు ఏటం బాంబులవల్ల ధ్వంసం కావడంతో 1945 ఆగస్టు 15 వ తేదీని జపాన్ ఓటమిని అంగీకరించింది. అంతతో ఇండోచీనాలో కల్లోలం ఆరంభమయింది. ఇండోచీనాలోని జపనీస్ సైన్యాలు మిత్రరాజ్య సైన్యాలకు లొంగిపోవడానికి సిద్ధపడుతున్నాయి. ఆగస్టు 28 వ తేదీని హోచిమిన్ టాంకింగ్ నగరంలో వియత్‌నామ్ రిపబ్లిక్ రాజ్యస్థాపన ప్రకటించాడు. సెప్టెంబరు 19 వ తేదీని మేజర్ జనరల్ గ్రేసీ నాయకత్వం కింద బ్రిటిష్‌సైన్యాలు సైగాన్‌రేవులో దిగాయి. గ్రేసీ తనవెంట కొద్దిమంది ఫ్రెంచి సైనికుల్నీ, ఫ్రెంచి పరిపాలనాధికారుల్నీ తీసుకువచ్చాడు. 22 వ తేదీని సైగాన్‌లో జనరల్ పోస్టాఫీసునీ కారాగారాల్నీ స్వాధీనపరుచుకున్నాడు. ఫ్రెంచి అధికారులు బ్రిటిష్ సైన్యం సహాయంతో సైగాన్ నగరాన్ని పరిశీలించడానికి యత్నించారు. తరువాత బ్రిటిష్ సైన్యాలు వియత్‌మిన్ పక్షీయులతో పోరాటం సాగించారు. తత్ఫలితంగా వారికి చిక్కినది కొచిన్ చీనా మాత్రమే. అప్పటికి ఫ్రెంచి అధికారుల చేతిలో కొచిన్ చీనా, రిపబ్లికన్ల చేతిలో ఆనాం, టాంకింగ్, రాష్ట్రాలూ ఉన్నాయి. ఉభయపక్షాలూ ఎంతపోరాడినా ఈ పరిస్థితి మారడంలేదు.

ఆనాం, టాంకింగ్, కొచ్చిన్ చీనాలకు ఆనామీయు లిచ్చిన పేరు వియత్‌నమ్. ఈ మూడు రాష్ట్రాలలోనూ అధికసంఖ్యాకులు ఆనామీయులే. ఇప్పుడు హోచిమిన్ అధ్యక్షత క్రింద రిపబ్లిక్‌గా పరిపాలించబడుతున్న ప్రాంతాన్నే ప్రస్తుత రాజకీయాలలో వియత్‌నమ్ అని వాడుతున్నారు.

1946 జనవరిలో వియత్‌మిన్ వియత్‌నమ్ రిపబ్లికన్ ప్రాంతంలో ఎన్నికలు జరిపి శాసనసభను స్థాపించింది. శాసనసభలో వియత్‌మిన్ పక్షానికి సంఖ్యాధిక్యత లభించింది వియత్‌మిన్ పక్షం మంత్రివర్గం నిర్మించింది. 1946 మార్చిలో మంత్రివర్గం పునర్నిర్మించబడింది. అప్పుడు శాసనసభలోని ప్రతికూలపక్షానికి చెందినవారిలో నలుగురిని మంత్రులుగా నియమించారు.

రిపబ్లిక్ ప్రకటించబడిన రోజున బావోడాయ్ సింహాసనాన్ని పరిత్యజించాడు. తాను కూడా ఫ్రెంచిపాలనాధిపత్యం తొలగిపోవాలన్నాడు. "బానిసదేశానికి చక్రవర్తిగాఉండడం కంటె స్వతంత్రదేశంలో సామాన్యపౌరుడుగా జీవించడం మేలు" అన్నాడు. కాని ఒక పెద ఫ్రెంచివారి దాస్యం గిట్టదు. మరొక పెద కమ్యూనిస్టులంటే కూడా అతనికి ద్వేషం హెచ్చు. రాజ్యం త్యజించిన తరువాత బావోడాయ్ హాంకాంగ్‌లో నివాసం ఏర్పరుచుకున్నాడు.

ఫెడరేషన్ వ్యవస్థ; ఫ్రెంచికుతంత్రం:

1946 మార్చి 6 వ తేదీని వియత్‌నమ్‌లో రిపబ్లికన్ పరిపాలనకు సమ్మతిస్తూ, నిస్సహాయంగా ఉండిపోయిన ఫ్రెంచి పాలకాధికారులు చివరికి వియత్‌మిన్‌తో సమాధానంచేసుకున్నారు. "ఫ్రెంచియూనియన్, ఇండోచీనా ఫెడరేషన్లలో వియత్‌నమ్ సర్వస్వతంత్రమైన ఒక రాజ్యంగా" వ్యవహరించవచ్చునని అంగీకరించారు. రిపబ్లిక్ స్వతంత్రంగా పరిపాలించుకోవచ్చుననీ, సైన్యం, శాసనసభలు, ఆర్థిక వ్యవహారాలు స్వతంత్రంగా నిర్వహించుకోవచ్చుననీ ఒప్పుకున్నారు.

ఇంక ఆనాం, టాంకింగ్, కొచిన్ చీనాలను ఒకేపరిపాలనక్రిందికి తేవడంకోసం జనవాక్యనిర్ధారణద్వారా కొచిన్ చీనా ప్రజలు వియత్‌నమ్ రిపబ్లిక్‌తో చేరగలరో, లేదో నిర్ణయించవలె నని సంధిచేసుకున్నారు.

జనవాక్యనిర్ధారణ జరిగేవరకూ దేశంలో ఫ్రెంచి ప్రతికూలోద్యమం నిలిపివేయాలనీ, దేశంలో మూలమూలలనున్న ఫ్రెంచిదేశస్థుల్నీ, వారిపెట్టుబడుల్నీ, వారి ఆస్తుల్నీ రక్షించాలనీ ఫ్రెంచిప్రభుత్వం రెండు షరతులు పెట్టింది. ఫ్రెంచివారిపక్షాన ఫ్రెంచి హైకమిషనర్ సేంటెనీ, వియత్‌మిన్ పక్షాన హోచిమిన్ ఒడంబడికపై సంతకాలు చేశారు.

కాని ఫ్రెంచి పరిపాలకులు ఒకవైపున ఒడంబడికకు సమాలోచనలు జరుపుతూ, మరొకవంక ఆనాంలో సైనికచర్యలు ఆరంభించారు. ఫ్రెంచివారితో ఇంక సఖ్యత కుదరడం భమమనీ, వారితో ఒడంబడిక చేసుకున్న లాభం లేదనీ, ఒడంబడిక చేసుకున్నా [illegible] వారు పాటించగలరనే విశ్వాసం నశించ[illegible] హోచిమిన్ చెప్పాడు. ఒడంబడిక [illegible] మయింది. ఏప్రిల్ 21 వ తేదీని ఉభయప[illegible] లకూ మధ్య ప్రారంభమైన దలాత్ సమావేశం భగ్నమయింది. కొచిన్ చీనాను ఎలాగైనా ఇండోచీనానుంచి విడగొట్టాలనీ, వియత్‌నమ్‌తో చేరనీయకూడదనీ రహస్యంగా ఫ్రెంచివారు పన్నాగాలు పన్నుతున్నట్టుచెప్పి, కొచిన్ చీనాను వెంటనే రిపబ్లిక్‌తో చేర్చినట్లయితే ఆ తరువాత పారిస్‌లో సమాలోచనలకి అంగీకరించగలరని వియత్‌నమ్ ప్రతినిధులు తెలిపారు.

హోచిమిన్ పారిస్ ప్రయాణం:

సమాధానం కుదరనందువల్ల తిరిగి ఫ్రాన్సులో ఫాంటెన్‌బ్లోవద్ద సమాలోచనలు జరపడానికి నిర్ణయమయింది. హోచిమిన్ తన ప్రతినిధివర్గంతోసహా జూలై 6 వ తేదీకి పారిస్ చేరుకున్నాడు. ఆగస్టు 14 వ తేదీని ఫ్రెంచి ప్రభుత్వం వియత్‌నమ్ రిపబ్లిక్‌తో సమాధానం చేసుకోడానికి కొన్ని హిరణ్యాక్షవరాలతో, అంగీకారయోగ్యం కాని షరతులతో ఒక నివేదిక ప్రకటించింది. ఆ నివేదికప్రకారం వియత్‌నమ్ స్వతంత్ర పరిపాలనను విడిచిపెట్టాలని కోరారు. కొచిన్ చీనా శాసనసభ రిపబ్లిక్‌లో చేరడానికి నిర్ణయించేపక్షంలోకూడా ఫ్రెంచివారు పరిపాలనాధికారం విడిచిపెట్టడానికి అంగీకరించలేదు. తమ ఆధ్వర్యంకింద ఎన్నికలు జరగా లన్నారు.

సెప్టెంబరు 14 వ తేదీని ఉభయులకీ సమ్మతం కాని ఏదోరీతిని ఒక ఒడంబడిక చేసుకున్నారు. ఏపక్షం ఏరీతిగా ప్రవర్తించాలి అనే విషయపై జరిగిన కొన్ని నిర్ణయాలకు ఉభయులూ అంగీకరించారు. ఇది అక్టోబరు 30 నుంచి అమలు జరగవలసినది. ఇందులో 11 నియమాలు సూచించబడినాయి. కాని ఫ్రెంచి సైన్యం వీనిననుసరించే సూచన ఎక్కడా కనిపించలేదు. తిరిగి ఖచ్చితంగా ఏదో సంధి చేసుకోవాలనే తలపుతో, 1947 జనవరిలో మరొక సమావేశం జరిపారు.

వియత్‌నమ్‌లో ప్రజలు పై 11 నియమాలను ప్రతిఘటించారు. ఫ్రెంచి సైన్యాలు మన్నించని నియమాలు వారికి అక్కరలేదన్నారు. ఫ్రెంచి సైన్యం యథారీతిని అవకాశం దొరికినపుడెల్ల వియత్‌మిన్ పక్షం వారిపై కాల్పులు సాగించి పగసాధించడం మానలేదు.

యుద్ధం ఆరంభం:

డిసెంబరు 19 వ తేదీని హనోయ్‌లో యుద్ధం ఆరంభమయింది. పదివేలమంది రిపబ్లికన్ సై[illegible]

(18-వ పేజీ చూడుడు)

కథానిక:

సైకిలు సవారీ

రచన: **శ్రీ సుదర్శన్**

అనువాదము: **శ్రీ ఆదిభట్ల వేంకటరమణ**

ఎవరు సైకిలు త్రొక్కినా "హార్మోనియం" వాయించినా నే నెంత సిగ్గుపడతానో దేవుడికే తెలుసు. భగవంతుని విచిత్రసృష్టిలో ఈ రెండు విద్యలు ప్రత్యేకస్థానం ఆక్రమించేయి ఒకసమయం కులాసాగా గడిచిపోతుంది. ఇంకొకసమయం తరిగిపోతుంది. కాని, ఈ చిత్రం చూడండి. మా ప్రారబ్ధమువలన కలియుగంలో ఈ రెండు విద్యలు మానుగుటను వ్రాసి లేవు. సైకులు త్రొక్కలేను, "హార్మోనియం" వాయించలేను.

బహుశః 1932 వ సంవత్సరం మాట. ఒకమారు కూర్చొని ఉండగా "సైకులు నేర్చుకొందామా" అన్న ఆలోచన కలిగింది. నాకు తెలియకుండా మా అబ్బాయి సైకులు త్రొక్కడం నేర్చుకొని, నా ఎదుటనుండే త్రొక్కుతూ నన్ను ఊరిస్తున్నాడు. అప్పుడేం చెప్పమన్నారు. సిగ్గు, అసహ్యము, అన్నీ ఒక్కమాటే కలుగుతాయి. ఈ విశాలప్రపంచములో నే నొక్కడనే వెనకకి ఉండిపోయేను గాబోలు. ప్రపంచమంతా ముందికి పోతున్నాది. చిన్న చిన్న పిల్లలు సైకులుమీద "రంయ్" మని పరిగెడుతున్నారు. పల్లెటూరివాళ్లు కూడా దానిమీద స్వారీసాగిస్తున్నారు. మేము దేవుడివలన బాగా చదువుకొన్నాం. కాని, సయికిలు స్వారి మాత్రం రాదు. ఇందులో అంత కష్టం మిటి ఉంది. బ్రహ్మవిద్యా ఏమిటి? సైకులు మీద కూర్చొని నడివీథిలో త్రొక్కుతే ఎంత బాగుంటుందో? రోడ్డుమీద నడుస్తూ ఉంటే ప్రతీవాడూ "టిక్-టిక్" మని ఘంట వాయిస్తూ "రంయ్" అని త్రొక్కుతాడు. వాడిని చూసి మనమే తప్పుకోవాలి. లేకపోతే మనప్రక్క క్రోధపూర్ణలోచనాలతో చూస్తూ సయికిలు త్రొక్కుతాడు. ఇదంతా ఇనపగుఱ్ఱం (సైకిలు) యొక్క రహస్యమే. బాగుంది—బాబూ! ఇంక సైకులు నేర్చుకొందికి సిదమయేను.

ఇంటిలో ఎవరికే తెలియకుండా సైకిలు నేర్చుకోవాలి. ఇంక మనం కూడా ఇనపగుఱ్ఱానికి అశ్వికులు (*Riders*) గా తయారుకావాలి. నా మనస్సులో ఆలోచనలు పరిగెత్తేయి. మేము సైకిలుస్వారిలో పండితులమైన వెంటనే జహంగీరు సమాధికి వెళ్లడానికి నిశ్చయం చేసుకొన్నాము. మా ఆడవాళ్లని తాంగాలో కూర్చోపెట్టి, మీరు వెళుతూ ఉండండి, మేము మరొక తాంగాలో వస్తాం అని చెప్పి, నేను సైకులుమీద జోరుగా వెళ్లి వాళ్లని త్రోవలో కలుస్తాను. అప్పుడు మా ఆడవాళ్లు మమ్మల్ని చూసి మురిసిపోరూ? తప్పకుండా విస్మయులౌతారు. "డంగ్" అయిపోతారు. కళ్లు మిటకరించి చూస్తారు. కాని నేను పెడముఖంతో తాంగాతో సమానంగా సయికులు త్రొక్కుతాను. అప్పుడు వా ళ్లేమిటనుకొంటారు. ఇతను సయికులు సవారీ ఎప్పుడు నేర్చుకొన్నాడా? అనుకొంటారు. ఏమంత కష్టమైన మాట? మాకు ఒక చిన్న విషయమే.

మంచిది. దెబ్బ తగులుతే చికిత్సచేయడానికి రెండు "జాంబక్" డబ్బాలు కొన్నాను. తరువాత మంచిమైదానం వెతికి మరునాటినుండీ నేర్చుకొందికి సిద్ధమయేను.

2

అయితే సైకులు చేర్చుకోవడ మెలాగ? ఒక మాష్టరుని నియమించాలి. మొదట మాష్టరు లేకుండా నేర్చుకోవాలనిపించింది. మా పిల్లవాడు సైకులు నేర్చుకొందికి ఎవరి శిష్యత్వము చేసేడు? నా అంతట నేనే నేర్చుకొన్నానని ఒక మాటు చెప్పినట్లు జ్ఞాపకం. ఒక మాటు పడతాము. రెండు మాట్లు పడతాము. తప్పితే మూడుమాట్లు పడతాము. అస్తమానమూ పడము కదా? తిరిగి ఆలోచించేము. వాడు పిల్లవాడు కాబట్టి పడినా బాగుంది. నేను చిన్నవాడిని కాదు. పడితే బాగుంటుందా? మనుష్యుడేదైనా నేర్చుకొంటే జాగ్రతగా నేర్చుకోవాలి. లేకపోతే నష్టం తప్పదు. అందుకొక మాష్టరుని నియమించడానికి నిశ్చయించుకొన్నాను. ఈ ఆలోచనలో ఉండగా తివారీ లక్ష్మీనారాయణగారు వచ్చేరు. ఇలాగ అన్నారు:" "మిత్రమా! ఏమీ తోచలేదు. ఒకమాటు చదరంగం తెమ్మని మీవాడికి కేకపెట్టు."

నేను—(తలఊపి) ఒద్దయ్యా, నాకేమీ తోచలేదు.

తివారీ: (తనబట్టతలమీద టోపీ తీసి, తల రాసుకొంటూ) నే నెంతో దూరంనుండి చదరంగ మాడడానికి వచ్చేను. ఇష్టం లేదంటావేమి?

నేను: ఇష్టం లేకపోతే ఏమి చేయమంటారు? నే నీవిధంగా అనీసరికి తివారీజీ మనస్సు ఎందుకో బాధపడింది. నాదగ్గరగా వచ్చి, ఇలాగన్నారు:

తివా: తమ్ముడూ! అంత ఉదాసీనంగా ఉన్నావేమి?

నేను: తివారీభయ్యా! ఏమి చెప్పేది? సైకులు నేర్చుకోవాలని మనసులో ఉద్దేశం కలిగింది. కాని, మాకు సహాయముచేసే వ్యక్తి ఎవరూ కనిపించలేదు. మీ దృష్టిలో ఎవడేనా ఉంటే చెప్పరూ?

తివా ఉన్నాడుగాని, ఉచితంగా నేర్పడు. చార్జీ తీసుకొంటాడు, ఇవ్వగలవా?

నేను: ఎన్ని రోజులలో నేర్పగలడు?

తివా: పది లేక పదిరెండురోజులలో.......

నేను: చార్జీ ఎంత తీసుకొంటాడు?

తివా: పయివాళ్లైతే పాతిక. మన మాటమీద గౌరవం ఉంది కాబట్టి 20 రూపాయిల కొప్పుకొంటాడని నా నమ్మకం.

నేను: (మనస్సులో) పది రోజులలో నేర్పుతాడా? 20 రూపాయిలు తీసికొంటాడా? పది రోజులు...ఇరవై రూపాయిలు. 20 రూపాయిలు......పది రోజులు. అంటే, రోజుకి రెండు రూపాయిలా? అదేనా ఒకగంటో, రెండుగంటలో.. ఈలాంటి రెండు మూడు "ట్యూషన్స్" వచ్చేయంటే 350 రూపాయిలు నెలకి సంపాదన. తరువాత తివారీజీతో మాష్టరుగారిని తీసుకొనిరమ్మని చెప్పేను. నాకెంతో సంతోషంగా ఉంది. ఎందుకంటే, సైకులు త్రొక్కడం వస్తే ఒక "ట్రైనింగ్ స్కూలు" పెడతాను; మూడువందలో నాలుగు వందలో నెలకి సంపాదిస్తాను. కొంచెంసేపటిలో తివారీజీ బయటనుండి పిలచేడు. నేను వెళ్లి చూసేను. మాష్టరుగారు నిలబడి ఉన్నారు. నల్లటిరూపు, మోటశరీరము, మెడలో నల్లని "నెక్ టై" మాసిన లుంగీ. కాళ్లకి కాశ్మీర్ "చెప్పులు. ఈ రూపు చూసి ఈ మాష్టరుగారు నాకు వద్దని చెప్పేదా మనుకొన్నాను. కాని, మళ్లా ఆలోచించేను. మనం సైకులు నేర్చుకొందికి ఈతని రూప మెందుకు అనుకొని, ఒక మంచి విద్యార్థివలె చేతులు కట్టుకొని నమస్కరించేను.

తివారీ: ఈయన 20 రూపాయల కొప్పుకొనలేదు. కాని ఏలాగో ఒప్పించేను. ఈయన '*advance* తీసుకొంటా'రట. వెనక నేర్పిస్తారు అని అంటున్నారు.

నేను· ఓయ్ తమ్ముడూ, మే మిచ్చేస్తాము. ప్రపంచమంతా చెడ్డదే కాని, సాధుజనులు మంచివారు. ప్రపంచాన్ని ఖాళీచేసేలేదు. 20 రూపాయలకి పారిపోతామా? ఒకమారు నాకు సైకులు నేర్పండి, తరువాత నే నిచ్చేది చూడండి.

మాష్టరు: ఏమైనా మొదటే కొంత డబ్బు తీసుకొంటామండీ.

నేను: "ఫీజు" తీసికొని నేర్పకపోతే?—

మాష్ట: నేర్పకపోతే "ఫీజు" తిరిగి ఇచ్చేస్తాము.

నేను: ఇవ్వకపోతే?—

మా: ఈ "లేకపోతే" అన్నమాటకి నాదగ్గర జబాబు లేదు. కాని, నమ్మకం లేకపోతే కష్టం.

తివా: "ఫీజు" తీసికొని పారిపోతే ఈ తివారీ ఏమయ్యేడు. పట్టణంలో తిరగడమే కష్టము. "ఫీజు" తీసికొని పారిపోవడమన్నమాట వింటే ఎవరేనా నవ్విపోతారు.

. తివారీజీ మాటలమీద మాకు నమ్మకం కలిగింది. మాష్టరుగారు దగా చేయరు అని డబ్బు తెచ్చి మాష్టరుగారికిచ్చి "మాష్టరుగారూ, రేపు ఉదయమే దయచేయండి. నేను సిద్ధంగా ఉంటాను. నేనీపనికోసం బట్టలుకూడా కుట్టించుకొన్నాను. ఒకవేళ పడిపోతే "జాంబక్" డబ్బాలు కూడా సిద్ధం చేసుకొన్నాను. మా యింటి ప్రక్కనున్న మిస్త్రీసాహెబుగారిదగ్గర సైకులు తీసికొంటాను. రేపుదయమే దేవుడి పేరు చెప్పి ఆరంభము చేదాము.

తివారీజీ, మాష్టరుగారు వెళ్లిపోయేరు, ఇంతలో ఒకమాట చెప్పడం మరచిపోయేను. జోళ్లు లేకుండా పరిగెత్తుకొని వెళ్లి వాళ్లని నడి బజారులో కలుసకొన్నాను. వారు ఆశ్చర్యపోయేరు ఆయాసంతో ఇలాగ అన్నాను. "మాష్టరుగారూ. మేము...ఊళ్లో నేర్చుకోము... లారెన్సుబాగ్ లో నేర్చుకొంటాము. అక్కడ చోటు...విశాలంగా ఉంది—పెద్ద దెబ్బలు తగలవు. ఇంకెవరూ అక్కడ చూడరు.

3

ఆరోజు రాత్రి నిద్ర ఎక్కడ? అస్తమానం పలవరిస్తున్నాను. ఇంకా సూర్యుడుదయించలేదేమా అని ఆలోచించాను. నిద్దర కొంచెం వస్తే సయికిలు త్రొక్కినట్లు కలలు వస్తున్నాయి. ఒకమారు నేను సైకులునుండి పడిపోయినట్లు, ఆసుపత్రిలో దొరలు శస్త్రచికిత్స (*Aperation*) చేస్తున్నట్లు కలలో చూసేను. రెండోమారు భూమిపైన నిలిచి ఉండినట్లు, సైకు లాకాశం మీద తిరుగుతున్నట్లు కల వచ్చింది. ఒకమారు మాష్టరుగారు తన చేతులోకి న స్నొత్తి మీదకు విసరివేసేరు. మరుక్షణంలో నేను సైకులుమీద స్వారీచేస్తున్నాము. సైకులు తనంతట తానే గాలిలో ఎగురుతున్నాది. జనులంతా నా ప్రక్క కండ్లు మిటకరించి చూస్తున్నారు. ఒక దేవత నా భుజముపై చేయివేసింది. నేను భూమిమీద దభీమని పడినట్లైంది. అప్పుడు తెలివివచ్చింది లేచి చూస్తే ఇదంతా కల. నేను మంచముమీదే ఉన్నాను.

లేచి చూసేను. సూర్యుడుదయించేడు. వేగం లేచి, బంట్రోతుని పంపి, మిస్త్రీసాహెబు గారింట సైకులు తెప్పించాను. ఆ సమయంలోనే మాష్టరుగారు కూడా ప్రవేశించేరు. జాంబక్ డబ్బా. చేతులో పట్టుకొన్నాను. దేవుడిపేరు చెప్పి "లారెన్సుబాగ్" ప్రక్క బయలుదేరేము. అప్పుడే గుమ్మం దిగేమోలేదో పిల్లి త్రోవకడ్డంగా ప్రవేశించింది. ఒక కుఱ్ఱవాడు తుమ్మేడు. ఏమి చెప్పం—ఆ సమయంలో ఎలాటి కోపం వచ్చిందంటే చెప్పతరంకాదు. కాని, పళ్లు పటపట కొరికి ఆగిపోయేము. మరొకమారు భగవంతుని పావననామము స్మరించి, ముందుకి నడచేము. తరువాత బజారులోకి వెళ్లగా కొందరు నా ప్రక్క చూసి నవ్వుకొంటున్నారు. నే నాశ్చర్యపోయేను. అసలు సంగతేమిటి? సైకులు తొందరలో ఘాబరాపడి, పైజమాను లాల్చీని తిరగవేసి తొడుక్కొన్నాను. అందుకే జనమంతా నవ్వుతున్నారు. తల వంచుకొని ఊరకొన్నాను.

మాష్టరుగారిని క్షమాపణ కోరుకొని ఇంటికి తిరిగిపోయేను. అంటే ఆరోజంతా వ్యర్థంగా గడచిపోయింది.

రెండోరోజు ఉదయ మయింది. మా యింటి ప్రక్కనున్న లాలాసాహబుగారు ఎదురుగా వచ్చి, చిరునవ్వుతో "ఎక్కడికి బయలుదేరారు?" అని అడిగేరు. ఈ లాలా సాహబుగారు చాలా మంచివారే; కాని, ఎవరైనా వీథిలోనికి బయలుదేరితే "ఎక్కడికి వెళుతున్నా?"రని అడిగే దురలవాటది. వీథిలోని కెవరైనా బయలుదేరుతే వారి నెక్కడకి వెళుతున్నారని అడిగితే, ఒకవేళ వాడిపని పాడైపోతే "ఎక్కడికి వెళుతున్నా"వని అడిగేవారిని తిడతారు. కాని, లాలాసాహబు కీ తిట్లు వినిపించవు. ఈ సమయంలో తప్పించుకొంది కెంత ప్రయత్నము చేసినా, ఎక్కడికి అనే ఫిరంగిగుండు ఆగదు. లాలాసాహబు మహాశయుడే స్వయముగా ముందికి వచ్చి కాలుస్తాడు. నాకు ఒళ్లు మండిపోయింది. "నరకానికి పోతున్నా" నన్నాను.

లాలా: (మళ్లా) మీ రెక్కడికి వెళుతున్నారని అడుగుతున్నాను.

నేను: నరకానికి పోతున్నామని మనవి చేసుకొంటున్నాను. ఈవిధంగా తమరు అడగకపోతే మీ కేమైనా నష్టం కలుగుతుం దేమిటి?

లాలా: మీ రెక్కడికి వెళుతున్నారో ఆ భగవంతుడికే తెలియాలి.

నేను: నేను రోడ్లమీద వ్యర్థంగా తిరుగుతున్నామని తలుస్తున్నారా?

లాలా ఎన్నో పర్యాయములు తమకి మనవి చేసుకొన్నాను. నాకు మీ "ఎక్కడికి" అనే పదంవలన భయం కలుగుతున్నాది. ఈ "ఎక్కడికి" అనే రోగ మెలాటిదో కాని మనిషిని ఒదలకుండా ఉంది. సైకులు నేర్చుకొందికి వెళుతున్నాను. ఈ మాసిన బట్టలు చూడండి. ఇదుగో "జాంబక్" డబ్బా. ఇదుగో మాష్టరుగారు సైకులుపట్టుకొన్నారు. కాని, మీ "ఎక్కడికి" ఈరోజును కూడా వ్యర్థము చేసింది. చిన్న చిరునవ్వుతో ఇలాగ అన్నాను: ఎక్కడికి? మీ "ఎక్కడికి" మాకు రెండు రూపాయిలు కర్చుచేసింది.


ఇక్కడ ఇలాగ ఉండగా మేష్టరుగారు గంట వాయించి మమ్మల్ని పిలచేరు. ఇలాగ అన్నారు "నేనొక గ్లాసు "లస్సీ" త్రాగివస్తాను. తమరు కొంచెం సైకులు పట్టుకొండి.

లాలాసాహబు ఇదే సమయమనుకొని పరిగెత్తాడు. లేకపోతే ఇవాళనుండీ ఎవ్వరినీ "ఎక్కడికి వెళుతున్నా"రని అడగనని కాగితం రాయించుకొని ఉందును.


4

మాష్టరుగారు "లస్సీ" త్రాగుతున్నారు. అప్పుడు నేను చక్రముల ప్రక్క చూస్తూ పరీక్ష చేస్తున్నాను. దాని హేండిలు పట్టుకొని కొంచం నడిపించడ మారంభించేను. కాని, రెండడుగులు వెళ్లేమో లేదో సైకులు నామీద పడిపోతుం దేమో అనిపించింది. ఇదంతా మా లాలాసాహబుగారి "ఎక్కడికి" ప్రభావమే. లేకపోతే ప్రాణంలేని ఈ సైకులుకూడా మావంటి పురుషసింహములపై అధికారం చేయడమా? ఈ సమయంలో నే నేమిటి చేయాలి. అని ఒక పెద్ద సమస్య. ఈయుద్ధక్షేత్రంలో నిలిచి ధైర్యముగా కార్యము సాధించడమాలేక, మానుకోవడ

(18-వ పేజీ చూడుడు)



"దుర్గ" —శ్రీ తారాసింగ్ సిన్హా



"ఆటలు"

అఖిలభారత లలితకళా సం

సంచార చిత్రకళా

ఏప్రిల్ 26 వ తేది మొదలు కొని, మే 1 వరకు మద్రాసులో ప్రొగ్రెసివ్ పెయింటర్స్ అసోసియేషన్ తరఫున, అలిండియా ఫైన్ ఆర్ట్సు సొసయిటీ, ఢిల్లీవారి సంచార చిత్రకళా ప్రదర్శనం జరిగింది.

ప్రధాన న్యాయమూర్తి శ్రీ పి. వి. రాజమన్నారు ప్రదర్శనానికి ప్రారంభోత్సవం జరిపారు.

దాదాపు 150 చిత్రాలు ప్రదర్శింపబడ్డాయి.

దేశంలో చాలామంది ప్రసిద్ధ చిత్రకారుల రచనలు యీ ప్రదర్శనాన్ని అలంకరిస్తున్నాయి.

వివిధప్రాంతాలకు చెందిన ప్రముఖ చిత్రకారులందరి కృషికి యీ ప్రదర్శనం ప్రాతినిధ్యం వహించాలని సోసయిటీవారి లక్ష్యం అయినట్లు కనుపిస్తోనేవుంది.

అయినా నందలాల్ బోస్, టాగూర్, చౌకతాయి, చౌదరి, డే, ఛటర్జి మొదలయిన శిల్పాచార్యుల రచనలు ఒకళ్ళవికూడా లేకపోవటానికి కారణం తెలియదు.

యీ విధమైన అసమగ్రత కొంత వున్నప్పటికీ మొత్తంమీద ప్రదర్శనం చాలా ఆకర్షణీయముగావుంది. ప్రతిభావంతమైన బొమ్మలు చాలా వున్నాయి. సంచార చిత్రకళా ప్రదర్శనం కావటం దీనికి దీనికి యింకొక విశిష్టత. యివే బొమ్మలు దేశంలోని ముఖ్య నగరాలలో చాలా వాటిలో వరుసగా ప్రదర్శించ బడటానికి ఏర్పాట్లు జరిగినాయి.

సంచారప్రదర్శనాలవల్ల కళకు అనన్యమైన ప్రచారం జరుగుతుంది. అనేకులకు పలు ప్రాంతాల చిత్రకారుల కృషిచూసే అవకాశం లభిస్తుంది. కాని యీ ప్రదర్శనం కొన్ని ముఖ్య నగరాల్లో మాత్రమే జరుపబడుటకు నిర్ణయించబడింది.

బెజవాడ, బందరు వంటి చిన్న పట్టణాలలోనూ వీలయితే, పల్లెటూళ్లలోనూ కూడా యీ ప్రదర్శనం జరుపటం సొసయిటీ వారి లక్ష్యం అయివుంటే చాలా బాగుండేది.

మన పల్లెటూళ్లలోకూడా కళా ప్రదర్శనలు జరిగేనాడుగాని "కళ కొద్దిమంది భాగ్యవంతుల సొమ్ము" అనే అపవాదు వదలదు.

నన్ను విశేషంగా ఆకర్షించిన కొన్ని బొమ్మలు:

శ్రీ తారాదాస్ సిన్హా యొక్క "దుర్గ" చాలా వుత్తమమైన రచన.

మహిషాసురుణ్ణి త్రిశూలంతో సంహరించి ప్రళయభయంకరంగా నగ్నన్రుత్యం చేస్తూవుంది దుర్గాదేవి. యీ యితివృత్తానికి అనుగుణముగా రచనా, వర్ణసమ్మేళనా జరిగింది యీ చిత్రంలో. చాలా గంభీరమైనభావాన్ని ...త్రతతో వ్యక్తం చేయగలిగాడు శ్రీ సి...

గృహపరిశ్రమలను లక్ష్మీదేవి ప్రీతి ప్ర...కంగా ఆశీర్వదిస్తోన్న భావాన్ని ఉత్తమ ...తీయకళాసంప్రదాయానికి చెందిన ఒక చక ...విధానంలో చిత్రించారు, శ్రీ సునీల్ ...పాల్, "లక్ష్మి" అనే చిత్రంలో.

శ్రీమతి ఆనందకర్ రచించిన గాంధి నిర్యాణచిత్రం చూస్తే, చైనా, జపాన్ శి... లోని బుద్ధనిర్యాణప్రతిమలుజ్ఞాపకానికి వస్తా... భావాన్ని అమాయకంగానూ సూటిగా వ్యక్తం చేయగలిగిన ఒక ప్రత్యేక శైలి ... చెయ్యబడ్డాయి యీవిడరచనలు.


శ్రీ పి. యల్. నరసింహామూర్తి ప్రా...



"పెండ్లి కూతురు" —శ్రీ సుధీర్ ఖస్తగిరి



"చెడుగుడు"



—శ్రీమతి యస్. యస్. ఆనందకర్


ఘంవారి

ప్రదర్శనం

"నృత్యం" చక్కని రేఖాలాలిత్యాన్ని, అలంకరణ సౌందర్యాన్నీ వ్యక్తం చేస్తూన్నది.

శ్రీ కె. శ్రీనివాసులు "చెడుగుడు" అనే చిత్రం ప్రేక్షకులను బాగా ఆకర్షించింది. చుట్టూ పూరిగుడిసెలు, మధ్యప్రదేశంలో విశాలమైన చెట్లనీడలు, ఆ నీడలలో అతిఆసక్తితో చెడుగుడు ఆడుకునే పిల్లలు. యివి బొమ్మలోని విషయం. పల్లెపట్లు అనగానే మనం వూహించు శుభ్రనే, ప్రశాంతి, సంతుష్టి, ప్రకృతి సౌందర్యం అన్నీ తొణికిసలాడుతున్నాయి యీ చిత్రంలో.

యింకా, బరదావుకౌర్, రనదావుకీల్, మసోజీ, సుధీర్ ఖిస్తగిరి, గోపాల్ ఘోష్, సతీశ్‌దాస్ గుప్తా, షీలా ఆడెక్ మొదలయిన ప్రసిద్ధుల బొమ్మలు చాలా వున్నాయి.



"నిర్వాణ"
—శ్రీమతి యస్. యస్. ఆనందకర్

జెమినిరాయ్‌వి రెండు బొమ్మలు వున్నాయి. బెంగాల్‌లోని పురాతన జానపద చిత్ర రచనా విధానాన్ని పోలిన ఒక పద్ధతిలో చిత్రించటం జెమినిరాయ్ ప్రత్యేకత, యీయన ఆవిధానంలో అనన్యమైన కృషి చేసి ఖండాంతరాల్లోకూడా పేరు తెచ్చుకున్నాడు.

యిందులో ప్రదర్శించిన అతని బొమ్మలు యీ ప్రత్యేకవిధానంలోవి కావు, అతని ఉత్కృష్టరచనలూ కావు.

యిదే విధంగా రమేంద్రనాథ్ చక్రవర్తివి రెండు చిత్రాలు వున్నాయి. యివి రమేంద్ర చక్రవర్తికళను మెచ్చుకునేవారికి చాలా ఆశాభంగం కలిగిస్తాయి.


వీరవి యింకా మంచి బొమ్మలు సేకరించవలసింది.

యింకో, పాతిక, ముప్పైచిత్రాలు పిల్లలు వేసినవి కూడా ప్రదర్శించబడ్డాయి. సొసయిటీవారు అక్కడక్కడ యింకా చిత్రాలు సేకరిస్తూ యీ ప్రదర్శనం యింకా వీలయినంత సమగ్రంగానూ యీనాటి భారతకళాకారులందరి కృషికి ప్రాతినిధ్యం వహించగలిగేవిగానూ చేయటానికి వలసిన ప్రయత్నం చేస్తూనే వున్నారు.


వీరి ప్రయత్నాలకు భారత ప్రభుత్వం యొక్క చేయూతకూడా వున్నదనే విషయం సంతోషించతగినది.

సొసయిటీవారు దేశంలో కళాప్రచారానికి, వికాసానికి దోహదం యిచ్చేవి, యిటువంటి కార్యక్రమాలు యింకా ఎన్నో పూనుకుని జయప్రదంగా నిర్వహించగలరని ఆశించవచ్చు.


ఖండవల్లి సుబ్బారావు.



"గ్రీష్మము"
శ్రీ రమేంద్రనాథ్ చక్రవర్తి



—శ్రీ కె. శ్రీనివాసులు



"లేడి"
—శ్రీ జెమినిరాయ్



తిమ్మరసు తెలివి

శ్రీ నేమాని సంగమేశ్వరరావు

శ్రీ కృష్ణదేవరాయలుకి తిమ్మరసు మంత్రి మీద చాల గౌరవము యుండేది. అందుచేత రాయలు తిమ్మరసుని "అప్పాజీ" అని సంబోధిస్తూ యుండేవాడు. తిమ్మరసు గొప్ప మేధావి. అందుచేత తిమ్మరసు లేకపోతే రాజుకి ఒక గడియకూడ తోచేది కాదు!

ఒకనాడు, ఒక రత్న వర్తకుడు రాయలుఆస్థానమునకు వచ్చేడు తన వద్ద యుండే రకరకాల రత్నాలు చూపించేడు. రాయలు వాటిని చూచి, వాటిలో మంచివి, కొన్ని లక్షలు విలువ గలవి కొన్నాడు. వాటిని తిమ్మరసుచేతికి యిచ్చి అంతఃపురానికి పంపించమని చెప్పి రాయలు నాటికి సభ చాలించేడు. అప్పటికే కొంచము ఆలస్యమగుటచే తిమ్మరసు ఆ రత్నహారమును మరునాడు అంతఃపురానికి పంపించడానికి నిశ్చయించుకొని, వాటిని తనతోనే తన యింటికి తీసుకొని వెళ్లేడు.

తిమ్మరసు తన గదిలో ప్రవేశించి అచ్చట ఒక మట్టి హంస మెడలో ఆ రత్నాల హారమును వేసి తను మరియొక గదిలోనికి పనిమీద వెళ్లేడు. అతను తిరిగి యీ గదిలోకి వచ్చేడు. అతను చూచేసరికి ఆ మట్టిహంస ఆ రత్నహారమును మూడు వంతులు మింగింది! అతను ఆ వింత చూస్తుండగా మిగిలిన రత్నాలను కూడా మింగేసింది!! మట్టి హంస యేమిటి, రత్నాలు మింగడ మేమిటి? అతనికి చాల ఆశ్చర్యము కలిగింది. అతనికి జాతకరీత్యా ఆనాటి మొదలు "ఏలినాటి శని" ప్రారంభించింది! మొదటిలోనే ఇటువంటి వింత చూసేడు గదా, ఇక క్రమంగా ఏడేళ్ల నర్థములోను యీ ఏలినాటి శని యెటువంటి వితలు చూపుతుందో అని భయపడ్డాడు. వెంటనే తన రెండు గదులు తాళాలు వేసి వాటి మీద లక్కసీలు వేసి భార్యకు యిచ్చేసి ఇలా చెప్పేడు: "నేను ఏడున్నర సంవత్సరములు కాశీ వెళ్లి పోతున్నాను. ఈ సంగతి రాజుగారికి తెలియనియ్యకు. ఎక్కడికి వెళ్లేనో తెలియదని చెప్పేసే. తాళాలు మాత్రం నీ దగ్గర జాగ్రత్తగా యుంచు" అని చెప్పేసి తను బయలుదేరి కాశీ వెళ్లిపోయేడు.

మర్నాడు రాయలు సభలో తిమ్మరసు రాకపోవడం చూచి యింటికి కబురు పంపించేడు. "ఎక్కడికి వెళ్లేడో తెలియ"దని జబాబు వచ్చింది.





చాల విచారించేడు. ఇంకొకడిని మంత్రిగా నియమించేడు.

రత్నాలు దర్బారులో రాయలు తిమ్మరసుచేతికి యివ్వడము, ఆ రోజు రాత్రే తిమ్మరసు పట్టణము వదిలి పారిపోవడము, రత్నాలు అంతఃపురము చేరకపోవడము చూడక తిమ్మరసు ఆ రత్నాలు తీసుకొని పారిపోయే డన్న వదంతి ఆ వూరిలో బయలుదేరింది. రాయలుమాత్రము నమ్మలేదు.

ఒక వారంలో తిమ్మరసుకి ఏలినాటి శని పూర్తి అవుతుంది. యీ యేడున్నర సంవత్సరాలు కాశీలో చెట్టు కింద కూర్చొని భగవద్ధ్యానములో యున్నాడు తిమ్మరసు. ఆ రోజు బయలుదేరి తిరిగి తన పట్టణము చేరుకోబోతున్నాడు. ఇపుడు తిమ్మరసు ఒక సాధువులాగ యున్నాడు.

ఇక్కడ రాయలకు వేటమీద సరదా పుట్టింది. వెంటనే కొత్త మంత్రిని పిలిచి వేటకు తగిన సన్నాహం చెయ్యమన్నాడు. ఏనుగులు, గుఱ్ఱాలు, వేటకుక్కలు, విలుకాండ్రు, కాల్బంము చాల మంది బయలుదేరేరు. మధ్యాహ్నము ఒంటి గంటవరకు వేట ఆడేరు. రాయలు అలిసిపోయేడు. వెంటనే తను వేట చాలించి తన డేరా చేరుకున్నాడు. స్నానము చేసి, భోజనము చేసి, చల్లగాలిలో చెట్టుక్రింద కూర్చున్నాడు. కూడా కొత్త మంత్రి కూడ యున్నాడు.

రాయలు తనలో ఏమేమో ఆలోచించుకుంటున్నాడు. అకస్మాత్తుగా రాయలు ఒక పెద్ద నవ్వు నవ్వేడు! మంత్రిని పిలిచి, తన నవ్వుకి కారణం అడిగేడు. పాపం! తిమ్మరసు కాదు... ఈ మంత్రికి అంత తెలివి లేదు... ఆలోచించేడు మంత్రి... ఫలితము కనుపించలేదు. బుర్ర గోక్కుంటున్నాడు. రాయలు కోపంతో యిలా అన్నాడు: "ఈ సాయంత్రములోగా నా నవ్వుకి కారణం చెప్పకపోతే నీ తల శరీరము నుండి వేరు చేయబడుతుంది!" మంత్రికి మతి పోయింది... తన కెందుకీ మంత్రిపదవి వచ్చింది... తన్నుతాను నిందించుకున్నాడు... ఆలోచిస్తున్నాడు...పాపం మంత్రి పిచ్చివాడిలాగు అడవి అంతా తిరుగుతున్నాడు. ఏడుస్తున్నాడు. సరిగ్గా అదే సమయానికి తిమ్మరసు కూడ అక్కడకు చేరేడు. మన కొత్త మంత్రి తిమ్మరసును పోల్చుకోలేక పోయేడు. ఎవరో బైరాగి అనుకున్నాడు. తిమ్మరసు అతని వైఖరి చూసేడు. పిలిచేడు. సంగతి కనుక్కున్నాడు. మంత్రి ఏడుస్తు అంతా చెప్పేడు.

"రాజు అప్పుడు ఎటు చూస్తున్నాడు?" అని తిమ్మరుసు అడిగేడు.

"రాజు కూర్చుని వున్న జాగాకి కొంచెము దూరములోనే ఒక పెద్ద విశాలమైన మఱ్ఱి చెట్టు యుంది. దాని నీడలోనే రాజుగారి పరివార మంతా విశ్రమించింది. రాజుగారు ఏకాగ్రముగా అటే చూస్తున్నారు" అని చెప్పేడు మంత్రి.

"అంతేనా, యింకేమయినా వున్నాయా?"అని తిమ్మరసు అడిగేడు.

"అంతే మరేవీ లేవు... ఆ... వుండండి... రెండు తాటి చెట్లు మాత్రము ఉన్నాయి" అన్నాడు

మంత్రి విచారమయిన ముఖముతో.

"అయితే విను. మఱ్ఱి విత్తనం ఎంత చిన్నది... ఆ విత్తనములో మొలచిన మొక్క రాజుగారి పరివారాని కంతకీ నీడ యిచ్చింది. తాటి విత్తనము చాల పెద్దది. అయితే ఏం లాభం... దాని నీడ దానికే చాలదు... ఓయి వెఱ్ఱివాడా, యీ సంగతికి రాజుగారు నవ్వేరు... మరి దేనికీ కాదు" అని చెప్పేడు తిమ్మరసు.

కొత్తమంత్రి చాలసంతోషించి రాజుగారి దగ్గరకు పరుగెత్తి వెళ్లి యీ సంగతి చెప్పేడు. రాజు దివానుని పిలచేడు. దివాన్ రాగానే "యీ అడవిలోనే తిమ్మరసు యుంటాడు. వెతికించ" మన్నాడు. సేవకులు బైరాగివేషంలో యున్న తిమ్మరసును తీసుకొచ్చేరు. రాజు తిమ్మరసును గుర్తుపట్టేడు. తనతో పట్టణానికి రమ్మన్నాడు.

మొట్టమొదట తన యింటికి వస్తే తమ పట్టణములోనికి వస్తానన్నాడు తిమ్మరసు. రాజు, తిమ్మరసు యింటికి వెళ్లేడు. తిమ్మరసుకి "ఏలినాటి శని" కొన్ని నిముషాలు మాత్రమే యుంది. వెంటనే సీలు తీయించి, తాళాలు తీయించేడు. ఆ గదిలో మఱ్ఱే హంస రత్నాల హారము సగము కక్కింది. మిగతాది రాయలు, తిమ్మరసు చూస్తూ యుండగానే కక్కేసింది.

రాయలు యీ చిత్రము చూసేడు. ఏమిటని తిమ్మరుసును అడిగేడు. తిమ్మరుసు తన ఏలినాటిశని సంగతి చెప్పి "మహాప్రభూ, నేను యీ ఏడున్నర సంవత్సరాలు యుంటే యింకేమి వింతలు జరిగేవో... అందుచేత కాశీ వెళ్లిపోయేను. మీతో చెపితే మీరు అంగీకరించ వచ్చు... అంగీకరించక పోవచ్చు... అందువల్ల చెప్పకుండా వెళ్లేను. క్షమించండి" అంటూ తన క్షమాపణ కోరుకున్నాడు.

రాయలు అతని తెలివికి సంతోషించి, ఆరత్నాల హారము తిమ్మరసుకు బహుమతి యిచ్చేడు. తన పాత మంత్రిని తిమ్మరసుకోరికపై క్షమించాడు.

ఆడమాట


అనువాదం: చి. పొణుగుపాటి రామారావు

అనగా అనగా ఒక వూరు రాజు, మంత్రిని పిలిచి "ఆడవాళ్ల మాట గొప్పదా, మగవాళ్ల మాట విలవయినదా?" అని అడిగేడు. మంత్రి ఆడవాళ్ల మాటే గొప్ప దన్నాడు. రాజు 'ఛప్' కాదన్నాడు. ఏమన్నా సరే, ఆడవాళ్ల మాటే విల వన్నాడు మళ్లా మంత్రి. పరీక్ష చేసి ఋజువు చేయమన్నాడు రాజు. ఆ మర్నాడు రాజు సభ ఏర్పాటు చేసి అందరినీ (ప్రజలను) పిలిపించి వరసగా నిలబెట్టి "ఆడవాళ్ల వాక్కు విలవన్న వాళ్లు మంత్రి ప్రక్కకు వెళ్లండి. కాదన్నవాళ్లు నా ప్రక్కకు రండి" అన్నాడు. అంతా ఆడవాళ్లమాటే గొప్పదని మంత్రి వేపు నిలబడ్డారు—ఒక్కడు తప్ప. రాజు చాలా మండిపడ్డాడు తన మాట ఓడిపోయిం దని. కాని ఒక్కడైనా తన మాట నిలబెట్టడానికి తన పక్షం వున్నందువల్ల ఆ ఒక్కడి మీద చాలా దయ కలిగి ముత్యాల హారం బహుమతి యిచ్చి మిగిలినవా రందరితో "మీరు ఆడవాళ్లకు లోబడ్డారు కాబట్టి మీరు గొప్పవారు కారు" అన్నాడు. తన పక్షం నిలబడ్డవాడిని నా పక్షం ఎందుకు నిలబడ్డా వని రాజు అడిగేడు. అప్పుడు వాడు "స్వామీ, 'అందరూ అవలంబించిన త్రోవను విడచి ఎదురుగా నిలబడు' మని నా భార్య చెప్పినది. అందు వల్ల నేను వాళ్ల అందరికీ ఎదురు నిలబడ్డాను కాని, అసలు ఏ సంగతీ నాకు తెలియ"దన్నాడు. అందరూ ఫక్కున నవ్వేరు. రాజు వాడి తెలివి తక్కువకు తన తెలివి తక్కువకు విచారించి మంత్రితెలివికి చాలా సంతోషించి బహుమతి యిచ్చేడు.

రాజన్ రాజు

చి" నిష్ఠల ఇందిరాదేవి

అనగా అనగా ఒక ఊరిలో ఒక రాజుండేవాడు. ఆ రాజుకి ద్దరు భార్యలు. పెద్ద భార్యకి సంతానము లేక పోవుటచే రెండవ భార్యని పెండ్లాడెను. పాపము రెండవ భార్య వల్ల కూడ సంతానము కలుగలేదు. అయినప్పటికీ రెండవ భార్య అంటే రాజు కెంతో ప్రేమ. కొన్నాళ్ళకి పెద్ద భార్య గర్భము దాల్చెను. ఈ సంగతి తెలిసి రాజు సంతోషించి చిన్న భార్య కంటె పెద్ద భార్యనే ఏక్కువగా ప్రేమించుచుండెను, ఇది చిన్న భార్యకి అసూయ కల్గించెను. పెద్దామెకి నవమాసాలు నిండి ప్రసవసమయము వచ్చెను. పెద్దామెను ఏలాగైనా చంపించుటకు తన దాసీని మంత్రసానిగా తయారు చేసి పంపెను. మంత్రసానిని దాసీ అని ఎవరూ గుర్తించలేదు. ప్రసవమైన వెంటనే మంత్రసాని ఆమెనెత్తిమీద మేకు దిగగొట్టెను. వెంటనే ఆమె రామ చిలుకగా మారి జామిచెట్టుమీద వ్రాలెను. పిల్లఏడ్పు విని సేవకులు లోనికి వచ్చి చూచు సరికి రాణీగారు లేరు. ఈ సంగతి రాజుకి తెలిసి రాజు చూసే సరికి పిల్ల డొక్కడే వుండుట చూచి చాలా ఆశ్చర్యపడెను. ఇదంతా కుట్రగా యున్నదని పిల్లడిని కాపాడుకొనుటకు కొంతమందిని కాపలా యుంచెను. రాజు వద్ద రాజన్ రాజను వంట బ్రాహ్మణుడు గలడు. ఒకనాడతడు అన్ని పనులు పూర్తి కాగానే పెరటి అరుగుమీద కూర్చొనెను. జామిచెట్టుమీదున్న రామ చిలుక రాజన్ రాజూ! రాజుగారి పెద్ద భార్య కొడు కేమి చేస్తున్నాడంది. రాజన్ రాజు ఆశ్చర్యముతో ఏడుస్తున్నాడన చెప్పగానె చెట్టు క్రింద ముత్యాలు రాలెను. మళ్ళీ రాజుగారి కొడు కేమి చేస్తున్నాడని చిలుక అడుగగా నవ్వుతున్నాడని చెప్పగా నవరత్నాలు కెంపులు రాలెను. వాటన్నిటినీ జాగ్రత్తగా దాచుకొనుచుండెను. ఈ విధంగా ప్రతి దినమూ అడగడం నవరత్నాలు, ముత్యాలు, కెంపులు రాలడం జరుగుతుండేది. ఈ సంగతి రాజుకి తెలియజేయుగా అతడు నమ్మక పోవుటచే బుట్టలో వున్న నవరత్నాలు ముత్యాలు కెంపులు చూపెను. ఎక్కడో దొంగిలించి-చిలక యిచ్చిం దని బొంకుచున్నాడని రాజు నమ్మలేదు. స్వయంగా చూడనిదే నమ్మనని జరిగిన దంతా చిన్న భార్యతో చెప్పి రాజన్ రాజు వతె అంనవస్త్రముతో పెరట్లో అరుగు మీద కూర్చొనెను. చిలక మామూలుగా అడిగిన ట్లడుగగా రాజన్ రాజు చెప్పినట్లు చెప్పగనే నవరత్నాలు, కెంపులు, వజ్రాలు రాలగానే రాజు ఆశ్చర్యముతో వానిని గైకొని రాజన్ రాజుతో చెప్పి, ఆ చిలుకని బంగారపు పంజరంలో వుండునట్లు చేసెను. రాజేస్వయంగా రోజూ దానికి మేత పెట్టుచుండెను. ఒకనాడు దానికి మేత పెట్టి దువ్వుచుండగా నెత్తిమీదున్న మేకు గట్టిగా తగులగా నెత్తిమీద మే కెందుకని మేకు గట్టిగా తీసివేయగనే చిలక పెద్ద భార్యగా మారుట చూచి రాజు ఆశ్చర్యంతో రాజన్ రాజుతోను మిగిలిన సేవకులతోను చెప్పెను. పెద్ద భార్యవల్ల జరిగిన సంగతంతా తెలుసుకొని చిన్నభార్య వద్దకు వచ్చేసరికి ఆమె సంగతంతా ముందే తెల్సికొని తలకి గుడ్డకట్టుకొని మూల్గుతూ పడుకొనెను. ఈ వేషాలింక పనికిరావని ఆమెను ముక్కలుముక్కలు చేయమని భటుల కాజ్ఞాపింపగా ఈ తప్పు క్షమించమని కోరెను. అయినను అతడు వినలేదు. జ్ఞానము వచ్చిన కుమారుడుకూడ తండ్రిని పిన్ని తప్పు క్షమించమని కోరెను. కుమారునికూడ ఎక్కడ చంపించుతుందేమో అనే భయం కొద్దీ ఆమెను ముక్కలు ముక్కలుగా నరికించి, భార్యతోను కుమారునితోన సుఖంగా రాజ్య మేలుచుండెను కథ కంచికీ! మన మింటికీ!



ఒక హెలికోప్టరు విమానం దీపం వెలిగించిన వెలుగుబాట

గేయాలు :

తాతతో సరసం

చి॥ నాదెళ్ల సూర్యం

(2 వ తరగతి)

తాతో మా యింటికి రా మాటున్నది
నీవు కూర్చుంటె కుర్చీపీటున్నాది
నుంచుంటె నిమ్మచెట్టునీడున్నాది
నీవు పండుకుంటే పట్టిమంచ మున్నది
నివు తింటేను సన్నబియ్యంకూ డున్నది
నీవు తాగితే పెద్దావుపా లున్నది
నీకు జత కావలిస్తే- చిన్నపాపను-
నే నున్నానూ!

ఏమి జరుగుచున్నదో తెలుసా?

చి॥ కొజ వెంకటరత్నమ్మ

(3 వ తరగతి)

చెట్టుమీద చవలపిల్లి చెప్పుచున్నాది
గట్టుమీద గంగిరెద్దు ఆడుతున్నాది
పొయ్యిమీద బూరిముక్క పొంగు
చున్నాది
పొయ్యెనకాల ముసలమ్మ దొర్లు
చున్నాది!

యర్రమిల్లి పాఠశాల పిల్లలుపంపిన బాలగేయా

వింతలు - విశేషాలు

నదులకు రంగులూ, రుచులూ

అన్నిచోట్ల మంచినీళ్ల నదులుంటే అక్కడక్కడ, నదిప్రవహించు ప్రాంత, రసాయనిక ధర్మమువలన కొన్ని నదుల నీటికి రుచులు రంగులు ఏర్పడును. నైలునది తెల్లనీళ్లనది. చైనాలో హోయాంగ్ హో ఇటలీలో టైబరునది పసుపునీళ్లనదులు. ఐరోపాలోని డాన్యూబ్ నది నీలవర్ణము కలదట. ఆల్జీరియాలో నల్లటి సిరానదున్నదట. ఆస్ట్రేలియాలో ఉప్పటి నీళ్లుగల నదొకటి కలదట. ఆర్జెంటీనాలోని పాలెడో కూడా ఉప్పునీళ్ల దేనట. మధ్యఅమెరికాలో ఒక నదినీళ్లు పుల్లగా నుంటవట!

పెరగటానికి గోరోజనం!

మెక్సికోలో ఆక్సిలోటెల్సు అను తోకకప్ప లున్నవి. వాటికి బాల్యావస్తనే ఉండుట ఇష్టము. అవి నీళ్లు తగ్గిపోయినపుడు లేక గోరోజనము తినిపించినపుడు మాత్రమే తోకనువదలి, పెద్దవగునట.

మంత్రసాని కప్ప!

మధ్యఐరోపాలో బిళ్లనాలుకగల కప్ప కలదు. అది గజముపొడవున గొలుసుగుడ్లను పెట్టి, మగకప్ప కాలిచుట్టూ, తొడచుట్టూ దీనిని చుట్టునట. మగకప్ప బరువు మొయ్యలేనప్పుడు, స్వేచ్ఛ కోలుపోయి, ఆ ఒడ్డుననున్న ఏ బొక్కలోనికో దూరునట. ఆ గుడ్లు పగులు సమయమునకు మరల నీటిలోకి దూకునట. అంత ఆ గుడ్లనుండి పిల్ల లొచ్చునట. అంతటితో మగకప్ప బరువు తీరునట.

పిపీలికాల స్పర్శేంద్రియాలు

ఈగలు దోమలు, ఎంత పెరిగినా మెత్తటి పురుగులుగ నున్నప్పుడే పైన పెంకుకట్టిన తదుపరి పెరుగ వీలులేదు. వీటి కండ్లునూ మన మాదిరి ఒక బింబ మేర్పరచు కండ్లు కావు. ఒక కన్నులో వెయ్యి కటకము లుంటవి. ఒక్కొక్క కటకము ఒక ప్రదేశమును మాత్రమే చూపగలదు. ఈ వెయ్యిబొమ్మలను కలిపి మెదడు గ్రహించునట. ఇవి ఊపిరితీసే విధానమూ వేరే. దేహము నిండా ఊపిరిరంధ్రములే. అవి కదలునపుడు గాలి పంపకము వీటిద్వార జరుగునట. అందువలననే క్రిమిహారణి జల్లునపుడు ఈ రంధ్రములు పూడిపోతవి. ఊపిరి సలుపలేక ఆ దెబ్బతో చచ్చిపోతవట.

తమాషాబల్లులు, తొండలు

ఎండ్లతరబడి, ఇతరభూభాగములనుండి వేరైన భూభాగములలో అతిపురాతన జంతువులు కనపడును, లంకలో చిన్న కొమ్ములున్న బల్లు లున్నవట, మెక్సికోదేశములోనూ కొమ్ముల బల్లు లున్నవట. పొడుగు కొన్ని అంగుళాలే అయినా, వళ్లంతా ముండ్లేనట. కోపమొస్తే కండ్లచివరనుండి, రక్తపు బిందువుల చిమ్మునట. ముక్కోపమున ఆరు అడుగులదూరమువరకూ రక్తము చిమ్మకలదట.

ఇగు ఆనా అను, అడుగుపొడగు తొండలు, గెలిపోస్ దీవులలో కలవు. ఈస్టు ఇండీస్ దీవులలో 2 అడుగుల బొడవుడ్రేగనులను విచిత్ర తొండ లున్నవట. న్యూజిలాండులో ఆటూరా అను ఒక తొండ ఉంది. దీనికి మూడవకన్నుంది. కాని కనుపించదు.

ఇలకోడి

ఇలకోడి అనేపురుగు చెమ్మస్థలాలలో ఉండి రాత్రంతా అరుస్తుంది. ఇది ఏదోరాతిక్రింద గుడ్లుపెట్టి, కోడివలె గుడ్లమీద కూర్చుని పొదుగునట.


బేసంఖ్య

ఏకాళ్ల జెర్రిని చూచినా బేసంఖ్యగల గణుపులే ఉంటవట. రకమునుబట్టి కాళ్లుంటవట. కొన్నిటిలో 30 ఉంటే, కొన్నిటిలో 242 వరకూ కాళ్లుండవచ్చుట. కొన్ని రాత్రులు మెరిస్తే, కొన్ని మెరువువట.

నల్లుల ఉపాయాలు

నల్లులు చాల తెలివిగలవట. మంచపుకోళ్లకు కిరసనాయిల్ పూస్తే, గోడమీదుగా కప్పెక్కి, మంచముమీదికి దూకుతవట.

"కలపర్ల"



తాళ్ళపాకవారి పదములు

శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

౨౬

అన్నమయ్యగారి రచన: (సంపు. ౨; ప. ౩౦౧)

శ్రీరాగం - జంపెతాళం

రాగలక్షణం

౨౨ వ ఖరహరప్రియమేళమున జన్యము. 'సరిమపనిసే - సనిపధనిపమరిగారిస' అని దీని సంచారం. ప్రాచీనులు ఈ రాగాన్నే మేళంగా గ్రహించిరి. తరువాతివారు ౭౨ మేళాల పట్టికలో ౨౨ వ దని సూచించుటకై 'ఖరహరప్రియ' అను పేరు కల్పించిరి. తరువాత త్యాగయ్యగారి పుణ్యాన అది స్వతంత్రరాగమే అయెను. ౭౨ మేళాలను కల్పించినవాడు తానే అని చెప్పుకొన్న వెంకటమఖి 'శ్రీరాగం' అను ప్రాతపేరులోని మొదటి రెండు రేఫాలే ౨౨ సంఖ్యకు సూచకములు కావచ్చునని గ్రహించి ఆ పేరె నిలిపినాడు. అతని తండ్రి గోవిందదీక్షితుల ఈ రాగాలాపమును వివరిస్తూ, షడ్జస్థాయిలో తారషడ్జం మొదలు తారనిషాదం వరకూ కల సంచారంలో గాంధారధైవతములను వదలవలె ననిన్నీ ఇట్లే పంచమస్థాయి, మధ్యషడ్జస్థాయి సంచారాలలో మధ్యమధైవతములను వదలవలె ననిన్నీ నియమించినాడు (సం. సుధ. ౧౯౪). రామామాత్యుడు 'గధవర్జితః...కదాచి ద్గధ సంయుతః' అన్నాడు (స్వ. మే. క. రాగప్ర. ౪౧). అంతేకాని గాంధారధైవతాల వక్రసంచారాన్ని స్పష్టంగా చెప్ప లేదు. సోమనాథుడుగూడా పై రెండుస్వరాలకూ ఈ రాగంలో వైకల్పికత్వాన్ని అంగీకరించి, (రా. వి., వివే. ౪; ౩౦) లక్ష్యవివరణంలో 'సరిమపని - సనిధపమగరిస' అనే ఔడవసంపూర్ణగతినే ఆశ్రయించినాడు. (వివే. ౫. ౧౧౦) 'మరిగరి - పధనిప' అనే వక్ర సంచారము సూచించనైనా లేదు. ఆ ప్రకారం పాడితే అది ఇప్పుడు వాడుకలో ఉండే 'మణిరంగు'రాగం కాగలదు. వెంకటమఖికాలానికే మణిరంగు ప్రచారంలోకి వచ్చింది. దాని కతడు లక్షణ లక్ష్యములు రచించినాడు (సం. సం. ప్ర. ౫౪౯). కనుక తండ్రి చెప్పిన లక్షణం చాలక కుమారుడు 'శ్రీరాగః పరిపూర్ణోఽపి గధయోః స్థానవర్జితః' అని లక్షించవలసి వచ్చెను (చతు - ప్ర; రాగప్ర; ౫౬). అంటే గాంధారనిషాదాలు రిగమ - మగరి, ధనిస - సనిధ - ఇట్లు క్రమంగా స్వస్థానంలో రావన్నమాట. అనుబంధంలోని రాగలక్షణం ఈ విషయాన్ని ఇంకా స్పష్టీకరించి 'ఆరోహే చాల్పధైవతః-అవరోహే గవక్రః' అన్నది. 'అల్పధైవతః' అనే మాటకు "పధనిప-ఈ ప్రయోగముమాత్రము యే గీతప్రబంధకీర్తనములలోగాని రాగాలాపము మొదలైనవిలోగాని యొకసారి రావలెనేగాక పలుమారు రాకూడదని పూర్వాచార్యుల మతము" అని సుబ్బరామదీక్షితులు వ్యాఖ్యానించెను. ఐనా "అవరోహణమున గనియున్న రిగరిస-పధనిప-ఇవి యీ రాగమునకు విశేషరంజనముల గలిగించెడి జీవస్వర ప్రయోగములు" అనికూడా ఆయన వ్రాసెను! విశేషరంజనము గలిగించు జీవస్వరము ఒకమారుకంటె ఎక్కువగా రాగూడ దనే నియమం వింతగొల్పునది. మఱి వెంకటమఖి రచించిన గీతంలో ధైవతప్రయోగమే లేదు! ఆయన తాళంలోనూ ఒకటే మారు అది మెరసి మాయమైపోయింది. (సం సం. ప్ర. ౫౪౬.) త్యాగయ్యగారి సుప్రసిద్ధరత్నమైన 'ఎందరో మహానుభావులు'లోనూ ధైవతం కానరాదు. కాబట్టి ఈ రాగంలో ధైవతం ఉన్నవనీ లేదనీ సంగీతవానమూకులలో వాదవివాదాలు చెలరేగినవి. తులజా మహారాజు కాలంలోగూడా ఇది కేవలం ధైవతరహితంగానే ఉండినదనీ, క్వచిత్తుగా 'ససనిధపధనిప' అనే ప్రయోగం కలదనీ తెలియవస్తుంది. (సం. సారా. పు. ౭౩) సంప్రదాయమూ, శాస్త్రమూ అట్లుండనిచ్చి చూస్తే, ఈ రాగానికి స్వరూపప్రదానం చేసినవి సరిమా - మపని, రిమపా - పనిసా అనే పరస్పరసంవాదంగల నడకలు. ఈ సంవాదాన్ని పూర్తిగా నిర్వహించవలెనంటే షడ్జపంచమాలవలె రి-మ-ని స్వరాలుగూడా శుద్ధంగా స్వస్థానాలలో నిలిచి నడవవలసి వచ్చినవి కనుక గ-ధ లు, సహజంగా పరస్పరసంవాదం లేనివి, కేవలం అనువాదులుగా మాత్రం పరిణమించినవి. నిషాదానికి పంచమంనుంచీ ప్రాకేసమయంలో ఊతగా ధైవతమూ, రిషభంనుంచీ షడ్జానికి దిగే సమయంలో పట్టుగొమ్మగా గాంధారమూ పనికివచ్చినవి. కాబట్టే ధైవతం ఉన్నా లేనట్టే, గాంధారం అతి కోమలంగా, ఈ రాగంలో స్ఫురిస్తున్నవి. పనీ అన్నప్పుడు పధని అని, సనీ అన్నప్పుడు సధనీ అనీ ప్రయోగించితే ఈ రాగంలోని నిషాదం రక్తిప్రదంగా ఉంటుంది. రి-మ-ని స్వరాలను మరీ, సమా, సనీ ఇట్లు వళిగమకంతో ప్రయోగించితిమేని శ్రీరాగ మంతర్ధానమై మధ్యమావతి ప్రత్యక్షమౌను. ఈ భేదంచేతనే శ్రీరాగం ధీరశాంతంగానూ, మధ్యమావతి ధీరోద్ధతంగానూ స్వరూపవైశిష్ట్యాన్ని సంపాదించుకొనును. ఇది గమనింపనివారి పాటలో కట్టకడపట 'పధనిప' అని స్పష్టంగా వినేవరకూ 'ఇది శ్రీరాగమా మధ్యమావతియా' అనే ప్రశ్న తెగదు.

ఘనరాగాలకు చేరింది. ప్రాయశః ఘనరాగతానం వాయించేవారుగానీ పాడేవారుగానీ ఈ రాగంతో ముగించేది వాడుక. రిరిగరిరీ, పపమమప మమప, నినిపప మమ రిగరిరిస—ఇత్యాదిగా జంటస్వరాలనడక దీనికి రక్తినీ స్వరస్థానాలకు శుద్ధినీ ఇస్తుంది. పరమప్రాచీనమైన గ్రామరాగాలలో ఇదొక్కటనీ, 'శ్రీరాగో రాగజోఽయం సర్వసంపత్ప్రదాయకః' అనీ తులజామహారాజుమతం.

[పల్లవి]

(౧) , పని పమరీ రిగరిసా । సా, గ రిసనీని సారిసరి
ఎంత కా లమొకదా ఈ దే హ ధా ర ణ ము

(౨) మ, ప పరి రిమపని పమరీ రి రీగరిస । నిసరిగ రిసనిప పా నిస రిగ రిగ రిసరీ
ఎం త కా ల మొకదా ఈ దే హ ధా ర ణ ము

(3) మ, ప ధని పమరిమ పని పమ రి రీగరి స । నిసరీగరి సారిస సనిప ,,
ఎం త కా ల మొ క దా ఈ దే హ ,,

(౪) మ, పని సే సేనిపమ రిమ పాధప మాపమ రీగరిస । ,, ,,
ఎం త కా ల మొ క దా ,, ,,

(౧) , రిమ రిమరి రిమ పపప । పానిమప పనిపమ రిగరిసా నిస
చిం తా ప రం ప ర ల చిక్కువడ వ ల సె

(౨) రిమ రిమ రిమరి రిమ పనిని । పనిసరి గరి సని పా సనిపమ రిగరిస నిస
చిం తా ప రం ప ర ల చి క్కు వ డ వ ల సె
రిమ (ఎంత కాలమొ)

[చరణం]

, రిరి రి రి సరి గా సరిస స ' స సగ రి స సరి సనిపా రిస రీ
వడి గొన్న మో హం బు వ ల ల ద గు లై క దా

, మప పమరిమ పని పమరీ గరిస । నిస పమరీమ పమపా ,
క ట లే ని గ ర్భ న ర క ము లం ద వ ల సె

, పప ప నిమ ప ని ని సరి గా రి ।, రి గా రి సా ని ని నిరి రీ
న డి మి సు ఖ ము ల చే త న ను వు నె య గ గ దా

, పప రీ సా ని ప మపనిస రీగరి ' సా , రి సనిపా మ పని పమ రిగరిస నిస ।
తొ డ రి పే య పు ది డ్డి మూ రా ప వ ల సె
రిమ (ఎంత కాలమొ)

ఇక్ల క్రిందిచరణములు :

(౨) పాపపుంజములచే - పట్టుపడగా గదా
ఆపదలతోడి దే - హము మోయవలసె;
చూపులకు లోనైన - సుఖము గానక కదా
దీపనభ్రాంతిచే - దిరుగాడవలసె (ఎంత)

(౩) హితుడైన తిరువేంక - టేశు గొలువక కదా
ప్రతిలేని నరక కూ - పమున బడవలసె;
అతని కరుణారసం - బబ్బకుండగ గదా
ౘతిమాలి నలుగడల - బారాడ వలసె. (ఎంత)

లఘుటీక : వడిగొన్న = వేగముగల; తగులై = తగులుకొని; గర్భనరకములు = నరకమువంటి గర్భవాసములు; నడిమి సుఖములు = నడుమంత్రముగా వచ్చి నశించే సుఖములు; ననుపు = సంబంధము; హేయపు దిడ్డి = నీచమైన అడ్డదారులలో; చూపులకు లోనైన = స్పష్టమైన; దీపన భ్రాంతి = ఉద్రేకింపజేయు అజ్ఞానము.

ముద్రితపాఠములు : నరిమిసుఖముల; దిపనభ్రాంతి చెందిరిగాడ.

కమ్యూనిస్టుపార్టీల తంత్రాలు

(9-వ పేజీ తరువాయి)

రల్ బోర్ ఉద్యమంలో కమ్యూనిస్టులు చేరారు. అప్పుడు సోవియట్ సైన్యాలు వార్సా నగరంవద్దకి వేగంతో వస్తున్నాయి.

జనరల్ బోర్ తిరుగుబాటు జయించిందంటే పోలండ్ అతని హస్తగతం అవుతుంది. ఇది కమ్యూనిస్టుల కిష్టంలేదు. అందువల్ల సోవియట్ రష్యా సైన్యాలు వడి తగ్గించాయి. జనరల్ బోర్ సైనిక విప్లవానికి సహాయపడిన కమ్యూనిస్టులు తిరుగుబాటుకి సై అన్నారు. రష్యన్ సైన్యాలు పోలండ్ వార్సాకు రాకుండా మధ్యలోనే నిలిచిపోయాయి. ఈ అవకాశం తీసుకుని జర్మన్లు జనరల్ బోర్ సైన్యాల్ని ధ్వంసం చేశారు. ఈ కాండ పూర్తిఅయ్యేవరకూ రష్యన్ సైన్యాలు కదిలిరాలేదు. పోలండ్‌లో జర్మన్ సైన్యంపై చర్య తీసుకోవాలని బ్రిటిష్ వారు తొందరపెట్టారు. బ్రిటిష్ విమానాలు పోలండ్ వరకూ వచ్చి బోర్ సైన్యానికి సహాయం చెయ్యాలని వారి తలపు. కాని బ్రిటిష్ విమానాలు ఇంతదూరం రాకుండా చెయ్యడానికిగాను బ్రిటిష్ విమానాల చర్యలు తీసుకోవలసిన ప్రాంతానికి పశ్చిమంగా దూరంలో గిరి నిర్ణయించాలని రష్యా రాయబారం చేసింది. చివరికి బ్రిటిష్‌విమానాలు బోర్ సైన్యానికెలాటి సహాయమూ చెయ్యలేకపోయాయి. బోర్ సైన్యం ధ్వంసంఅయిన తరువాత రష్యన్ సైన్యాలు వార్సాలో ప్రవేశించాయి.

కమ్యూనిస్టులు సమ్మెల నెలా పురిగొల్పాలో కార్మిక సంఘాల నే రీతిగా హస్తగతం చేసుకోవాలో, సమ్మెల సహాయంతోనూ, రహస్య విధ్వంస చర్యల ద్వారానూ అరాచకం తెచ్చి తద్ద్వారా విప్లవం ఎలా సాధించాలో, విప్లవ సైన్యాల నెలా రహస్యంగా నిర్మించాలో వివిధ దేశాలలో కమ్యూనిస్టు పార్టీల విధానాలు ఏ రీతిగా ఉండాలో అన్నీ కమ్యూనిస్టు నాయకులకు మాస్కోలోనూ, లెనిన్‌గ్రాడ్‌లోనూ శిక్షణ నిస్తారు. కమ్యూనిస్టుల చర్యల్లో హత్యలు, గోప్యలుకూడా అవసరమైనవే.

ఆర్థిక రంగం:

ఏ దేశాల్లో ముందు కమ్యూనిస్టు పార్టీల్ని స్థాపించి ప్రచారం చెయ్యాలో, కమ్యూనిస్టులు ఏయే పరిశ్రమలపై తమ దృష్టి కేంద్రీకరించాలో రష్యా జాగ్రత్తగా పరిశీలించి నిర్ణయిస్తుంది. భారతదేశంలో క్రమంగా నారపరిశ్రమ, బంగారు గనులు, బొగ్గు ఇనుము పరిశ్రమలు, వస్త్రపరిశ్రమల పైన ఆ వరుసనే కమ్యూనిస్టులు శ్రద్ధచూపుతున్నారు. ఇవిగాక మనదేశంలో భూమిశిస్తు విధానంవల్ల రైతులు రైతుకూలీలు నిత్య దారిద్ర్యంలో మునిగిఉంటున్నందువల్ల ఇదికూడా కమ్యూనిస్టులకు అవకాశమిచ్చింది.

అన్యదేశాల్తో వాణిజ్యాన్నికూడా రష్యా రాజకీయాల దృష్ట్యా నిర్ణయిస్తోంది. 1945 వ సంవత్సరంనుంచీ రష్యా ఏయే దేశాలకు గోధుమ పంపుతోందో గమనిస్తే ఇది బోధపడుతుంది. సంవత్సరంన్నరనుంచి భారతదేశానికి గోధుమ పంపి ప్రత్యామ్నాయంగా తేయాకు తీసుకుంటున్నారు. వాణిజ్యంతో ఆరంభించి కమ్యూనిస్టుచర్యలు తీవ్రంగా ఆరంభింపచేస్తారు.

ప్రతిదేశంలో వివిధపరిశ్రమల్లో కార్మికుల మధ్య ప్రచారంచెయ్యడంలో వారి నినాదం కార్మికుల ఆరోగ్యక్షేమాలు, ఆర్థికస్థితి.

కార్మికులకు హెచ్చు వేతనాలివ్వాలని ఆందోళన చేస్తారు. నియామక షరతులు మేలుగా ఉండాలంటారు. వారికి అన్ని సౌకర్యాలు కలుగచెయ్యాలంటారు. కాని వాస్తవంగా కమ్యూనిస్టుల విశ్వాసం వేరు. విప్లవం వస్తేగాని కార్మికుల స్థితిగతు లెప్పుడూ మేలుకాజాలవని వాదిస్తారు.

కార్మికుల స్థితిగతులు వృద్ధికాజాలని పక్షంలో పారిశ్రామిక యజమానుల్తో రాయబారా లెందుకు? విప్లవం లక్ష్యంగా లేనివారెవరూ కార్మికులకు నాయకత్వం వహించలేరని చెప్తారు.

దేశంలో వస్తువుల ధరలు అధికంగా ఉండి, ఇన్‌ఫ్లేషన్ ఉధృతంగా ఉందనుకోండి. అప్పుడు కమ్యూనిస్టులు దేశఆర్థికపరిస్థితికి చికిత్స చెయ్యాలనే తలపుగాని, కోర్కెదానికి మితి ఉండనే తలపుగాని లేకుండా కార్మికుల వేతనాలు హెచ్చించాలని తీవ్రంగా ఆందోళన చేస్తారు. ఇన్‌ఫ్లేషన్ హెచ్చిపోతున్నా సరే, వారికే పరిష్కారమార్గంతోనూ నిమిత్తం లేదు. కార్మికుల వేతనాలు హెచ్చించాలని మాత్రమే వాదిస్తారు. వారికోరికలు మన్నించి వేతనాలు హెచ్చిస్తున్న కొద్దీ హెచ్చించమంటారు. ఒకరికి దేశ ఆర్థిక వ్యవస్థ భగ్నమవుతుందని వారికి తెలుసును. కాని అదే వారికి వాస్తవంగా కావలసినది. వారికి కావలసినది వాస్తవంగా ఒకటైనా, పైకి మరొకటి చెప్పి, ఆశయసిద్ధికి అనువైనవానినే అడుగుతారు. ఈ విధానం భారతదేశంలోనూ, అమెరికాలోనూ ఫ్రాన్స్ ఇటలీలలోనూ ఈమధ్య మరింతగా గోచరిస్తోంది.

కార్మికసంస్థల్లో రహస్యంగా కొద్దిమంది చేరతారు. తమ చెప్పుచేతల్లో ఉండేవారిని కొద్దిమంది సంఘాల్లోనుంచి ఏరి వారిద్వారా తమపనులు నేరవేర్చుకుంటారు. మొత్తం సంఘంలో వారు అల్పసంఖ్యాకులే అయినా నిర్ణీత విధానాలు అవలంబించి యూనియన్ల నిర్వహణను హస్తగతం చేసుకుంటారు. తమ అనుచరుల్ని ప్రచారానికి వినియోగిస్తారు.

ఈపద్ధతివల్ల రెండు ప్రయోజనాలున్నాయి. 1. తమపక్షానికి బలగం చేర్చుకోవచ్చును. ప్రచారం చెయ్యడానికి మంచిసాధనాలుగా ఈసంఘాలు పనిచేస్తాయి. 2. కేవలం ఆ కార్మిక సంస్థలకు సంబంధించిన విషయాలలో గాక ఇతరవ్యవహారాలలో, అనగా ఇతర కార్మిక సంఘాలసమ్మెలు, పార్టీ రాజకీయాలు, రష్యాతో వ్యవహారాలు మొదలైనవానిలోగూడా ఆ కార్మికసంఘాల్ని తమ ప్రయోజనాలకు ఉపయోగించుకోవచ్చును.

సమ్మెలు, సానుభూతి సమ్మెలు:

మనదేశంలో సానుభూతి సమ్మెలు అందరికీ పరిచితమే. బస్సుకార్మికులు సమ్మె జరిపితే ట్రాంకార్ల డ్రైవర్లు సానుభూతి సమ్మె జరపాలంటారు. రెండు యూనియన్లూ కమ్యూనిస్టుల చేతుల్లోఉంటే అలాగే జరుగుతుంది. అలా కాని పక్షంలో ట్రాం డ్రైవర్లు సమ్మె జరుపకపోతే వారిని కార్మికసంఘవిరోధు లని నిందిస్తారు. రైల్వే సమ్మె జరిగితే సానుభూతిసూచకంగా దేశంలో కార్మికసంఘాలన్నీ సమ్మెలు చెయ్యాలంటారు. కలకత్తాలో ట్రాం డ్రైవర్లు సమ్మె చేసినప్పుడెల్లా బస్సు కార్మికుల్ని సానుభూతి సమ్మెకు పురికొల్పుతారు. ఇండొనీషియాలో డచ్చి దౌర్జన్యాలపట్ల నిరసన చూపడానికి కలకత్తాలో విద్యార్థులు సమ్మెచేశారు. వారుసమ్మె చెయ్యడంతో ఊరుకోలేదు. ప్రభుత్వాజ్ఞల్ని ధిక్కరించి ఊరేగింపులు జరిపారు. పోలీసులు తుపాకులు కాల్చారు. మిలిటరీ వచ్చింది. ఇండొనీషియాపట్ల సానుభూతి ఫలితంగా ఇద్దరు కలకత్తా విద్యార్థులు దుర్మరణంపాలయినారు. వీరిపట్ల సానుభూతి చూపడానికి దేశంలో చాల చోట్ల విద్యార్థులు సమ్మెలు జరిపారు. మొత్తానికివన్నీ ప్రభుత్వానికి విరుద్ధంగా ప్రచారానికి పనికొచ్చాయి. దేశంలో సమ్మెల టెక్నిక్ బాగా బోధపడింది. ఈనాడు కాంగ్రెస్ ప్రభుత్వాల్లో అవినీతినిగురించిన ప్రచారం కమ్యూనిస్టులకి మరింత వీలు యిచ్చింది. సమ్మెలు కార్మికుల ఆర్థికప్రయోజనంకోసం కాక రాజకీయపరికరంగా పనిచేస్తున్నాయి.

ఒక పెద్ద కార్మికుల వేతనాలు హెచ్చించాలని ఆందోళన చేస్తూ మరొక పెడ అవసర వస్తువుల ఉత్పత్తిని పడగొట్టడానికి సర్వవిధాలా ప్రయత్నిస్తారు. ఇందుకు సాధనాలు సమ్మెలు. సమ్మెలు లేకపోయినా కార్మికులు ఆట్టే పని చెయ్యకుండా జాప్యం చెయ్యాలని కూడా ప్రచారం చేస్తారు.

రైల్వేలు, బొగ్గుగనులలో సమ్మెలు తరుచు జరిగితేచాలు, దేశంలో అవసరవస్తువుల ఉత్పత్తి పడిపోతుంది. కాటకం వస్తుంది. ఇంకేం! అరాచకం వ్యాపించిపోతోంది. చివరికి, దేశమంతటా సర్వ కార్మిక సంఘాలు సమ్మె చేస్తాయి. విప్లవానికి అదే నాంది.

ఆర్థికరంగంలో కమ్యూనిస్టుల చర్యల్లో మూడు ఘట్టాలుంటాయి. 1. ముందుగా కార్మికరాజకీయ సంఘాల్లో రహస్యంగా చేరతారు. 2. కార్మికుల వేతనాలు హెచ్చింపచేసి, వస్తూత్పత్తి తగ్గింపచేసి ఆర్థికకల్లోలం, ఇన్‌ఫ్లేషన్ తెచ్చిపెడతారు. 3. వివిధసంస్థల్ని ముడిపెట్టి, రాజకీయరంగంలో కల్లోలం తెచ్చి, సర్వకార్మిక జనసమ్మె ప్రారంభించి విప్లవం తీసుకొస్తారు. విప్లవంతో పాలనాధికారాన్ని హస్తగతం చేసుకుంటారు. ఈ మూడు ఘట్టాల్లోనూ ఆర్థిక పరిస్థితులు చక్కబడకుండా కమ్యూనిస్టులు చాలా జాగ్రత్త వహిస్తారు. అన్యదేశాలతో (కమ్యూనిస్టుప్రభుత్వాలు గల దేశాలు కాక తదితర దేశాలతో) ఆ సమయంలో ఆర్థిక దుస్థితిని ఎదుర్కొంటున్న దేశం కలవకుండా చేస్తారు. ఒకవేళ కలిస్తే ఆ దేశం సామ్రాజ్యవాదులకి లొంగిపోతోందని కమ్యూనిస్టుపార్టీలు, రష్యా ప్రచారంచేస్తాయి.

వివిధదేశాల పార్టీలమధ్య సహకారం:

సైనిక, ఆర్థిక, రాజకీయ, సాంఘికపరిస్థితుల ననుసరించి వివిధదేశాలలోని పార్టీలు అతిసన్నిహితంగా సహకారం నెరపుకుంటాయి. వివిధదేశాల పార్టీలు ఒకే పంథా అనుసరించాలంటే ఒకేలక్ష్యం ఒకేవిధానం ఉండాలి. కమ్యూనిస్టు లందరూ ఎన్నికఠిననియమాలకైనా ఓర్చవలసిఉంటుందనీ, పార్టీఆశయం లేక "కాజ్" కోసం అందరూ అన్యదృష్టి లేకుండా సర్వం త్యాగం చేయవలసిఉంటుందనీ, లెనిన్ ఆదేశించాడు: ఒక విషయమై నిర్ణయం జరిగిందంటే ఆపైన కమ్యూనిస్టు లందరూ ఇంక వాదించకుండా ఆ నిర్ణయాన్ని అనుసరించి తీరాలి. ఇంతవరకూ కమ్యూనిస్టుల్లో అనేకసార్లు అభిప్రాయభేదాలు కలిగినా, పార్టీపట్ల వారి భక్తిశ్రద్ధలు ఎన్నడూ సన్నగిలలేదు.



రష్యాలో అమెరికన్ రాయబారి
అడ్మిరల్ అలన్ జి. కర్క్

వివిధదేశాల్లోని పార్టీలన్నీ ప్రతి చిన్న విషయంలో కూడా ఒకే విధానం అవలంబించాలంటే, ఆ పార్టీల మధ్య నిత్యం ఉత్తర ప్రత్యుత్తరాలు, చర్చలు, నిర్ణయాలు నడుస్తూ ఉండాలి. నిర్ణయాలు చేసేవారుండాలి. పార్టీల పంథా నిర్దేశించేవారుండాలి. ఎప్పటికప్పుడు కొత్త సభ్యులకు శిక్షణ ఇవ్వాలి.

కమ్యూనిస్టుపార్టీలకీ హంగు లన్నీ ఉన్నాయి. కమ్యూనిస్టు పార్టీల జాతీయ కార్యవర్గ సభ్యులకి తీవ్రమైన శిక్షణ ఇస్తారు.

కమ్యూనిస్టు తంత్రాల్ని వారికి నేర్పుతారు. కమ్యూనిస్టు వాదం వారికి అస్థికలుపట్టేలా బోధిస్తారు. ఇంజనీర్లు, వైద్యులు, వారివారి వృత్తి విద్యల్లో ఎంత తీవ్రశిక్షణ పొందుతారో అంత తీవ్రశిక్షణా కమ్యూనిస్టులు కమ్యూనిజంలో పొందుతారు. యుద్ధసమయంలో సైన్యాలు సైన్యాధిపతిఆజ్ఞలు పాలించి ప్రాణం త్యజించడానికైనా సిద్ధపడి యుద్ధం చేస్తాడో, అదే రీతిని కమ్యూనిస్టునాయకుల్ని తయారు చేస్తారు.

1943 వరకూ మాస్కో, లెనిన్‌గ్రాడ్‌లలో కమింటర్న్ ఆధ్వర్యంక్రింద నిర్వహించబడిన కమ్యూనిస్టు విశ్వవిద్యాలయాలు, తిరిగి 1947 లో తూర్పు యూరప్‌లో స్థాపించబడినాయి. అవి ఇప్పుడు కొమిన్‌ఫారమ్‌చేత నిర్వహించబడుతున్నాయి. వారమధ్య పత్రికలు ప్రచారం అవుతూంటాయి. అంతర్జాతీయ, ప్రాంతీయ సమావేశాలు జరుపుతూంటారు. ఈ సమావేశాలలో వివిధ దేశాల పార్టీలు ఏ రీతిగా సహకరించాలో నిర్ణయించుకుంటారు. ఒక దేశంలో పార్టీ నూతనవిధానం అవలంబించడానికి గాని, ఆ విధానాన్ని అంగీకరింపచెయ్యడానికిగాని కష్టం కలిగితే మరొక దేశంనుంచి ఒక నాయకుడు వచ్చి ఇక్కడవారికి సహాయపడతాడు. బర్మాలో కమ్యూనిస్టు వ్యవహారాలను ఆసియా బ్యూరో నిర్ణయాల ప్రకారం నిర్వహింపచెయ్యడానికి భారతదేశీయుడైన హరినారాయణ ఘోషాల్ అనే కమ్యూనిస్టు థాకిన్ బాటిన్ అనే పేరు పెట్టుకుని బర్మాలో కృషిచేస్తున్నాడు. పార్టీ పంథాను అనుసరించని కమ్యూనిస్టుల్ని తొలగిస్తారు.

కమింటర్న్ రద్దయినతరువాత 1943 నుంచి 1947 వరకూ ఏ పేరూ లేకుండానే రష్యాలోని కేంద్రం పాతవ్యక్తు లందర్నీ ఉంచి వారిద్వారా వ్యవహారాలు నడిపింది.

లక్ష్యాన్ని సాధించడానికి ఎటువంటి మార్గాలు అవలంబించినా తప్పు లేదని వారి నమ్మిక. అందువల్లనే అనుభవంలో అనేకమంది అన్యాయం, దౌర్జన్యం, దుస్తంత్రం, అవినీతి సహించలేక పార్టీని విడిచిపెట్టినవారున్నారు. లక్ష్యం ఒక్కటే పవిత్రమైతే చాలు ననే వాదం జనసామాన్యానికి అంగీకారయోగ్యం కాదు. ప్రజలకిది రుచించడంలేదు. ప్రపంచ కార్మిక విప్లవ తంత్రం అధికార సాధనాతంత్రంగా మారిపోయింది. లక్ష్యంకూడా సంకుచితమైపోవడంతో కమ్యూనిస్టుల నైతికపతనం పూర్తి అయింది. అందువల్లనే అన్ని దేశాలలోనూ ప్రజాసామాన్యానికి కమ్యూనిజంపట్ల విముఖత ఏర్పడుతోంది. [సమాప్తి.]

ఇండోచీనా జాతీయసమరం

(10-వ పేజీ తరువాయి)

కులు నగరాన్ని ముట్టడించగానే ఫ్రెంచి సైనికులు నగరం విడిచి పారిపోయారు. తరువాత ఫ్రెంచి సైన్యాలు అదనంగా నగరానికి పంపబడినాయి. ఉభయపక్షాల్లో దేనికీ విజయం లభించలేదు. కాని దేశమంతటా పలు ప్రదేశాల్లో యుద్ధం రగిలింది. 1947 - 48 సంవత్సరాల్లో ఫ్రెంచిసైన్యాలు అనాం, టాంకింగ్ రాష్ట్రాలలో చిన్నచిన్న భాగాలను ఆక్రమించుకున్నాయి. కాని ఫ్రెంచి సైన్యాలకు అపారంగా ప్రాణనష్టం సంభవించ నారంభించింది. వియత్‌మిన్ గొరిల్లాదళాల తాకిడికి కూడా ఫ్రెంచి సైన్యాలు నిలువలేకున్నాయి. మాసానికి నాలుగు మిలియనుల ఫ్రాంకులు ధారపోసి, వేలాది సైనికుల ప్రాణాలు బలిచ్చినా వియత్‌మిన్ గొరిల్లాలను ఫ్రెంచిసైన్యాలు జయించలేకపోయినాయి. ఆ తరువాత ఇంత కాలమైనా ఫ్రెంచిసైన్యం అంగుళం మేర ఆక్రమించలేకపోయింది. కాని గొరిల్లాలవాతబడి రోజూ వందలాది సైనికులు హతులౌతున్నారు.

మిత్రభేదం:

1946 మార్చిలో ఒక వైపున హేచిమిన్‌తో సంప్రదింపులు జరుపుతూ మరొకవైపున హాంకాంగ్‌లో నివాసమేర్పరుచుకున్న పూర్వ చక్రవర్తి బావోడాయ్‌తో, రహస్యంగా మంతనాలు ఆరంభించారు. ఇండోచీనాను విభజించి, వియత్‌నమ్ రిపబ్లిక్‌తో కొచిన్ చీనాకు విరోధం ద్వేషం పురికొల్పాలని ఫ్రెంచివారి యత్నం. ఫ్రాన్సులో ఫ్రెంచి సంరక్షణలో ఫ్రెంచి నాగరికతలో పెరిగిన బావోడాయ్‌ని ఆనాందేశీయుడనడం కంటె ఫ్రెంచిదేశీయుడనడం ఉచితం. తమ ఆక్రమణలో ఉన్న కొచిన్ చీనాను కట్టబెట్టగలమని చెప్పి, తాత్కాలికంగా హాంకాంగ్‌లో జనరల్ జువన్ నాయకత్వం క్రింద ఫ్రెంచివారొక ప్రభుత్వాన్ని సృష్టించారు. ఈ ప్రభుత్వంలో బావోడాయ్ ఉండడానికి అంగీకరించాడు. హేచిమిన్ ప్రభుత్వం హాంకాంగ్‌లో తలదాచుకున్న జనరల్ జువన్‌కు మరణదండన విధించింది.

అనేక మాసాలు ఫ్రెంచి సైన్యాలు యుద్ధం జరపవలసి వచ్చింది. చివరికి 1948 మార్చిలో కాలూనుకోడానికి కొచిన్ చీనాలో చోటు దొరికింది. జనరల్ జువన్ ప్రభుత్వం మే తేదీని స్థాపించబడింది. కొచిన్ చీనాలో "దక్షిణ వియత్‌నమ్ తాత్కాలిక కేంద్రప్రభుత్వం" అనే పేరు పెట్టారు. కొచ్చిన్ చీనాకు చెందినవారు 9 మందినీ, ఉత్తరోత్తరా అనాం టాంకింగ్ రాష్ట్రాలలో ఆక్రమించుకున్న ప్రాంతాలకు చెందినవారు 13 మందినీ చేర్చి మంత్రివర్గం నిర్మించారు. జూన్ 5 వ తేదీ జనరల్ జువన్ ఫ్రెంచి హైకమీషనర్ ఎమిరీబోలర్ట్‌తో ఒక ఒడంబడిక చేసుకున్నాడు. దక్షిణ వియత్‌నం "స్వతంత్రరాజ్యం"గా ఉండడానికి ఫ్రెంచి ప్రభుత్వం అగీకరించినట్లు, ఫ్రెంచి యూనియన్ లోనే ఉండిపోడానికి దక్షిణ వియత్‌నమ్ అంగీకరించినట్లు ఈ ఒడంబడికలో వ్రాయబడింది. బావోడాయ్ ఈ ప్రభుత్వంలోకి రాలేదు. అప్పటికే బావోడాయ్‌ని తిరిగి చక్రవర్తిని చెయ్యాలనే సంకల్పం ఫ్రెంచివారికి కలిగింది.

కాని కొచిన్ చీనాలో గొరిల్లా చర్యలు జనరల్ జువన్ పేరుతో దేశం పరిపాలిస్తున్న ఫ్రెంచి పాలకులకు ముప్పుతెస్తున్నాయి. రెండు సంవత్సరాల ఇండోచీనా స్వాతంత్ర్య సమరంలో 71,300 మంది ఫ్రెంచిసైనికులు మరణించారు.

అమెరికాతంత్రం:

బావోడాయ్ హాంకాంగ్‌లో ఉండగా అమెరికా విదేశాంగ కార్యాలయంనుంచి బుల్లిట్ అనే ఉద్యోగి అతనితో మంతనాలు జరిపాడు. బావోడాయ్ తిరిగి చక్రవర్తి కాగోరినట్లయితే అమెరికా సహాయపడగలదని చెప్పాడట. అమెరికా ఒత్తిడిపైనే తిరిగి ఫ్రెంచి అధికారులు బావోడాయ్‌తో సంప్రదింపులు జరిపినట్లు ఫ్రెంచి ప్రెస్ ఏజన్సీ వార్త ప్రచురించింది.

బావోడాయ్‌ని తిరిగి చక్రవర్తిగా చేస్తే కొచిన్ చీనాను హేచిమిన్ రిపబ్లిక్‌పై రెచ్చగొట్టవచ్చని ఇప్పుడు ఫ్రెంచివారి ఆశ.

బావోడాయ్:

బావోడాయ్ వయస్సు ఇప్పుడు 36 సంవత్సరాలు. చరిత్రప్రసిద్ధి కెక్కిన అనాంచక్రవర్తి గియాంలాంగ్ మనుమనికి మనుమడు. ఫ్రెంచి దేశంపట్ల భక్తి అనురాగాలుగల చక్రవర్తి. అనాంలో పరిపాలించిన గాని దేశం ఎప్పుడూ ఫ్రెంచివారికి లొంగిఉండదని ఫ్రెంచిపాలకులు గ్రహించారు. బావోడాయ్‌ని, అతని ఏడవ ఏటనే పారిస్ తీసుకుపోయారు. పదిసంవత్సరాలు ప్రత్యేక అధ్యాపకులచే ఇతనికి విద్యాబుద్ధులు, రాజకీయాలు బోధించారు. పారిస్ భోగవిలాసా లన్నిటికీ అలవాటు గరిపారు.

1935 లో అతని తండ్రి చనిపోగానే బావోడాయ్ స్వదేశం వచ్చాడు. ప్రధాననగరమైన హ్యూను ఆధునిక విధానాలలో సంస్కరించాడు. రాజాంతఃపురాన్ని పారిస్‌లోని ఒక ఆధునిక భవనంగా మార్చివేశాడు. మంత్రుల్ని మార్చివేశాడు. "భూతలస్వర్గం" అనే పేరుగల రాజభవనంలో అను కోరదగినవెల్ల సమకూర్చబడినయ్. దేశమంతటా పాఠశాలల్లో ఫ్రెంచి భాష నిర్బంధంగా బోధించాలని ఉత్తరువు చేశాడు. సైన్యవిద్యాభ్యాసానికి ఏర్పాట్లు చేశాడు. ఫ్రెంచి సలహాదార్లు అనేకమందిని నియమించాడు. తల్లి, మంత్రులు చెప్పిన కన్యను వివాహంచేసుకోకుండా నిరాకరించాడు. పారిస్‌లో ఉండగా తాను స్నేహం చేసిన మేరియాన్ అనే ఒక కాథలిక్ కన్యను స్వదేశం రప్పించి వివాహం చేసుకున్నాడు. పాశ్చాత్యరీతిని దుస్తులు ధరించే మేరియాన్ మహారాణి అయింది.

1940లో జపాన్‌వారు దేశాన్ని ఆక్రమించుకున్నప్పుడు ప్రజల యోగక్షేమాలగురించిన చింత అతనికి పిసమైనా లేకపోయింది. దేశాన్ని ఒప్పగించివేరుకున్నాడు. తన పేరనే ఫ్రెంచివారు, ఆ తరువాత జపాన్ సేనలు దేశాన్ని పరిపాలిస్తుండగా తన దౌర్బల్యస్థితిని అప్పుడు గ్రహించలేకపోయాడు. వియత్‌మిన్ జాతీయోద్యమం బావోడాయ్‌లో కూడా మొదట కొన్ని ఆశలు పురికొల్పింది. దేశానికి దాస్యంనుంచి ముక్తి నిచ్చి, సర్వ స్వతంత్రుడై పరిపాలించవలెననే వాంఛ అతనికి కలిగింది. కాని వియత్‌మిన్‌పక్షంలో కమ్యూనిస్టులున్నారనే భయం అతన్ని జాతీయోద్యమంలో చేరనివ్వలేదు. చివరికి సింహాసనం త్యజించి హాంకాంగ్‌లో తల దాచుకున్నాడు.

ఫ్రాన్స్ తిరిగి అతన్ని చక్రవర్తిని చెయ్యాలని ప్రయత్నించినప్పుడు మొదట కొంత సంకోచించినా చివర కిప్పుడు అంగీకరించాడు. 1948 జూన్‌లో టాంకింగ్‌లో ఒక ఫ్రెంచి యుద్ధనౌకనుంచి దిగాడు. అతనితో ఫ్రెంచి హైకమీషనరు బోలర్ట్, కొచిన్ చీనా ప్రభుత్వ ప్రధాని జనరల్ జువాన్ ఉన్నాడు. తిరిగి బావోడాయ్ చక్రవర్తి కావడానికి అంగీకరించాడు. ఫ్రెంచివారు అతన్ని చక్రవర్తిని చెయ్యడానికి అంగీకరించారు. కొచిన్ చీనాలో ఫ్రెంచి పరిపాలకుల ఆధిపత్యం క్రిందనే ఎన్నికలు జరిపారు. జనరల్ జువాన్ పక్షమే ప్రభుత్వానికి వచ్చింది. గతమాసంలో ఈ శాసనసభ బావోడాయ్ చక్రవర్తిత్వాన్ని అంగీకరించింది. బావోడాయ్ ఈ మాసంలో ఇండోచీనాలోని తన పూర్వ రాజభవనంలో చేరనున్నాడు. అతని సింహాసనారోహణకి ఫ్రెంచి పాలకులు పెద్ద ఆడంబరంతో సన్నాహాలు చేస్తున్నారు.

కానీ ఎన్నటికీ బావోడాయ్ చక్రవర్తిత్వాన్నిగాని ఫ్రెంచి సైన్య పరిపాలనను గాని ప్రజలు అంగీకరించజాలరనీ, తుదివరకూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడగలరనీ హేచిమిన్ ప్రకటించాడు. ఫ్రెంచివారు తమ సైన్యాల్ని బలపరుచుకుంటున్నారు. త్వరలో తిరిగి అక్కడ అంతర్యుద్ధం ప్రారంభం కావొచ్చును. తనకు చీనా కమ్యూనిస్టుల సహాయం లభించగలదని హేచిమిన్ ప్రకటించాడు కూడా.

సైకిలు సవారీ

(11వ పేజీ తరువాయి)

మా?అని ఆలోచించగా పోట్లాడడానికే నిశ్చయించుకొన్నాము. ఈ ఇనుపగుఱ్ఱం, మీదుమిక్కిలి లాలాసాహెబుగారి "ఎక్కడికి" ప్రభావం. ఈ రెండింటిదగ్గర నే నేమాత్రం? నేనే కాదు. పెద్దవీరయోధులు కూడా నిలపడలేరు. సయికులు నిలపెట్టి, నేను యుద్ధవీరుడిలాగ నిలపడ్డాను. వెంటనే సైకులు జోరుగా నా కాళ్లమీద తిరుగబడింది. "అయ్యోయ్, నాయనోయ్" అనుకొంటూ రామ - దుహాయి బజారులో గంతడ మారంభించేను. మాష్టరుగారు "లస్సీ" విడచి పరిగెత్తి వచ్చేరు. చుట్టుప్రక్కల ఉన్నవారుకూడా వెంటనే చుట్టూ మూగేరు. సైకులు ఒక ప్రక్క, నేనొక ప్రక్క పడి ఉన్నాము. సైకుల్ని ఒకరు నన్నొకరు ఎత్తి తీసేరు. మరికొందరు "దెబ్బలేమైనా తగిలేయా?" అన్నారు. "కొంచెం రెండడుగులు వెయ్యండి. రక్తం సర్దుకొంటుం"దని మరికొందరన్నారు.

నాకు సిగ్గు లేజూపోయింది. నా శరీరం బరువంతా ఒక పాదాలమీదనే ఆనిఉంచడమువలన కాళ్లు వణికిపోయేయి. మాష్టరుగారు సైకులు బాగా చూసి "ఇది విరిగిపోయింది. బాగు చేయించాలి" అన్నాడు.

ఇదియంతా లాలాసాహెబుగారి "ఎక్కడికి" ప్రభావమే అని మొదటే తెలుసుకొనినాను. సైకులు బాగుచేయించుటకు మిస్త్రీ సాహెబుగారి దుకాణమునకు పంపెంచేను.

కాని నా వీరహృదయాని కున్న ధైర్యము, సాహసము చూడండి. ఇప్పుడుకూడ యిట్టి క్షేత్రములో నిలబడియున్నాను. ఎనిమిది, తొమ్మిది రోజులలో సైకులు నేర్చుకొన్నాము. కాని అప్పటికి సైకులుమీద ఎక్కుట రాలేదు. ఎవడైన మీలాంటి ఉపకారబుద్ధిగలవారు నన్ను సైకులుపై కూర్చోబెట్టిన ఎంతదూరమైనా వెళ్లిపోతాను. నా ఆనందానికి అప్పుడు అంతు కనబడుటలేదు. ఈ విద్యలో నేను రెండు, మూడు రోజులలో పండితుడనై పోతాను. తరువాత *Professor* నై పోతాను. ఆతరువాత *Principal* నై పోతాను. ఒక *training school* పెడతాను. నెలకు 3, 4 వందలు ఆర్జిస్తాను. తివారీ గారు చూసి ఆశ్చర్యపడుతారు. ఈర్ష్య పడతారు.

ఆవేళ మాష్టరుగారు నన్ను సైకులుపై నెక్కించి రోడ్డుమీద విడిచిపెట్టేరు. ఇంక వెళ్లండి సైకులు వచ్చింది అని అన్నారు. సైకులు రోడ్డుమీద నడుస్తున్నాది. మనస్సు ఎక్కువ సంతోషముతో ఊయల ఊగుతున్నాది. ఆ సంతోషములో సింహగడము జయించినట్లున్నది. అప్పటి స్థితి ఎలాగున్నదో కొంచెము తిలకించండి. ఎవడైనా మనుష్యుడు రెండువందల గజాల దూరములో వున్నప్పటికీ గట్టిగా గొంతుక పెట్టి "ఏమండోయ్, కొంచెము ఎడమప్రక్కకి వెళతారా! సైకులు క్రొత్తగా నేర్చుకొంటున్నాను. సైకులు మా వశములో లేదు" అని కేక పెట్టేవాడిని. కొంచెము దూరములో ఏదైన బండి కనిపించిందా, మా ప్రాణాలు ఎండిపోతాయి. ఆ సమయములో నా హృదయము ఏ పరిస్థితిలో ఉందో ఆ పరమేశ్వరునికే తెలుసు. బండి దాటిపోయిందంటే నా ప్రాణము కుదుటపడుతుంది. వేగంగా తివారీగారు వస్తున్నారు. నేను వారిని దూరమునుంచి చూసి "ఓ తివారీగారు, కొంచెము ఎడమ ప్రక్కకు వెళ్లండి. లేకపోతే సైకిలు మీ పైకి ఎక్కిస్తానేమో భయంగా ఉంది. తివారీగారు చిన్నకళ్లతో మా ప్రక్కజూచి చిరునవ్వుతో" అన్నారు.

"కొంచె మొక మాట విని వెళ్లండి నే నొకమాటు హేండిల్ ప్రక్క చూచి తిరిగి తివారీ ప్రక్క చూచి—

నేను · ఈ పరిస్థితులలో ఏమాటని వినగలమో తమరు చూడలేమా? సైకులు త్రొక్కుతున్నాం. ఇది చూసికూడా మాటవిని వెళ్లమంటున్నారా?

తివా సైకులు తొక్కుతున్నావా తమ్ముడూ . సైకులు....అయితే ఎవరైన సైకులు త్రొక్కితే పై వాళ్ల మాట వినరూ? చాలా ఆవశ్యకమైన మాటకొంచెం విని వెళ్లండి.

నేను సైకులు కొంచెం జాగ్రతగా ఆపుకుంటూ ఇలాగ అన్నాను: "సైకులు దిగి మీ మాట వినడానికి వస్తే మళ్లా సైకు లెవ రెక్కిస్తారు?" అని వెళ్లిపోయేను. తివారీగారు కేకలు వేస్తూ వెనకకి ఉండిపోయేరు. ఇంతలో ఒక తాంగా వస్తున్నట్లు కనపడింది. దూరంనుండే దాన్ని చూసి కేకలువేయడం ప్రారంభించేము. "ఎడమప్రక్కన తోలు తమ్ముడూ, సైకిలు క్రొత్తగా నేర్చుకొంటున్నాను."

లాంగా ఎడమప్రక్క వెళ్లిపోయింది. నేను గండం తప్పించుకొని త్రోవలోనుండి జాగ్రతగా వెళుతున్నాను. నా దుర్దశవలన తాంగా మళ్లా ఎదురుగుండా వచ్చింది. కొంచెం హేండిలు ప్రక్కకి తిప్పితే ప్రక్కకు పోయి ఉందును గాని, చెడుసమయం వస్తే మొదట బుద్ధి పాడైపోతుంది. ఆ సమయంలో హేండిలు ప్రక్కకి తిప్పాలన్న సంగతి మరచిపోయేను. ఆ సమయంలో విధాత తాంగా వస్తున్న త్రోవనే సైకులు తీసికొనివెళ్లమని వ్రాసినాడు గాబోలు.

ఒక్క క్షణంలో నా జీవితంలో అన్ని సంఘటనలు జ్ఞాపకానికి వచ్చేయి. రెండో క్షణంలో నేనూ, నా సైకిలూ తాంగాక్రింద ఉన్నాం. తెలివివచ్చి చూస్తే నా యింటిలో ప్రక్కమీద నున్నాను. నాశరీరంమీద ఎన్నో పట్టీలు కట్టబడి ఉన్నాయి.

అప్పటినుండీ ఇప్పటివరకు సైకులు చేతితో ముట్టుకోడంటే నమ్మండి!

"రోమ్మెల్"ను నాజీలే చంపారు

(7 వ పేజీ తరువాయి)

బహటానికే రోమ్మెల్ ప్రయత్నిస్తే, రోమ్మెల్ కుటుంబం కూడా చాలా కష్టాలకు గురికావలసి వస్తుందనీ, గప్‌చిప్‌గా విషం పుచ్చుకొంటే, ఇతరుల కెవ్వరికీ ఏ ఆపదా రాదనీ, కుటుంబానికి గౌరవాలన్నీ అట్టే మిగులుతాయనీ, ఆ వచ్చిన జనరల్సు ఇద్దరూ రోమెల్‌కు విశదీకరించారు. "తమ సేనానాయకులలో తమ కందరకూ ఆప్తప్రాయుడైన వాడు కూడా, తమ ఫ్యూరర్ పై కుట్ర పన్నాడని ప్రజలకు తెలుపటం, రోమ్మెల్ కీర్తికి కళంకం తేవటం తన కిష్టం లేదని "హిట్లరు అభిప్రాయ మని వాళ్లు చెప్పారు.

రోమ్మెల్ వాళ్లతో కారులో బయలుదేరినాడు. కారులో విషపాత్ర అందిచ్చారు. మూడు సెకనులలో విషం పనిచేసింది. జులై 17 న తగిలిన గాయాలవల్ల తీసుకొని రోమ్మెల్ చనిపోయాడని, మరుక్షణంలో ప్రపంచానికంతకూ వార్తలు వెళ్లాయి. రోమ్మెల్ అంత్యక్రియలు మిలిటరీవైభవంతో జరిగాయి. కాని హిట్లరు రాలేదు. రుండ్‌స్టెడును పంపాడు. హత్యానాటకంలో తుది అంకం కూడా, నిశ్శబ్దంగానే పూర్తి అయిపోయింది.

(రీడర్సు డైజస్టు(డిసెంబరు)వ్యాసం ఆధారం.)

సాహిత్యమీమాంస:

శివకవులు: జాను తెనుగు

శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్య

సాహిత్యములో నభ్యుదయవాంఛ యీనాటిది మాత్రమే కాదు. ప్రాతదారులు పరిహరింప వలసినప్పుడెల్ల నీ యభ్యుదయవాంఛ పొడసూపుచునే యున్నది. ఆంధ్రసాహిత్య చరిత్రమును పరిశీలించిన నిట్టి యభ్యుదయము ఏకాలమున కాకాలమున క్రొంగ్రొత్తగా వెలయుచుండుట, అందుచే సాహిత్యపద్ధతిలో నొక మార్పు ఏర్పడుట గోచరింపగలదు.

సాహిత్యము ఒక జీవనది. గమ్యము నుద్దేశించిన తన పరుగులో నది తన పరీవాహగతిని మార్చి క్రొత్తదారుల ద్రొక్కినట్లు సాహిత్యమును అభ్యుదయగతితో ముందునకు ముందునకు సాగుచు కాలము గడువను గడువను ప్రాతదారుల పరిహరించి క్రొత్తత్రోవల ద్రొక్కుచున్నది. పరీవాహగతిలో నదికివలె సాహిత్యమునకు పరిణామము సహజము, సమంజసము. సాహిత్యములో నిట్టి పరిణామము, నిట్టి యభ్యుదయము లేవలయు నని యెప్పటికప్పుడు అభ్యుదయవాదులు అవతరించుచునే యుందురు. వారి పుణ్యమాయని సాహిత్యము క్రొత్తరంగులు దీర్చి నవపరిమళముతో బరిమళించుచుండును.

క్రీస్తుశకము పండ్రెండవ శతాబ్దములో సాహిత్యమునం దిట్టి యభ్యుదయమే యవతరించినది. ఈ యభ్యుదయావతరణమునకు భగీరథ కల్పులు శివకవులు! నాటిసాహిత్యములో శివకవు లవతరింపజేసిన యభ్యుదయము బహుముఖము; పరిపుష్టము. అభ్యుదయము అంతంతలలో నగు పని కాదు. శ్రమైకసాధ్యము. ప్రాతదారుల ఒరిహరింపజాలని పరమఛాందసుల నభ్యుదయవాదు లెదుర్కొనవలసి యున్నది. తా మవతరింపజేయు నభ్యుదయమునకు హేతువాదముతో ప్రజాబలము పడసి తమ వాదమును నిలుపరించుకొనవలసి యున్నది. ఎన్ని డక్కా మొక్కీలయిన నెదుర్కొనుటకు వారు గండెర గండంద్రుడుగా నుండవలయును. సంఘములో గాని, సాహిత్యములోగాని మార్పు ఒక్కపెట్టున నేర్పదు. సంఘమున కొదిగి యొదిగి యుండి యలతియలతిగా దమ వాదశేశములకు ప్రజామోదము సంపాదించుకొని యద నెఱిగి రొదురు దిరుగవలయును. ఇందుచే నభ్యుదయము ఒక్కపెట్టున గాక యల్లనల్లన కాలు నిలుపద్రొక్కుకొనుచుండును. శివకవు లిట్టి గట్టి చిక్కులను మిక్కిలిగా నెదుర్కొని యుందు రనియే యెంచవలసి యున్నది. నేటిదాక వారి కవిత, వారి కవితాసంప్రదాయములు తక్కిన భవికవుల కవితవలె, వారి కవితాసంప్రదాయములవలె నాదరము పడయకుండుటయే యందులకు నిదర్శనము.

శివకవులు తెచ్చిన యభ్యుదయమునుగూర్చి తెలిసికొనుటకుముందు తత్పూర్వస్థితినిగూర్చి యొకింత తెలిసికొనవలసియున్నది. శివకవులకు పూర్వము వెలసిన కావ్యములకు వస్తువు సంస్కృతమూలకము. అనువాదప్రాయము. అందలి కవిత్వము మార్గకవిత్వము. అందలి భాష సమసంస్కృతోక్తి ప్రధానము, ఛందము సంస్కృత వృత్తప్రధానము.

పండితైకవేద్యముగా నున్న యిట్టి సాహిత్యము ప్రజాసామాన్యముచే గూడ ననుభూత మగునట్లు చేయవలయు నని శివకవులు వస్తువునందును, కవితయందును, భాషయందును, ఛందమునందును మార్పు తెచ్చినారు. అభ్యుదయము నవతరింపజేసినారు. శివకథావస్తువుతో, దేశకవితాసంప్రదాయము ననుసరించి, జాను తెనుగున, జాతిఛందమున గవిత చెప్పినారు.

పండ్రెండవ శతాబ్దినాటి కవితలో మార్గదేశి విభేదము లున్నట్లు నన్నిచోడ మహాకవి తన కుమారసంభవమున నిట్లు పేర్కొనినాడు. చూడుడు:

"మార్గకు మార్గము దేశియ
మార్గము వగవంగ దమకు మదివదలక దు
ర్మార్గ పరవస్తు లవదగు
మార్గవులం దలకు నలతి మహి సుకవుఃకుక్"
(నన్ని-కుమా-కృత్యవతరణిక 28.)

"మృదురీతి సూక్తు లింపొదవింప మేలిల్లు
భావమ్ము నెలమి బ్రీత్యావహముగ
మెలుగుల గన్నులు మిఱుమిట్లు వోవంగ
గాంతి సుధాసూతి కాంతి జెనయ
వర్ణన లెల్లచో వర్ణన కెక్కంగ
రసములు దళుకొత్తి రాలువాఱ
దేశిమార్గంబులు దేశీయములుగా న
లంకారముల దా నలంకరింప
నాదరించి 'విని సదర్థాతిశయమున
బుధులు నెమ్మనమున నిగులు నిలుప
వలవదే సమస్త వస్తు కవీశ్వర
నూత్న రుచిర కావ్య రత్నపీఠి,"
(నన్ని - కుమా - కృత్యవతరణిక - 36.)

పంప మహాకవి విరచించిన విక్రమార్జున విజయమునను నీ మార్గదేశివిభేదములు పేర్కొనబడినవి.

బజెపాస తప్పదాగి మృదు
బంధ దొసందువు దొంది దేసియొళ్
పుగుదువు పొక్కు మార్గదొళె
తప్పదు తళ్ళొడి కావ్యబంధ మొ
ప్పుగు మెళ్మావు కెందళిర
పూవిన పళ్పొదయిం బజల్దు తుం
బి గళిసె తుంబిగోగిలెయె
ఒగ్గిసె సుగ్గియొప్ప వంతెపోల్."
(పంప విక్రమార్జున విజయము.)

ద్వాదశ శతాబ్దియందలి శాసనములోగూడ నీ మార్గదేశి విభేదములు పేర్కొనబడినవి. క్రీ. శ. 1145 నాటి శాసనములోని యీ పద్యము జూడుడు

"తలంప సదర్థ భావమునం
దర్థతిసూక్తులగూడ వర్ణనల(లు)
గొలుసు గొనంగ వ్రావడ్లు
గోరిన భంగిక వచ్చి ముట్టం గో
మలగతి దేసిమార్గణములు
మట్టుపడం గ్గటనంబు లొప్ప నా
ద్యుల క్రియం జెప్పనేర్చె నృప
ధూర్జటి భీమయపండ డిమ్మహిని."
(దక్షిణదేశ శాసనసంచయము. వాల్యుం 6, సంఖ్య 103.)

కవితామార్గమున వేఱుత్రోవ ద్రొక్కిన శివకవు లందఱును తక్కిన భవికవులకంటె విలక్షణముగా దమ కావ్యముల దీర్చినారు. వారి కవితలో శివకవుల ప్రత్యేకత స్పష్టముగా గోచరింపగలదు. శివకవుల కావ్యములలోని యాశ్వాసాంతగద్యలను జూచిన నవి యెల్లను నొకరితో నొకరు కూడబలుకుకొని వ్రాసినట్లు తోపక మానదు. వారి యాశ్వాసాంతగద్యలెల్ల విలక్షణముగా నుండును. ఇవి చూడుడు—

"ఇది శ్రీమజ్జంగమ మల్లికార్జునదేవ దివ్య శ్రీపాదపంకజ భ్రమరాయమాణ కవిరాజ శిఖామణి నన్నెచోడదేవప్రణీతంబైన కుమారసంభవంబను కథయందు బ్రథమాశ్వాసము."
(నన్నిచోడ మహాకవి - కుమారసంభవము.)

"ఇది యసంఖ్యాత మాహేశ్వర దివ్య
పదపద్మ సౌరభ భ్రమరాయమాణ
జంగమలింగ ప్రసాదోపభోగ
సంగత సుఖ సుధా శరధి నిమగ్న
సుకృతాత్మ పాలకురికి సోమనాథ
సుకవి ప్రణీత భాసురతర దండ
నాయక బసవాంకవఖ్యాత గుణగ
ణాయత కీర్తి దిగంత త్రిలోక
గురు పండితారాధ్య చరితంబునందు
గరము ద్వితీయ ప్రకరణ మొప్పారు."
(పండితారాధ్య చరిత్రము.)

"ఇది శ్రీ గిరీశ విశ్వేశ్వర ధ్యాన
విదిత శివాచార విహిత సుజ్ఞాన
పండితారాధ్య శ్రీపాదాబ్జభృంగ
ఖండేందుధరభక్తి కామ్యాంతరంగ."
(వీరమాహేశ్వరాచారసంగ్రహము.)

"ఇది పరమేశ మాహేశ్వర దివ్య
పదపద్మ మకరందపాన సన్మనుక
భవ్యజంగము లింగ భక్తి నిష్కైవ్య
దివ్య సదానంద ధీయుతయుక్త
కన్నడె మర సదాగార గురుశిష్య
చన్న బసవన్న ప్రసాద సత్కావ్య.
.. . .
. . ..
(నవచోళ చరిత్రము)

"శ్రీపాద పంకజ భ్రమరాయమాణ" యన్న సమాస పదముతో సమానార్థకము లయినవి పైన జేర్కొన్న గద్యలలో స్పష్టముగా గోచరింపగలవు.

కవితలో వేఱుమార్గము ద్రొక్కిన తమ్ము, తమవారిని శివకవులు తక్కినవారితో గాక ప్రత్యేకముగా జేర్కొనుచుండిరి. తామెల్లరు శివకవుల మని, తమది శివకవుల సంప్రదాయ మని వారే పేర్కొనిరి. ఇది చూడుడు

ఐనను లోకహితార్థంబు గాగ
నానేర్చుకొలది వర్ణన సేయువాడ
నవరసరసికత భువిని జేర్కొన్న
శివకవి ప్రవరుల చిత్తంబు లలర
నిప్పాట నితరులు జెప్పెడి దేమి
తప్పులు దారులు దడబడ బలికి.
(బసవపురాణము)

వివరింప శేషుని వేయునాలుకలు
శివకవి మల్లయ్య జిహ్వకు సరియె
....
వేయేల కవిమల్లు విషయేంద్రియములు.
(పండితారాధ్య చరిత్రము)

తరువాతి తరమువారును వీరి ప్రత్యేకతను గుఱుతించిన ట్లున్నది. వీరిని ప్రత్యేకముగానే ప్రస్తుతించినారు. వేమనయోగి చెప్పిన పద్య మిది చూడుడు:

శివకవులకు నవకవులకు
శివభక్తికి దత్త్వమునకు జింతామణికిన్
శివలోకప్రముఖులకును
శివునకు గురువునకు శరణుసేయగ వేమా!
(వేమన శతకము)

ఇక నీ శివకవులు తమకావ్యములలో జేర్కొనిన జాను తెనుగును గూర్చి తెలిసికొందము.

నన్నిచోడ మహాకవి తనకావ్యమును జాను దెనుగున రచించినట్లు పేర్కొనినాడు. జాను దెనుగును దొలుత జేర్కొనిన కవి యితడే. చూడుడు:

సరళముగాగ భావములు
జానుదెనుంగున నింపుపెంపుతో
బిరిగొన వర్ణనల్ ఘణితి
పేర్కొన నర్థము లొత్తగిల్ల బం
ధురముగ బ్రాణముల్ మధుమ్మ
దుత్వ రసంబున గందళింప న
తురములు సూక్తు లార్యులకు
గర్గరసాయనలీల గ్రాలగాన్.
(నన్ని - కుమా - కృత్యవతరణిక - 35)

పాలకుఱికి సోమనాథకవీశ్వరుడు తన బసవపురాణమునను, పండితారాధ్యచరిత్రమునను గూడ జానుదెనుగును జేర్కొనుటయేగాక జాను తెనుగు స్వరూపము నొకింతగా గోచరింప జేసినాడు. చూడుడు:

'ఉరుతరగద్యపద్యోక్తులకంటె
సరసమై పరగిన జాను తెనుంగు
సర్చింపగా సర్వసామాన్య మగుట
గూర్చెద ద్విపదల గోర్కిదైవార
తెలుగుమాట లనంగ వలదు, వేదముల
కొలదియకా జూడు డిల—'
(బసవ పురాణము)

తనకు బూర్వమును, తనకాలమునను వెలయుచుండిన గద్యపద్యోక్తి ప్రబంధములకును, దాను జాను తెనుగున రచించుకృతులకును గల తారతమ్యము గవి పేర్కొనుచు జాను తెనుగు సర్వసామాన్యమగుటచే నాదరము పడయవలసినదే యని నిరూపించుకొనుచున్నాడు.

జాను తెనుగునకు 'సర్వసామాన్యత' యను గుణము మాత్రమే గాక 'ప్రసన్నత' యనుగుణ విశేషముకూడ గల దని యతడే పేర్కొనుచున్నాడు చూడుడు:

'అనూఢ గద్యపద్యాది ప్రబంధ
పూరిత సంస్కృత భూయిష్ఠరచన
మానుగా సర్వసామాన్యంబు గామి
జాను తెనుగు విశేషము ప్రసన్నతకు'
(పండితారాధ్య చరిత్రము)

తాను జేర్కొనిన జాను తెనుగునకు లక్షణము పేర్కొనిన యాతడే లక్ష్యముగూడ విరచించి చూపెనాడు. సోమనాథుని వృషాధిపశతకములోని యీ పద్యముగూడ విరచించి చూపినాడు. సోమనాథుని వృషాధిపశతకములోని యీ పద్యము జూడుడు

బలుపొడతోలు సీరయును
బాపసరుల్ గిలుపారుకన్ను వె
న్నెలతల సేదుగుత్తుకయు
నిండిన వేలుపుటేఱు వల్గు పూ
సలుగల ఱేని లెంక వని
జానుదెనుంగున విన్నవించెదన్
వలపు మదిం దలిర్ప బస
వా బసవా బసవా వృషాధిపా!

సోమనాథుని యీపద్యమునుబట్టి జానుదెను గనగా నచ్చతెను గని శ్రీ శ్రీపాద లక్ష్మీపతి శాస్త్రిగారు తమ కుమారసంభవవిమర్శములో వ్రాసిరి. చూడుడు

"తెనుగుదేశిలో వాడుకలోనున్న తెనుగు మాటలను జానుదెను గని వాడిరి. అదే యచ్చతెనుగు. జానుదెనుగున కుదాహరణముగా నీయబడిన సోమనాథుని పద్య మచ్చతెనుగుననే రచింపబడెనుగదా! ప్రాతమాటలు విడిచి వాడుకలో నున్న మాటలు వాడుట యెప్పుడును గవులు గోరుచునేయుందురు. కొన్నిచోట్ల రసావిష్కరణమునకో, పాండిత్యప్రకర్షమునకో గూఢపదములు గాఢముగా గొంద ఱుపయోగింతురు. అది తాత్కాలిక సందర్భముల బట్టి యుండును."

దీనిబట్టి జాను తెను గనగా నచ్చతెను గని విమర్శకుల యభిప్రాయ మయినట్లు తెలియుచున్నది. కాని యీ జాను తెనుగును జేర్కొన్న కవీశ్వరుల వచనములు చూచిన నవి యచ్చతెనుగు కావ్యములు కావని స్పష్టముగా దెలియగలదు. కావున జాను తెనుగు అచ్చతెనుగు కాదు. దానికంటె విలక్షణ మైనది.

శ్రీ చిలుకూరి నారాయణరావుగారు పండితారాధ్య చరిత్ర పీఠికలో జాను - తెనుగును గూర్చి యిట్లు వ్రాసిరి

"జాను అనేది చదును శబ్దమునకు రూపాంతరము. చదును చదురునకు రూపాంతరము. ఇది చతురశబ్దభవము. జానుతెనుగు లేక చదుసైన తెనుగు అంటే లోకవ్యవహారములో నున్న, సర్వజనసుబోధమైన తెనుగు. దీనినే సోమనాథుడు తేటతెనుగు, తిన్ననినూక్తి అని కూడ అన్నాడు. దీనినే కర్ణాటకలాక్షణికులు 'సమసంస్కృతోక్తి' అన్నారు. ఆదికవులు' విద్వత్తును ప్రకటించడానికి నిఘంటువ్యాకరణముల మూలముగాబోధపడే సంస్కృతపద భూయిష్ఠము కాక, అదే పనిగా, బిగారముగా, బలవంతముగా ఏర్చికూర్చిన 'అచ్చ తెనుగు' మాటలతో మాత్రము కూడిన భాషయున్నుగాక, లోకవ్యవహారబద్ధములైన సంస్కృతాంధ్రపదములతో వెలయవలెను."

'జాను' అన్నపదము 'జాణ' యన్నపదమునకు వికృతి. 'జాణ' యనునది జ్ఞానశబ్దభవము. జానుశబ్దరూపనిష్పత్తి యిట్టిదే యయి యుండు నని నన్నిచోడని మఱియొక ప్రయోగమును బట్టియు దెలియుచున్నది. చూడుడు:

జానతి పశుపతి నుఱకవి
తాన మహారంభుడైన దక్షుం డను న
జ్ఞానికి మునుకొని వచ్చు వి
మానం బన నమరి సతివిమానము వచ్చెన్.
(నన్ని - కుమా - ద్వితీయా 15)

ఇచట జానుపదమునకు జ్ఞానమనియే యర్థము చెప్పవలయును. జానతి యనగా తెలివి లేక,

(22 వ పేజీ చూడుడు)

అంతర్జాతీయ రాజకీయాలు:

(8 వ పేజీ తరువాయి)

మునకు నామమాత్రమైన పెద్దరికము వహించును.

ఈ విధముగా కామన్వెల్తు విధానమును మార్పుచేయుటలో భారతదేశమున్ను కామన్వెల్తులోని ఇతర రాజ్యములునూ, మనోధైర్యముతో మహత్తమమైన నిర్ణయమును చేయగల్గెను.

ఇదంతయును మన ప్రధానమంత్రి సాధించిన విజయము. అంతర్జాతీయరంగములో ఆయన సంపాదించిన గౌరవమునకు పలుకుబడికి యిది తార్కాణము. ఆయన సామర్థ్యమునకు పట్టుదలకు నిదర్శనం.

నెహ్రూకు ఐర్ సత్కారం:

భారతప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూకు ఐర్ పార్లమెంటు ఏ అతిథికీ చేయని అపూర్వమైన సత్కారం చేసింది. గురువారంనాడు ఐర్లెండు ప్రధాని, ప్రతికూలపక్షనాయకుడూ సభాభవనమధ్యంలో ఆయనకు ఎదురు వెళ్లి స్వాగత మిచ్చి, ప్రభుత్వసభ్యులు ఆసీనులై ఉండే సభాభాగమునకు తోడ్కొని వెళ్ళి అక్కడ ఉచితాసనంలో ఆయనను కూర్చుండబెట్టిరి. నెహ్రూ డబ్లిన్‌కు విద్యార్థిగా ఇంగ్లండులో ఉన్న రోజులలో రావడమేగాని, ఆ తర్వాత మళ్లీ ఎన్నడూ రాలేదు. నెహ్రూ ఐర్లెండు పార్లమెంటుయొక్క సభాభవనంలో ప్రముఖ అతిథులు ఆసీనులై ఉండే చోట ప్రేక్షకుడుగా వచ్చి కూర్చున్నాడు. అంతట ప్రధానమంత్రి జాన్ కోస్టెలో నెహ్రూకు సభాభవనమధ్యమందు ఉచితరీతిని అతిథి సత్కారము చేయవలె నని తీర్మానము ప్రతిపాదించగా సభ్యులు పెద్దపెట్టున కరతాళధ్వనులతో దానిని ఆమోదించిరి. అప్పుడు కోస్టెలో, ప్రతికూల పక్షనాయకుడు ఈయన్ డీవలరా నెహ్రూకు సభామందిర మధ్యంలో స్వాగత మిచ్చి, సభాధ్యక్షుడైన ఫ్రాంక్ ఫాహీవద్దకు తోడ్కొని వెళ్ళి పరిచయం చేసి అక్కడనుండి ప్రభుత్వ సభ్యులు ఉపవిష్టులైఉండే ఆసనముల వరసలో కూర్చుండబెట్టి ఉచితరీతినిసత్కరించిరి. పండిట్ నెహ్రూ ఆసనమునుండి సభాకార్యక్రమమును ఒక అరగంటసేపు వీక్షించి ఆ తర్వాత బయటికి వెడలిపోయెను.

పండిట్ నెహ్రూ రాయ్‌టర్ విలేఖరితో యిలా అన్నాడు: చిన్ననాటినుంచీ ఎప్పుడూ నేను ఐర్లెండుగురించి కలలు గంటూ ఉండే వాణ్ణి. మనము నడపిన స్వాతంత్ర్య పోరాటముల సారూప్యమునుబట్టి మన దేశముల చరిత్రలకు అనేక అంశములందు విడదీయరాని సంబంధమేర్పడినది. చిరకాలమునందు ఏర్పడిన యీ సంబంధములు నేటికి కూడ అవిచ్ఛిన్నముగా సాగుచున్నవి.

ఉభయదేశముల యోగక్షేమముల అభివృద్ధికి, ప్రపంచ శాంతి స్వాతంత్ర్యముల పోషణకు ఈ మైత్రి సాధనము కాగలదని నేను విశ్వసించుచున్నాను.

రాష్ట్రపతిఅభిప్రాయం:

స్వతంత్రరాజ్యాల సమైక్యతకు రాజును లాంఛనప్రాయంగానే అధిపతిగా చెయ్యడం అంటే, తమ కింకా పూర్తిగా అవగాహన కాలేదని రాష్ట్రపతి పట్టాభిగారన్నారు. ఇష్టం వచ్చినప్పుడు రాజీనామా ఇవ్వడానికి వీలైన క్లబ్ సభ్యత్వంవంటిదైతే ఫరవాలేదుకాని, కష్టనష్టాలకు లోనుకావలసిన పెట్టుబడి వాటాదారుగా ఉంటేమాత్రం కష్టం అన్నారు.

సోషలిస్టులు కామన్వెల్తులో చేరడం అంటే ఆంగ్లో-అమెరికన్ వర్గంలో చేరిపోయినట్లేననీ, తటస్థవిధానం శాంతిమార్గం అవలంబిస్తా నని నెహ్రూ చెప్పిన మాటల్ని భగ్నపరిచాడనీ విమర్శించారు. అదీ గాక బ్రిటిష్‌వారి పెట్టుబడి ఈ దేశంలో అత్యధికంగా ఉన్నందువల్ల వానిని ప్రభుత్వపరం చేసుకోవాలంటే కామన్వెల్తు సభ్యత్వం ఆటంక మవుతుందని వారి వాదం. ఇంక కమ్యూనిస్టుల ధోరణి చెప్పనక్కరలేదు. రష్యా విరోధి, ప్రజావిరోధి అని నెహ్రూను దుయ్యబట్టి, శాంతిభంగకారుల్లో నెహ్రూను చేర్చివేస్తున్నారు.

బ్రిటిష్ పత్రికల్లో నెహ్రూ అట్లీలపట్ల ప్రశంసలకు పారం లేకుండా ఉంది. ఇద్దరినీ ఇతిహాసపురుషులనీ, మహత్తరరాజనీతిధురంధరులనీ, కీర్తించాయి.

పశ్చిమజర్మనీలో ప్రభుత్వస్థాపన:

బ్రిటిష్, అమెరికన్, ఫ్రెంచి సైన్యాల ఆక్రమణలో ఉన్న పశ్చిమజర్మనీలో ప్రజాప్రాతినిధ్య ప్రభుత్వం ఒకటి స్థాపించడానికి, పశ్చిమ జర్మనీ రాజ్యాంగ పరిషత్సభకీ, మిలిటరీ ప్రభుత్వాలకీ మధ్య సమాధానం కుదిరింది. సైనిక ప్రభుత్వాలకు తృప్తి కలిగించగల రాజ్యాంగాన్ని తయారుచేయాలని బాన్‌లో సమావేశమైన పశ్చిమజర్మనీ రాజ్యాంగపరిషత్సభ ఎనిమిది మాసాలు కృషిచేసింది. బాన్ సభ రెండుసార్లు సమర్పించిన రెండు రాజ్యాంగ విధానాలు రచించి సమర్పించింది. కాని అవి సైనిక ప్రభుత్వాలకు అంగీకారయోగ్యం కాలేకపోయినవి.

అట్లాంటిక్ ఒడంబడిక జరగడంతో జర్మన్లలో తొందర పుట్టింది. ఏదో రీతిని ఒక రాజ్యాంగానికి అంగీకరించినట్లయితే పశ్చిమ జర్మన్ ప్రభుత్వాన్ని స్థాపించి ఫ్రాన్సు మొదలైన దేశాలవలెనే ఆహారపారిశ్రామిక వస్తుసామగ్రినీ, ఆయుధసామగ్రినీ అమెరికా వలన పొందవచ్చునని వారి ఆశ.


పశ్చిమ జర్మనీలో ఏదో రీతిని ప్రభుత్వం స్థాపించబడినట్లయితే, దానినికూడా అట్లాంటిక్ ఒడంబడికలో చేర్చి అక్కడ ప్రభుత్వం ప్రజల సహకారంతో రైన్‌నదీతీరాన కూడా ఒక రక్షణశ్రేణిని స్విట్జర్లండ్‌వరకూ నిర్మించాలని అమెరికన్లు తొందరపడుతున్నారు.

పిరనీస్ పర్వతప్రాంతంవద్ద ఒక రక్షణశ్రేణిని, ఉత్తరాఫ్రికాలో పెద్దపెద్ద మిలిటరీ కేంద్రాలనూ అట్లాంటిక్ దేశాలు నిర్మిస్తున్నవి. ఇప్పుడు వానితో పశ్చిమ జర్మనీశ్రేణిగూడా నిర్మించగలిగినట్లయితే ఫ్రెంచి, బెల్జియన్, డచ్చి, లగ్జెంబర్గ్ ప్రభుత్వాల భీతిని పోగొట్టవచ్చును.

బెర్లిన్ ప్రతిష్టంభనా పరిష్కారం:

బెర్లిన్ సమస్య సాకుగా తీసుకొని ఎలాగైనా పశ్చిమ జర్మన్ ప్రభుత్వాన్ని నిర్మించకుండా చేయాలనీ, పశ్చిమజర్మనీలో ఎలాగైనా కల్లోలం తెచ్చి పశ్చిమయూరప్‌లోని ఆంగ్లో అమెరికన్ మిలిటరీ పన్నాగాలనూ, అట్లాంటిక్ ఒడంబడిక ఆశయాలనూ భగ్నపరచాలని రష్యా యత్నిస్తోంది. అందువల్లనే బెర్లిన్ సమస్యను పరిష్కరించడానికి ఇప్పుడు అంగీకరిస్తోంది.

జనవరి 27 వ తేదీని ఒక అమెరికన్ వార్తాసంస్థ అధిపతితో స్టాలిన్ ఇంటర్‌వ్యూ ఇచ్చాడు. బెర్లిన్‌లో ఆర్థిక దిగ్బంధం తొలగించడానికి వీలవుతుందని స్టాలిన్ ఆ సమయాన చెప్పాడు. బెర్లిన్ దిగ్బంధం తొలగించడానికి ద్రవ్యసమస్య పరిష్కారం కావాలనే షరతున్నట్లు స్టాలిన్ చెప్పలేదు. దీనితో అమెరికాలో ఆశలు హెచ్చాయి. ఇప్పుడు దిగ్బంధం మూలంగా బెర్లిన్ నగరంలో బ్రిటిష్, అమెరికన్, ఫ్రెంచి అధికారప్రాంతాలకు వస్తుసామగ్రి విమానాలద్వారా సప్లై అవుతోంది. జొగ్గులు, కలప, మేకలు, మాంసంమొదలైనవన్నీ విమానాలద్వారానే సరఫరా అవుతున్నాయి. ఇప్పుడు బ్రిటిష్ అమెరికన్ విమానాలెన్నివిధాల కృషిచేస్తున్నా, వాతావరణం బాగాఉన్న రోజుల్లో విమానయానంలో ఎలాటి ఆటంకాలు లేని రోజుల్లోకూడా నెలకు 7 వేల టన్నులకు మించి సామగ్రి తీసుకుపోలేకపోతున్నారు. కాని బెర్లిన్‌నగరంలో 20 వేల టన్నులైనాకనీసం అవసరం ఉంటుంది. అందువల్ల ఆంగ్లో అమెరికన్ ప్రభుత్వాలు పైకి ఎంత నటించినా, బెర్లిన్ దిగ్బంధంవల్ల ప్రజలకు చెప్పరాని ఇక్కట్లు కలుగుతున్నాయి. ఎలాగైనా బెర్లిన్ దిగ్బంధం తొలగించాలని యత్నిస్తున్న అమెరికా వెంటనే రష్యన్ రాయబారుల్తో రహస్యంగా సంప్రదింపులారంభించింది. భద్రతామండలిలో రష్యన్ సభ్యుడైన జాకబ్‌మాలిక్‌ను రష్యన్ రాయబారి ఫిలిప్ జోసప్ కలుసుకుని సంప్రదించాడు. పశ్చిమ ప్రభుత్వాలుకూడా అదే సమయాన ఆర్థిక దిగ్బంధం తొలగించడానికీ, విదేశాంగమంత్రుల సమావేశానికి ముందే తేదీ నిర్ణయించడానికీ అంగీకరించినట్లయితే రష్యా తన ఆర్థిక దిగ్బంధం తొలగించగలదని మాలిక్ తెలిపాడట. ఈ విషయమై అమెరికన్ విదేశాంగ కార్యాలయం ఆలోచిస్తున్నది. త్వరలోనే, కొద్ది రోజుల్లో బెర్లిన్ నగరంలో ఆర్థిక దురవస్థ తొలగిపోవచ్చును. విదేశాంగమంత్రుల సమావేశం జరిపితే పశ్చిమజర్మనీలో ప్రత్యేకప్రభుత్వం స్థాపించే విషయమై చర్చ జరుగక తప్పదు. స్థాపించకుండా రష్యా తప్పక యత్నిస్తుంది. అట్లాంటిక్ దేశాల అగ్రరక్షణశ్రేణి రైన్‌నదీ తీరంవద్ద నిర్మించడానికి ఇప్పుడు వీలుపడకపోవచ్చు. తద్వారా అట్లాంటిక్ ఒడంబడికవల్ల రక్షణ కోరుతున్న ఫ్రాన్, బెనిలక్స్ దేశాలకు రక్షణ వాస్తవంగా లభింపకుండా చెయ్యాలనే రష్యా ప్రధాన లక్ష్యం.



మద్రాసు ప్రధాని కుమారస్వామిరాజా ఏప్రిల్ 7 తేదీనాడు ఢిల్లీకి పోవుచున్నప్పుడు, హకీంపేట విమానాశ్రయమువద్ద వారిని వారి మిత్రులు, సంస్థానాధికారులు కలిసికొనిఅభినందించిరి. ఫోటోలో అతాఫ్‌బల్దాజిల్లా పోలీసు సూపరింటెండెంట్, శ్రీ కుమారస్వామిరాజా, శ్రీ గాడేపల్లి జగన్నాథంగారలు కలరు.

స్వదేశ విషయాలు

(5-వ పేజీ తరువాయి)

"రాష్ట్రసంఘమువారు ఆంధ్రరాష్ట్రం కొరకు నిత్యకృషిచేయువారగుటచే, మదరాసు పై హక్కులు వదలుకొనుమని ఆంధ్రులకు సలహా చేయజాలకున్నారు. సరిహద్దు సంఘమొకటి ఆంధ్రరాష్ట్ర సరిహద్దులను నిర్ణయించాలని సూచించుచున్నారు. నాయకత్రయం యిట్టి షరతులతో కూడిన ఆంధ్రరాష్ట్ర నిర్మాణం సూచించినందుకు యీ కమిటీవారు అసంతృప్తిచెంది, ఇపుడు నిస్సందేహంగా ఆంధ్రప్రాంతమైన విశాఖ, ఉభయగోదావరి, గుంటూరు, కృష్ణా, నెల్లూరు, చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు, బళ్లారిలోని అదోని, ఆల్లూరు, రాయదుర్గం తాలూకాలతో (కేల్కారు అవార్డు ప్రకారం) రాష్ట్రకాంగ్రెసు సరిహద్దుల ప్రకార,మున్న ఆంధ్రరాష్ట్రమును ప్రత్యేకించుటకు ఇండియాచట్టం 290 సెక్షను (ఎడాప్టేషను ఆర్డరు సవరించినరీతిని) ప్రకారం తగుచర్య తీసుకొని, నూతన రాజ్యాంగ విధానంలో మొదటిభాగమున, మొదటి షెడ్యూలులో తెలిపిన దేశభాగాలక్రింద ప్రత్యేకగవర్నరు రాష్ట్రంగా నిర్ణయించాలని కోరుచున్నారు.

"ఆంధ్రజిల్లాలకు సమీపములోనుండి ఆంధ్రులు ఎక్కువగ నున్న ప్రాంతాలు చెన్నరాష్ట్రంలోను వెలుపలగూడ యింకను మిగిలియుండిపోయినచో వాటినిగూర్చి యింకో అనుకూల సమయాన్ని సరిహద్దు నిర్ణయసంఘాన్ని నియమించి వానిని ఆంధ్రరాష్ట్రంలో చేర్చుటకు గల హక్కులను నిర్ణయించవచ్చుని సంఘంవారు సూచించుచున్నారు."

ధాన్యం ధరలు:

ధాన్యం ధరలు ఈ సంవత్సరం నిర్ణయించడానికి మామూలుకంటె ముందుగానే భారత ప్రభుత్వం యత్నించింది. రాష్ట్రఆహారశాఖా మంత్రులు, సంస్థానాల ఆహారశాఖా మంత్రులు ఈ వారం ఢిల్లీలో సమావేశమైనారు. ప్రత్తి ధరలు నిర్ణయించడానికిముందే ఈ మారు ధాన్యం ధరలు నిర్ణయించడం మంచిదనుకున్నారు. దేశంలో ఆహారోత్పత్తికంటెకూడా అధికంగా ప్రత్తిపంట పడిపోయింది. నూలుమిల్లులు ఇటీవల కొన్నిరోజులు మూసివేయబడినాయి కూడా. భారతదేశవిభజనవల్ల మనకు ముఖ్యంగా లోపమైన ఆహారం, ప్రత్తి, ధాన్యంధరలు తగ్గించాలని భారతప్రభుత్వమంత్రి జైరామ్‌దాస్ దౌలత్‌రాంగారు చేసిన సూచనకు చెన్నరాష్ట్ర మంత్రి ఆక్షేపణ తెలిపారు. ధరలు తగ్గిస్తే సేకరించడం కష్టం అవుతుందని డా|| రాజన్ చెప్పారట. చివరకి ఏ నిర్ణయమూ జరగలేదు. ధరల సంగతి తిరిగీ పరిశీలించాలని నిశ్చయించుకున్నారు.

కాశ్మీర్ ప్రతిపాదనలు:

కాశ్మీర్‌లో జనవాక్య నిర్ధారణ ఏర్పాటు చేసేముందు సంస్థానంలో శాంతి స్థాపనకుగాను ఉభయపక్ష సైన్యాల తగ్గింపుకూ, పాలనాధికారానికీ, ఐక్యరాజ్యసమితి వారి కమిషన్ కొత్త ప్రతిపాదనలు పంపింది. భారత పాకిస్థాన్ ప్రభుత్వాలకు ఈ ప్రతిపాదనలు పంపుతూ, ఇదే తమ తుదిప్రయత్నమనీ, తుదిప్రతిపాదనలనీ ఇది అంగీకారయోగ్యమైనవో, కావో వారం రోజుల్లో సమాధానం పంపవలసిందనీ కమిషన్ తెలియపరిచింది.

కమీషన్ పాకిస్తాన్ పట్ల పక్షపాతం చూపుతూ భారత ప్రభుత్వానికి అన్యాయం చేసిందని ఢిల్లీలో రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నారు. "ఆజాద్ కాశ్మీర్ ప్రభుత్వానికి" పాలనాధికారం ఇవ్వాలని ప్రతిపాదించారనీ, వారి సైన్యాల్ని అక్కడ శాంతిభద్రతలు కాపాడ్డానికి వినియోగించాలని కూడా ప్రతిపాదించారనీ తెలుస్తున్నది.

ఇట్టి ప్రతిపాదనల నంగీకరించబోరని భారత ప్రభుత్వం ఆరంభంలోనే తెలిపింది. అప్పుడంగీకరించి కమీషన్ ఇప్పుడీ రీతిగా ప్రతిపాదించిందంటే, వారికి న్యాయవిచారణతో నిమిత్తం

కులాసా కబుర్లు :

"ఆదరం - అర్హత"

శ్రీ జి. యస్. సూరి

ఏ ఉద్యోగానికైనా అర్హత కావాలి; కాని మంత్రి పదవిని అలంకరించటానికి మాత్రం ఏదీ అవసరం లేదు. స్కూలుఫైనలు ప్యాసయితేగాని తాలూకా ఆఫీసులో గుమాస్తా కాలేడు. ట్రెయినింగు అయితేనే కాని బడిపంతులు కాలేడు. అయిదేళ్ళు కాలేజీలో నలిగితేనే గాని ఇంజనీరు కాలేడు. ఆరేళ్ళు సతమతమయితేనేగాని డాక్టరు కాలేడు. రెండు డిగ్రీలు పుచ్చుకుని ఒక ఏడాదిపాటు సీనియరు ఆఫీసులో ఊడిగం చేస్తేనేగాని లాయరు కాలేడు. ఆఖరుకు కరిణీకానికి పరీక్షకు కూర్చోవాలి; కాంపౌండరుకు పరీక్షకు కూర్చోవాలి. మంత్రి కావటానికి ఏ పరీక్షా ప్యాసుకానక్కరలేదు. ఎటువంటి అనుభవమూ అవసరం లేదు.

ఆశే జవాబుదారీ లేని అమాంబాపతు ఉద్యోగాలకు ఇంత అర్హత ఉండవలసినప్పుడు రాష్ట్రాన్ని యావత్తూ ఒక శాఖకు సంబంధించినంతవరకు పరిపాలించటానికి ప్రత్యేకమైన అర్హత ఉండి తీరాలని మనలాంటి సామాన్యులు అనుకుంటారు. కాని సామాన్యుల అభిప్రాయముతో ఎటువంటి ప్రమేయం లేని ప్రస్తుత పరిస్థితులలో ఈలాంటిదానికి అవకాశం ఉండదు. ఇప్పుడు లెక్కలో ఉన్నదల్లా, పలుకుబడి. పలుకుబడి లేకపోయినా వడ్డించేవాడి ఆదరం ఉన్నా చాలు. ఈ విషయం మన మంత్రివర్గములో పూర్తిగా వ్యక్తమవుతుంది.

అయితే తక్కినదేశాల మాట ఏమిటని ఎవరైనా అడగవచ్చు. ప్రజాస్వామిక ప్రభుత్వాలు ఉన్నచోట్ల చదువుసంధ్యలకు మంత్రిపదవులకు ఎక్కువ లావాదేవీ లేకపోవటం నిజమే. బ్రిటిష్ ప్రభుత్వం చూడండి. బెవిన్, మారిసన్ మొదలైన ప్రముఖ మంత్రు లందరూ డిగ్రీలు, పట్టాలు లేనివాళ్ళే. సామాన్యమైన స్థితినుంచి అత్యున్నతమైన పదవిని అందుకున్నవారే. కాని వారిలో అర్హత లేదనటానికి ఎక్కడా వీలులేదు. అక్కడ మంత్రులను నిర్ణయించటంలో అధికమైన జాగ్రత్త తీసికొంటారు. ఏ శాఖకు సంబంధించిన విషయాలలో ఎక్కువ అనుభవం ఎవరి కున్నదో వారిని మాత్రమే ఆ శాఖామంత్రిగా నియమిస్తారు. వాణిజ్య శాఖా మంత్రి క్రిప్సు ఎటువంటి ప్రజ్ఞావంతుడో అందరికీ తెలిసినదే. గనుల శాఖామంత్రి ఉన్నాడంటే ఆయన మొదటినుంచీ గనుల పనివాళ్లలో మెలిగినవాడు. విదేశాంగమంత్రి బెవిన్ ఎన్నాళ్లనుంచో అంతర్జాతీయ విషయాలలో పాల్గొంటున్నవాడు. మొన్నటిదాకా ఆర్థికమంత్రిగా ఉన్న డాల్టన్ ప్రఖ్యాత అర్థశాస్త్రవేత్త. ఇది లేబరుపార్టీ విధానమే కాదు. కన్సర్వేటివ్ పరిపాలన రోజులలో కూడ ఈ విధంగానే ఉండేది. ఆయా పదవులకు పార్టీ సభ్యులలో ఉచితమైన వారిని ఉత్తరోత్రా నియమించటానికి ముందునుంచే తయారుచేస్తూండేవారు. పూర్వపు విదేశాంగమంత్రి ఆంథోనీ ఈడెన్, పూర్వపు ఇండియా సహాయకార్యదర్శి లార్డ్ లిస్టోవెల్ మొదలైనవాళ్లు ఈలాంటివాళ్ళే. అదీగాక ఏ పార్టీ ప్రభుత్వాన్ని నిర్వహిస్తున్నా పార్టీప్రోగ్రాముకు, పార్టీనాయకుల సలహాలకు బద్ధులై ఉంటారు. ఏ మంత్రిఅయినా పొరబాటువల్ల గానిబుద్ధిపూర్వకంగాగానిఅపసవ్యంగా వ్యవహరిస్తే వెంటనే రాజీనామా ఇవ్వవలసి ఉంటుంది. ఆతడికి ఎంతమంది పార్లమెంటు సభ్యుల జామ్మక్కీ ఉన్నదీ, అతడు ఏకులంవాడు అనే విషయమే విచారణకు రాదు. ఇటీవల జరిగిన డాల్టన్ గాథ ఇందుకు నిదర్శనం.

ఇక మనప్రభుత్వంమాట చెప్పనవసరంలేదు. క్లబ్బులు, సంఘాలు మొదలైనవాటి మాదిరి తయారయింది. ప్రతిసంవత్సరం ఎన్నికలు జరుగవలసిందే. ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ ఒక్కొక్క ముసాఫర్ ఖానాలో గూడుపురాణీలు, ముసుకులో గుద్దులాటలు అన్నిహంగులతో జరుగవలసిందే. ఆఖరురోజువరకు నాయకుడు ఎవరు అవుతారో ఎవ్వరికీ తెలియదు. తడవకొక కొత్త బొమ్మ తెర చీల్చుకొని ప్రత్యక్ష మవుతుంది. కొత్త నాయకుడు రాగానే పాత మంత్రివర్గం నిష్క్రమిస్తుంది. ఇక మంత్రిపదవులకు హంగామా ఆరంభ మవుతుంది. కులాన్ని బట్టి కొందరు వెనక్కునెట్టబడుతారు; మరికొందరు ముందుకు లాగబడుతారు. నాకు పాతిక ఓట్లున్నవని ఒకాయన మీసం దువ్వుతాడు. కొత్త నాయకుడు నాకు స్నేహితు డని మరొకాయన ముసిముసినవ్వులు నవ్వుతాడు. ఎవరినీ చిన్నచూపు చూడడానికి వీలులేదు. ఎవరినీ నిరుత్సాహపరచటానికి అవకాశం లేదు. లేకపోతే మొదటికే మోసం వస్తుంది. అందువల్ల మంత్రులసంఖ్య అనవసరంగా పెరిగిపోతుంది. అప్పటికీ ప్రసాదాలు అందనివాళ్లకోసం ఉపమంత్రులనో, పార్లమెంటరీ సెక్రటరీలనో కొత్త పదవులు సృష్టించవలసివస్తుంది. నలుగురు అడ్వయిజర్లు సమర్థతతో నిర్వహించగలిగిన ప్రభుత్వం పధ్నాలుగుమంది మోయవలసివస్తుంది. ఇక ఏమంత్రివర్గంలోనైనా సరే పడికట్టురాళ్లవలే ఉండేవారివిషయం ప్రత్యేకించి చెప్పనక్కరలేదు.

ఏ చిన్న ముఠానాయకుడైనా మంత్రివర్గంలో చేరాడంటే ఏశాఖనైనా నిర్వహించగల డన్నమాట. ఆర్థికమంత్రిపదవిని అలంకరించటానికి అర్థశాస్త్రం తెలిసిఉండనక్కరలేదు. కార్మికమంత్రి కార్మికుల వ్యవహారాలలో మెలిగి ఉండ నక్కరలేదు. ఆటవస్తువుల షాపులో భాగస్వామి పారిశ్రామికమంత్రి కావచ్చు. దీనికి తోడు మంత్రివర్గం ఒక నియమావళిని అనుసరించనక్కరలేదు. కాంగ్రెస్ ప్రోగ్రాము అనేది హిందూమతంలాంటిది. అమ్మవారికి నరబలి ఇచ్చేవాడిదీ హిందూమతమే; ముక్కు మూసుకుని గాలిలో ఎగిరేవాడిదీ హిందూమతమే. అదే విధంగా తయారయింది కాంగ్రెసుప్రోగ్రాము. కులవివక్షతలకు ప్రాధాన్యత ఇవ్వకూడదని కాంగ్రెస్ప్రణాళిక. అది మాకు వర్తించదని రాష్ట్రప్రభుత్వం. పార్టీలో ముఠాలు ఉండకూడదని కాంగ్రెస్ పార్లమెంటరీ బోర్డు నిబంధన. ఎదుటి పార్టీతో మంత్రుల నియామకంకోసం మంతనాలు జరుపుతున్నానని ప్రధాని శాసనసభ్యులు పర్మిట్లతోను, కంట్రాక్టులతోను ప్రమేయం పెట్టుకోకూడదని రాష్ట్రపతి ఫర్మానా. అన్నలపేరిట, బావలపేరిట వ్యాపారాలు నిర్విఘ్నంగా జరుగటం.

మన రాష్ట్రపతి మన రాష్ట్రానికి సంబంధించినంతవరకూ ఆంధ్రరాష్ట్రం విషయంలో తప్ప జోక్యం కల్పించుకునేట్లు కనబడదు. జోక్యం కలిగించుకున్న విషయంలో అందరూ సంతోషించారనుకోండి. ఏటేటా ఈ మంత్రివర్గపు ఫిరాయింపులు ఎందుకని నిలవదీసి అడిగినట్లు కనబడదు. తూర్పు పంజాబురాష్ట్రంలో మంత్రివర్గ ఏర్పాట్లకుగాను అంత శ్రద్ధ తీసికొని తన మాట చెలాయించుకున్న రాష్ట్రపతి మన రాష్ట్రవ్యవహారంలో మౌనవ్రతం ఎందుకు అవలంబించవలసివచ్చిందో తెలియదు. కాంగ్రెసు మహాసభ అధ్యక్షు డంతటివాడు ఊరిలో ఉంటే మిగతా మంత్రుల నియామకంగురించి తేల్చడానికి నాదారుగారి రాకకోసం మన ప్రధాని వేచివుండడం, వారి ఉత్తరువుకోసం నిరీక్షించటం ఆశ్చర్యంగా ఉండకమానదు. డాక్టరు పట్టాభిగారు రాష్ట్రపతి అయితే కేంద్రమంత్రివర్గాన్నే లొంగదీయగల డనీ, గాంధీగారి తత్వానికి అనుగుణ్యంగా ప్రవర్తించేట్లు చేయగలడనీ ఆసించాం. ఆ ఆశలను ఎంతవరకు నెరవేరుస్తారో చూడాలి మన ఆంధ్రనాయకుడు.

లేదనీ, ఏదోరీతిగా సంస్థానాన్ని పంపకం చేసెయ్యాలని యత్నిస్తున్నారనీ స్పష్టమౌతున్నది. పండిట్ నెహ్రూ దేశంలో లేని సమయంలో వెంటనే సమాధానం ఇవ్వాలని భారత ప్రభుత్వాన్ని నిర్బంధించడం కూడా ఢిల్లీవర్గాలలో అసంతృప్తి కలిగించింది.

లేఖలు

ఈనాటి కాంగ్రెస్, దాని కర్తవ్యము

భారతదేశము ఈనాడు ఆపదలకు గురియగుచున్నది. భారతీయుడగు ప్రతియువకుడును మేల్కొని యీ ఆపదను గుర్తించవలెను. లేదా దేశము అధోగతిపాలు కాగలదు. మహాత్ముని అభిప్రాయములతో ఏకీభవించని ఒక వ్యక్తి ఆయనను వధించెను. కాని ఆయన అనుచరులమని చెప్పుకొను నేటి కొందరు వ్యక్తులు మహాత్ముని అభిప్రాయములకు, ఆశయములకు నిలయమయిన కాంగ్రెసుసంస్థను సర్వనాశనము చేయుచున్నారు. నైనాయందువలె భారతదేశమునందును రక్తపాతము అంతర్యుద్ధము కలుగబోవు సూచనలు విశేషముగా కనుపించుచున్నవి. ఇట్టి పరిస్థితి కలుగకుండా కాంగ్రెసు సంస్థను పునరుజ్జీవింపజేయు బాధ్యత భారత యువకులపైనున్నది. ఇందులకు కాంగ్రెసును ఆవరించుకొనియున్న అనుకూలవాదులను కాంగ్రెసునుండి వేరుచేయవలెను. ఇది ఎట్లు సాధ్యపడునో అనునది ముఖ్యసమస్య.

పార్లమెంటరీ విధానము రానంతవరకు కాంగ్రెసు దేశాభిమానుల రక్తస్రావముచే పెంచబడినది. కాని పచ్చపెట్టి ఓటు ప్రచారముచే ఎన్నుకోబడిన కులతత్త్వవాదులు అధికారమునకు వచ్చిననాటినుండియు, ప్రజల కష్టసుఖములను గుర్తించుట అనువది లేదు సరికదా, దేశమునందు విజృంభించుచున్న ఆకలిబాధలు చెలరేగుటయు, వాటిని ఎవ్వరు అరికట్టలేకపోవుటయు జరుగుచున్నది. పార్టీలలో పార్టీలు ఏర్పడి వర్గముఠాలు వృద్ధిపొంది పదవులు పొందుటకు ఈ కాంగ్రెసు వేషధారులు నిత్యకృత్యముగా చూచుకొనుచుండుటచే, ప్రజలలో అసంతృప్తి విజృంభించుటయు, వారికి కాంగ్రెసుపై ఆదరాభిమానములు సన్నగిల్లుటయు జరుగుచున్నది.

ఇట్టి పరిస్థితులలో వారి సహకారము పొంది, కాంగ్రెసును సర్వనాశనము చేయుటకు ఇతర పార్టీలు విశ్వప్రయత్నములు చేయుచున్నవి. ఈ సంస్థల నినాదములు ఎట్లున్నను వాటి నాయకులకుకూడ పదవులపై తక్కువ వ్యామోహము లేదు. దేశముపై ఎక్కువ అభిమానమును లేదు. కాంగ్రెసుపై ప్రజలకు గల తాత్కాలిక నిరాదరణము పూతగా చేసుకొని ఆ సంస్థను నిర్మూలించి తమ నాయకత్వముక్రిందకు దేశమునంతను లాగుకొనుటయే వారి కుట్రయొక్క సారాంశము. కడచిన 18 సంవత్సరములుగా రాజకీయరంగమునందు అనుభవముతో నేను ఒక్కమాటను ఘంటాపథముగా చెప్పగలను. దేశీయగౌరవమును, ఇతరదేశముల, ఇతరసంస్థల, నినాదములకు బలికాకుండా కాపాడి దేశీయ సమస్యలను సమగ్రముగా పరిష్కరించి దేశాభ్యుదయమునకు సర్వవిధముల పాటుపడగల సంస్థ కాంగ్రెసు ఒక్కటే. ఐతే ఈనాడు కాంగ్రెసు ఆశయములు యువకులలో ఎంతమందికి తెలియును అనునదే పెద్ద సమస్య.

ఇదివరకు కాంగ్రెసు ఏ సిద్ధాంతములకుగాను సర్వవిధముల త్యాగము సలిపెనదో, అట్టిసిద్ధాంతములు నేటి కాంగ్రెసు వాతావరణము నుండి మాయమైపోయినవి. వర్గపోరాటములు, కులతత్త్వకక్షలు, వాటిస్థానమును ఆక్రమించినవి. అయినను, ఇట్టి సమయమున కాంగ్రెసును పరిత్యజించుట "కంఠముపై లేచిన వ్రణమును చూచి కంఠమును కోసివేయుటవంటిదే అగును" భారతీయ యువకులు కొంచెము సింహావలోకనము చేసి పదవీపోరాటమునకు పూర్వము కాంగ్రెసు సంస్థ చేసిన తీర్మానములు చదివిచూచినచో, కాంగ్రెసు ఎటువంటి ఉన్నతాశయములకు మార్గదర్శియై నిలచినదియు తెలియగలదు. అట్టి సందర్భములలో ఇతర పార్టీలలో చేరుట ఎంత ఆలోచన లేని పనియో యువకులకు బోధపడగలదు. యువకులు కాంగ్రెసు ఆశయములను చక్కగా అవగాహనచేసుకొని సామాన్య ప్రజలకు ఆ విషయములను తెలియచెప్పగలిగినచో, వారు ప్రజలకు ఇతరపార్టీలపై కలుగుచున్న అభిమానము తొలగించి కాంగ్రెసుపై అభిమానము పొందించకలుగుటయేగాక, ఈనాడు కాంగ్రెసును పదవులకొరకు చీడపురుగులవలె ఆశ్రయించుకొన్న అనుకూలవాదుల నటనను బట్టబయలుచేసి వారినుండి కాంగ్రెసుసంస్థకు ఎట్టి హానియు కలుగకుండా వీరు ఉపయోగపడగలరు.

ప్రజాస్వామికం అను మిషపై ఎటువంటి కులతత్వ ప్రచారము జరుగుచున్నదియు దేశములో అందరకు విశదమైనదే. మాతృసంస్థపై తిరస్కారము చూపుట దేశానర్థమునకు మొదటి సూచన. భారతీయ యువకులు అమార్గమును అనుసరించుట భారతీయ వినాశనమునకు దారితీయుటయే. దేశమనగా కొండలును నదులును గా వనుట వాస్తవమే.

అయినను దేశమనగా కేవలము పశుప్రాయులైన మానవుల సంఖ్య అని కూడ చెప్పకూడదు. భారతదేశమనగా ఉన్నతాదర్శములతోడను, స్వచ్ఛమైన హృదయభావములతోను నిండియున్న మానవజీవిత మని నా నిశ్చయము. ఇంతవరకును పాశ్చాత్య వ్యామోహముచే హీనస్థితికి వచ్చిన మన దృక్పథములను కేవలము భారతీయాదర్శములపై పునః నిర్మాణము చేయకల్గినచో ఒక మహత్తరమైన భారతజాతిని నిర్మించగలము. ఆకలి, లేములను నిర్మూలించి ధనవంతులకు, ధనహీనులకును మధ్య గల వ్యత్యాసమును సంకుచితముగాచేసి దేశకల్యాణమునకై రాష్ట్రపాలన అనునీతిని అనుసరించుచు మనదేశమును సర్వవిధములుగా పెంపొందించగలము.

పి. వి. భయంకరాచార్య.



డాక్టరు లంకసుందరంగారిని ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసుసంఘము సన్మానించిన సందర్భపుఫోటో. బూర్గుల రామకృష్ణరావు, జమలాపురం కేశవ రావు (అధ్యక్షులు), హయగ్రీవాచారి (కార్యదర్శి) గారలు కలరు.

శివకవులు: జానుతెనుగు

(19-వ పేజీ తరువాయి)

జ్ఞానము లేక యని యర్థము. ఇచట జానునకు చదువు అన్న యర్థము చెప్ప గుదురదు. కావున జానుతెనుగనగా శిష్టులు, పండితులు వ్యవహరించు మేలి తెలుగు.

జానుతెను గని స్పష్టముగా బేర్కొనక పోయినను కేతన తన యాంధ్రభాషాభూషణము లోని విభాగమును బేర్కొనినాడు. అత డుదాహరించిన భాషావిభాగములను జాగ్రత్తగా బరిశీలించిన నీ విషయము ఊహింప వీలగుచున్నది. చూడుడు:

తత్సమంబు నాగ దద్భవంబన నచ్చ
తెనుగు నాగ మఱియు దేశ్య మనగ
గ్రామ్య భాష నాగ గల వైదు తెఱగులు
వేఱె వేఱె వాని విస్తరించు.

(ఆంధ్రభాషాభూషణము. 18.)

ఇందు అచ్చతెను గని, దేశ్య మని భాషావిభాగములు వేర్వేఱుగా బేర్కొనబడినవి. అచ్చతెనుగు 'ఎల్లవారికి దెలిసెడి యా పలుకు'లని యాతడే పేర్కొనినాడు. ఇక దేశితెనుగు అతడే పేర్కొనిన అచ్చతెనుగుకంటె విలక్షణమైన దని యతడు దేశితెనుగుపదముల కిచ్చిన యుదాహరణపద్యములవలన దెలియుచున్నది. చూడుడు:

ఎఱుకువ నెత్తమ్మి యెరగలి యొసకంబు
నొసలింతి తేటి వెక్కసము నెమ్మి
మక్కువ చెచ్చెర మచ్చిక పొచ్చెము
కడిమి యేడ్తెఱ లగ్గు కలకలంబు
వన్నె విన్నదనంబు వీనులు వెన్నడి
యెక్కలి తివురుట యుక్కు మేటి
బాగు తొయ్యలి జోటి ప్రన్నన సరి జోటి
వేవలి పొలపంబు విన్ను మన్ను
నెల్లి కొఱలుట వీచోపు లల్లు మువిద
వీక కాఱియ గ్రద్దలు వేట గ్రేణి
కాను పొలిండు లోగి మొగి గనయు మిట్టి
తెఱగు పలుకులు ధర దేశితెనుగు లయ్యె.
తెమ్మెర లేమావి తెలిగన్ను క్రొన్నన
వలరాజు రేఱేడు వాలుగంటి
యలరుల పెండు తెక్కలికాడు క్రొమ్మించు
కెమ్మోవి కెంజాయ కమ్మతావి
కడలి తామరకంటి వెడవిల్తు డెడకాడు
నలువ కలువకంటి నాన సెగ
మెలనాగ ముద్దియ చెలువ చిగురుబోడి
తెఱవ తలిరుబోడి మెఱుగుబోడి
పదరు విసువుట పరిగమి పసలు నసదు
పొద్దు రేయెండ తబ్బిబ్బు పోటుముట్టు
తనివి వలవంత వెంత మంతన మనంగ
దేరనాడిన ధర దేశితెనుగు లయ్యె.

(ఆంధ్రభాషాభూషణము. 23, 24.)

ఈ పద్యములోని పదములను పరిశీలించిన నివి 'యెల్లవారికి దెలిసెడి యా పలుకులు' కావని, తెలుగులలో మంచి పరిచయముగల పండితులు, శిష్టులు తెలియదగు మాట లని, యందుచే నివి కేతనమతప్రకారము అచ్చతెనుగు కాదని తెలియుచున్నది. కేతనకవి తన కించుక పూర్వమే వెలసిన దేశికవులు (శివకవులు) తమ కావ్యములలో బ్రయోగించిన జానుతెనుగునే దేశికవులు వాడినదిగాన దేశితెను గని పేర్కొనియుండవచ్చును. శివకవులకావ్యములలోని జానుతెనుగును బరిశీలించిన నది కేతన పేర్కొనిన దేశితెనుగనియే స్పష్టముగా గుఱుతింపగలము ఈ దృష్టితో జూచిన పాలకురికి సోమనాథకవీశ్వరుడు వృషాధిపశతకములో జానుతెనుగున కిచ్చిన 'బలుపొడతోలు సీరయును' అన్న లక్ష్యపద్యములోని పదములు అచ్చతెనుగు కాదని, కేతనమతప్రకారము అవి దేశితెనుగు పదము లని అవి 'యెల్లవారికి దెలిసెడి యా పలుకులు' కావు కాన, ఆ దేశితెనుగే శివకవులు పేర్కొనిన జానుతెను గని తేలుచున్నది.

ఇందుచే జానుతెను గన కర్ణాటక లాక్షణికులు పేర్కొనిన సమసంస్కృతోక్తియు, తెలుగు లాక్షణికులు పేర్కొనిన యచ్చతెలుగును గాక 'యెల్లవారికి దెలిసెడి యా పలుకులు' కాని దేశిపదములు ప్రధానముగా ప్రయోగించిన తెను గని, దానికి ప్రసన్నత, సర్వసామాన్యత ప్రత్యేక గుణము లని తెలియదగును.

సంస్కృతప్రధానమై దేశిపదములు విరళముగా నున్న—తమకు పూర్వమునను, తమ కాలమునను వెలయుచుండిన—భవికవుల కావ్య సాహిత్య సర్వస్వమును జూచి, దేశికవితలో ప్రాధాన్య ముండవలయు నని పూని శివకవులు సాహిత్య భాషలో జానుతెనుగును వెలయించినారు; అభ్యుదయము నవతరింపజేసినారు! ఈ యభ్యుదయవాంఛ యప్పటప్పటే పొడసూపుచుండినందున నన్నిచోడుని కుమారసంభవములో జానుతెనుగు ప్రారంభదశలో నుండి పాలకురికి సోమనాథుని కవితలో పరిణతి చెందిన దని, శివకవుల యభ్యుదయతపస్సు భాషా సాహిత్యములో సోమనాథుని కాలమున ఫలించిన దని తెలియగలను. కుమారసంభవములో జానుతెనుగు పదములు ప్రయుక్తము లయినను, నది ప్రారంభదశయే కావున మిక్కిలిగా సాహసింపజాలని నన్నిచోడుడు నన్నయాదికవులవలె సంస్కృత సమాస భూయిష్ఠముగా నే రచన సాగించినాడు. సోమనాథుడు ధీరుడై యభ్యుదయ పథమున నొక యడుగు ముందునకు సాగి జానుతెనుగును కవితలో వెలయించినాడు. సాహిత్యాకాశములో నాకతూరి యభ్యుదయపు మెఱుపు మెఱయించినాడు!

బ్రహ్మశ్రీ కాశిభట్ట కృష్ణశాస్త్రిగారి నిర్యాణం

విశాఖపట్టణం జిల్లా సాలూరు అనే పురమందు శ్రీకృష్ణరాయశాస్త్రి అను వ్యవహారిక నామముతో పేరుబడిన యీ మహనీయుడు జన్మించినాడు. ఈ మహాశయుడు బాల్యమందు సాలూరులోనే మొదట చిన్న క్లాసులలో ఆంగ్లభాష నభ్యసించుచూ తెలుగులో భాషాజ్ఞానం చాలా మట్టుకు సంపాదించి కవిత్వధార గలిగినందున గద్యపద్యము ల్లల్లుచుండిరి. అప్పుడు యీయనకు బాలకవి యను టైటలు యిచ్చిరి. తరువాత ఆ యూరు విడచి ఆంగ్లభాషను 5వ ఫారమువరకు ఆయనసోదరీమణి భావగార్లవద్ద పార్వతీపురంలో ఆంగ్లబాష అభివృద్ధిని చేసుకొని తదుపరి విజయనగరం వెళ్ళి అచ్చట తెలుగు గీర్వాణభాషలలో ప్రవీణులై తర్కము, వ్యాకరణము మొదలగు శాస్త్రములలో ఉత్తీర్ణులయి కవిత్వం చెప్పుతూ గొప్పపండితులవద్ద మెప్పొందిరి. ఏ పరీక్షలు ప్యాసు కాకుండగనే ఆంధ్రగీర్వాణపండితులని పేరు పొందిరి. ఆంగ్లభాషలోను సైన్సు (*Science*) లిటరేచరు (*Literature M. A.*) ఎం. ఏ.లకుగల పాండిత్యం సంపాదించిరి. వీరికి యిప్పుడున్నూ విద్యాకర్షణయందే హెచ్చు పరిశ్రమ వుండెడిగాని ప్రాపంచిక దేహసౌఖ్యముల యందు నిర్లిప్తభావమే.

వీరు వేదాంతశాస్త్రము ప్రస్థానత్రయాంతం భాష్యత్రయములతోను మధుసూదనాదివ్యాఖ్యానములు మొదలగువాటిని అవలోడనజేసి తరువాత ధర్మశాస్త్రముల యందు కూడా సారములను గ్రహించి వీట నన్నింటి యందును గంభీరోపన్యాసములను గొప్పగొప్ప సభలతో నొసంగుచుండెడివారు. ఒకప్పుడు గుంటూరు సభలో సుమారు 5-6 వందల ఆంధ్ర గీర్వాణపండితులు సుకవుల సభామధ్యమందు ఆహ్వానించబడి 3 గంటలు సంస్కృతభాషలో గొప్ప ఉపన్యాసం యివ్వగా వారందరు ఆనందించి గొప్పగా సన్మానించి మహాకవి అను బిరుదాంకితంతో 5 (అయిదు) తులములు యెత్తు గల బంగారపు మెడల్‌ను బహూకరించిరి. చెన్నపట్నంలోకూడా ఇట్లే ఆంగ్ల భాషాయుక్తంగా ఉపన్యసించి, గొప్ప గ్రంథములను సంపాదించిరి. మరియొకప్పుడు కాశీ వెళ్ళి మిస్ అనిబిసెంటమ్మగారి లైబ్రరీలో ఉపన్యసించగా, వీరి కోరికపైని ఋగ్వేదంలో కొంత గ్రంథం అక్కడ యిచ్చిరి. తద్గ్రంథమునకు కొంతమట్టుకు వ్యాఖ్యానం వ్రాసిరి.

ఈ శాస్త్రిగారు కొంతకాలం మదనపల్లిలో హైస్కూలులో సంస్కృతపండితులుగా వుంటూ తన గ్రామమునకు బంధువులకు దూరముగా నుండుటంబట్టి యీ విశాఖపట్నం జిల్లాకు రిటర్ను అయి బోర్డుకు దరఖాస్తు పెట్టగా గజపతినగరం స్కూలులో పండితుడుగా నియమింపబడి కొంతకాల మచ్చట పనిచేసి పిమ్మట పాలకొండ పార్వతీపురం గ్రామములలో బోర్డు హైస్కూళ్లలో గీర్వాణపండితులుగా యుంటూ పెద్ద ఆఫీసర్ల పరిచయమున తుదకు 4-5 సం॥రముల క్రిందటనుంచి స్వగ్రామమయిన సాలూరుబోర్డు హైస్కూలులో పండితుడుగా నుండిరి. పార్వతీపురం స్కూలులో పండితులుగా నున్నప్పుడు వీరిని ఆ డి. మునసబుగారు వకీళ్లు వీరి ఉపన్యాసాపేక్షితులై కోరగా శ్రీ భగవద్గీతలను గురించి గొప్ప అసమానమైన ఉపన్యాసములు చెప్పినపయిని మెండుగా సంతసించి, శ్రీ భగవద్గీతా శాస్త్రమంతయు ఆమూలాగ్రంగా వ్యాఖ్యానముతో దయచేసి చెప్పుమని కోరగా వారందరికి ఉపదేశంచేసి, ఆ గీతాశాస్త్ర విశేషార్థములతో 8 మాసములు బోధించిరి. అందుపైని వారందరు సచ్ఛిష్యులయి వీరిని బహుగా సన్మానించిరి. గీతాబోధానంతరం సుమారు ఐదు వందలమంది బీదలకు వికలాంగులకు సంతర్పణ చేయించిరి. అక్కడ వునికి అయిన తరువాత వీరి స్వగ్రామమైన సాలూరు బోర్డు హైస్కూలులోకి ట్రాన్సుఫరు అయిరి.

ఈ శాస్త్రిగారు ఒకప్పుడు 20 సం॥ర॥ముల వయస్సులో నుండగా దివంగతులయిన లోకమాన్యగంగాధరతిలక్ మహాశయుని దర్శించి ఆయనతో గీర్వాణభాషను అద్వైతాంశములను గురించి ప్రసంగించగా లెస్సయిన విమర్శకు డని ఆయనకు సర్టిఫికేటు యిచ్చినారు.

జీవితకాలంలో మరియొక సమయమున పెన్నవయస్సులోనే ఒక కాననమున కేగగా అక్కడ నొక యోగివరుని దర్శించి 4 రోజులు పండ్లు నీటిఆహారములతో ఆయాశ్రమంబున వుంటూ ఆయనవలన కొన్ని సిద్ధులను బడసిరి. అచటనే ఒకనాటి ప్రాతఃకాలమున నొక జలాశయమునకు స్నానం నిమిత్తం పోవుచుండగా మధ్యదారిలో నొక వ్యాఘ్రరాజు ఈయనకు కనబడి పెద్ద అరపులు అరచినది. అప్పుడు ఈయన వున్న చోటులో తాను కండ్లు మూసుకొని కూర్చుండి, అయిదు నిమిషములు మననంజేసి కండ్లు తెరచి చూచినంతలో ఆ బెబ్బులి కానరాకపోయెను. స్నానం జేసి రాగానే ఈయన పదరు ఆ యోగితాతో యీ వృత్తాంతము చెప్పగా ఆ మహనీయుడు శాస్త్రి చేసి నీవు సిద్ధపురుషుడవు నీకు సర్వదా సర్వత్ర జయమే చేకూరును అని ఆశీర్వదించి బంపెను. కీర్తిశేషులైన మహాత్మాగాంధీగారు సప్రాణులైయున్నప్పుడు ఒకానొక సమయమందు పత్రికద్వారా ధర్మాద్వైత జిజ్ఞాసలు గురించి ప్రశంసించగా వీరి (ఈ శాస్త్రిగారి) పాండిత్యకవితా విమర్శలకు మహాత్ముడు చాలా శ్లాఘించి నీవు గొప్పవిమర్శగల పెద్దకలవాడవు అని ఆంగ్లభాషను పత్రికద్వారా జూపించిరి. ఆ పత్రిక నేటివరకు శ్రీ శాస్త్రిగారి లైబ్రరిలో సంగ్రహమైయున్నది. ఈ అంశములు పొగడ్త గాదు. ఈ మహనీయుడు సుమారు 1200 పుస్తకములు జదివి అందలి రహస్యములను తనఉపన్యాసములలో గొల్లించుచుండెడివారు. వీరు కొన్ని చిన్నవి ఘనమైనవి గ్రంథములను కూడా రచించిరి. అవి ఏవి అనిన-"మృషామృషి, కవి వినోదశతకము, సాలూరు దేవతయగు పారమ్మ తల్లి శతకము, గీతగీతా" యింకా మరి కొన్ని చిన్న గ్రంథములను అచ్చొత్తించిరి. గీతాశాస్త్రములో 10 అధ్యాయములకు స్వంతవాక్యములు వ్రాసిరి. ధనసహాయము లేక వారు రచించిన అనేక గ్రంథములు అచ్చుబడక వారి పుస్తక భాండారములో ప్రకాశింపుచున్నవి. తమ్ము బయట ప్రకాశింపజేయుటకు ఏ ఉదారచరిత్రుడైనా బయలుదేరునాయని వేచియున్నవి.

పార్వతీపురం డి. మునసబుగారు వకీళ్లకు ఈశావాస్య కఠ మాండూక్య ఉపనిషత్తులను బోధచేయగా వారు ఆమూలాగ్రంగా విని వాటిని వ్యాఖ్యానించుమని ఈ శాస్త్రిగారిని కోరగా ఈ ఉదారచరిత్రుడు వాటికి వ్యాఖ్యానములు వ్రాసి వారికి యిచ్చిరి. వారు కొద్ది రోజులలో ముద్రణ చేయించెద రని వాగ్దానం చేసిరి.

ఈ మహావ్యక్తికి స్థూలదేహపటిమ లేనప్పటికి మానసికశక్తు లనేకములు గలవై యుండెను.

మరి ఒక సమయములో తిరుపతి వెంకటకవులతో శాస్త్రార్థములను, కవిత్వం, సాహిత్యం వీటినిగురించి ప్రసంగించగా వారు అత్యానందభరితులై చాలా ప్రజ్ఞావంతు డని బహిరంగపరచిరి. ఒక గౌరవపత్రిక నొసంగిరి.

చెన్నరాష్ట్రములో అయిదుగురు పండితులు గొప్ప విమర్శకులు ఉన్నారనిన్ని, వారిలో యీ క్రష్ణరాయశాస్త్రిగారు నొక కవిమర్శకుడుగా పరిగణింపబడినట్లు పండితోక్తులు వింటిమి.

కొద్దిరోజుల క్రిందటనే సాలూరుబోర్డు హైస్కూలు టీచర్లు మరికొందరు మహాజనులు "*Atom Bomb*" (అటంబాంబు) సృష్టినిగురించి ముచ్చటించగా అథర్వణవేదశ్రుతులను చదివి వాటి అర్థభావములను సైన్సు (*Science*) శాస్త్రమునకు పోల్చి అన్వయించి రని తెలిసినది. ఆ ఉపాధ్యాయు లందరు వీరు చాలా గొప్ప విమర్శకు లని శ్లాఘించిరి.


ఈ శాస్త్రిగారు సాలూరులో నొక అర్థవిద్యాలయమున్ను, తన సచ్ఛిష్యులున్న పార్వతీపురంలో నొక శాంతిసమితియున్ను స్థాపించిరి. ఇట్టి గుణగరిష్ఠుడు ప్రజ్ఞాన ఘనమహాపండితుడున్ను మహాకవియునగు కాశిభట్ట కృష్ణరాయశాస్త్రిగారు తన 50వ (ఏబది) సం॥రం ప్రాయమున 1949 సం॥రం ఫిబ్రవరి నెల 21 (21-2-49) తేదీ ఉదయం 4 గంటల 30 ని॥ (*A. M.*) గంటలవేళప్పుడు అనాయాసముగా 'ఓం' అను ప్రణవమును ఐదు పర్యాయము లుచ్చరించుచూ ఈ పాంచభౌతికశరీరమును విడచిపెట్టి శ్రీ క్రష్ణ నిర్యాణంవలె నిర్యాణం బొంది దేహముక్తులయిరి అని వక్కాణించుటకు సంశయము లేదు. వీరి నిర్యాణమువల్ల వీరి కుటుంబం బంధువులకేగాక కొన్ని జిల్లాలకు గూడా నష్టం గలిగినదని చెప్పుటకు శోచనీయము.

పార్వతీపురం సాలూరుపురములలో సహృదయులగు యీ కీర్తిశేషులైన క్రష్ణరాయశాస్త్రిగారి సచ్ఛిష్యులున్ను పరిచయస్థులున్ను వారి (శాస్త్రిగారి) జీవితకాలంలో ఎట్టి భక్తి విశ్వాసములతో వారిని సన్మానించిరో తదనుసారంగా ఇప్పుడు ఆయననిర్యాణానంతరం ఆయనయశస్సు ప్రపంచములో విస్తరించు సూచనలుగా ఆయనను గురించి ఘనకార్యములను చేయుట న్యాయమున్ను సమంజసమున్ను అని మా అభిప్రాయము.


ఈ మహనీయుని అంతరాత్మ నిర్వికార పరబ్రహ్మ చైతన్యమందు ఐక్య మగుగాక!

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.


వేపా భీమశంకరం,
కూరెళ్ల నరసింహం.



సాంచీ స్తూపము




సాంచీస్తూపములోని సుందరమైన ఉత్తరద్వారము.




పడమర ద్వారము





తూర్పు ద్వారము



దక్షిణ ద్వారము

బుద్ధదేవుని జయంత్యుత్సవం

ఈ మే 2 వ తేది సోమవారం నాడు బీహారు రాష్ట్రమంతటా బుద్ధదేవుని జన్మదినోత్సవము జరిగింది. బుద్ధుని స్మృతిచిహ్నలలో సాంచీస్తూపం ప్రముఖమైనది.

Regd. No. M. 4479

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., G. T. Madras 1